

సూరత్: అంతర్జాతీయ పతంగుల ఫెస్టివల్‌లో భాగంగా బుధవారం కోబ్రా పతంగం విన్యాసాలు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 61 • సంచిక: 2 • గురువారం 11 జనవరి 2018 • విజయవాడ ❋ పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, తిథి: బహుళ దశమి రా. 9.00 వరకు, అనంతరం ఏకాదశి; నక్షత్రం: స్వాతి ఉ. 8.27 వరకు, అనంతరం విశాఖ; అమృతకాలం: రా. 12.30 నుండి 2.05 వరకు; వర్జ్యం: మ. 2.18 నుండి 4.00 వరకు, దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, తదుపరి మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు



విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు

తలుపులు బార్లా!

- సింగిల్ బ్రాండ్ రిటైల్‌కు 100 శాతం
- ఎయిరిండియాలో 49 శాతం
- సులభతర వాణిజ్యానికి మరింత ఊతం
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు 6

ఇస్రో చైర్మన్‌గా శివన్



- రేపే పీఎస్ఎల్వీ-సి40 ప్రయోగం 5

అభివృద్ధిలో

మనమే ముందు

- జాతీయ స్థాయికి రెట్టింపు వేగం
- మెరుగ్గా ఉపాధి అవకాశాలు
- ప్రజల ఆదాయం పెంపునకు చర్యలు
- ఉద్యాన పంటలకు భారీగా రాయితీలు
- ఆక్వా అభివృద్ధికి మరింత కృషి
- టెక్నాలజీతో వ్యవసాయం
- అన్ని జిల్లాల్లోనూ రేవుల అభివృద్ధి
- తూర్పుగోదావరి జిల్లా జన్మభూమి గ్రామసభలో సీఎం చంద్రబాబు

ముమ్మిడివరం (తూర్పుగోదావరి), ప్రభన్యూస్ బ్యూరో: దేశం అన్నిరంగాల్లో దూసుకుపోతోంది. అభివృద్ధిలో ముందంజలో ఉంది. అయితే జాతీయ స్థాయితోపోలిస్తే ఆంధ్రప్రదేశ్ మరింత వేగంగా ముందుకురుకుతోందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 2015-16లో జాతీయ వృద్ధి సగటు 7.9శాతం నమోదైతే ఆ ఏడాది ఆంధ్రప్రదేశ్ 10.95శాతం వృద్ధి నమోదు చేసింది. 2016-17లో జాతీయ వృద్ధిరేటు 7.12శాతం కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఇది 11.17గా ఉంది. 2017-18తొలి అర్ధభాగంలో జాతీయ వృద్ధి 5.8శాతం ఉంటే రాష్ట్రం 11.37శాతం వృద్ధి సాధించింది. మలి అర్ధసంవత్సరంలో కూడా ఈ వృద్ధి ఇలాగే కొనసాగుతోందని ఆయన చెప్పారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం చెయ్యేరు గున్నేపల్లి గ్రామంలో జరిగిన జన్మభూమి గ్రామసభకు ➪ 2వ పేజీలో...

అనంతను దత్తత తీసుకుంటా: లోకేష్ 7లో

నాలా బిల్లు మళ్లీ వెనక్కి
- తిప్పి పంపిన గవర్నర్



స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.875 కోట్లకు పైగా రుణాలను అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అప్పుకంటే... గ్రాంట్ మేలు!

- కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీకి చంద్రబాబు లేఖ
- మొత్తం రూ.16,447 కోట్లు రావాలి
- కేంద్ర ప్రాయోజిత పథకాల బకాయిలివి
- నాబార్డ్ ద్వారా గ్రాంట్‌గా ఇవ్వండి
- ప్రత్యేక ప్యాకేజీ కింద 90:10 నిష్పత్తిలో నిధులివ్వాలి
- నాబార్డ్ రుణాలను ఏపీ పరిమితిలో కలపొద్దు
- 17న ప్రధానితో భేటీకానున్న ముఖ్యమంత్రి
- భేటీకి ముందు లేఖతో విశేష ప్రాధాన్యం 2లో

అభివృద్ధిలో మనమే ముందు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వృద్ధి రేటు పెరగడం ద్వారా రాష్ట్రప్రజల జీవన ప్రమాణాలు మెరుగౌతాయన్నారు. అయినప్పటికీ దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలన్నింటికంటే ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఆదాయం తక్కువగా ఉందన్నారు. కేరళలో 1,58,348రూపాయల తలసరి ఆదాయం ఉంటే తమిళనాడులో 1,57,106, కర్ణాటకలో 1,59,893లుగా ఉందన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఇది 1,22,376మాత్రమే నమోదైందన్నారు. 2014లో రాష్ట్ర విభజన నాటికి ఉమ్మడి రాష్ట్రంలో తలసరి ఆదాయం 89,214లుంటే విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆదాయం రూ.82,270కు పడిపోయిందన్నారు. ఈ మూడేళ్ళలో ప్రజల ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాల మెరుగుకు చేపట్టిన చర్యల్ని ఆయన



వివరించారు. సంప్రదాయ వ్యవసాయం కంటే పళ్ళు, కాయగూరలు, పాలు తదితర వ్యవసాయాధారిత రంగాల్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. అలాగే రాష్ట్రంలో ఆక్వా అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గొర్రెలు, చేపల పెంపకానికి రాయితీలిస్తున్నామన్నారు. ఉద్యానవన పంటలకు రాయితీలిస్తున్నామన్నారు. తద్వారా వ్యక్తిగత ఆదాయ వృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మలేషియా, సింగపూర్‌లు ఒకప్పుడు కలిసుండేవి. సింగపూర్ ప్రాంతం ఎందుకూ కొరగానిది కావడంతో మలేషియా దాన్ని వదిలించుకుంది. అయితే 50ఏళ్ళలో సింగపూర్ అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి చెందింది. అలాగే విడివడ్డ తర్వాత దక్షిణకొరియా ఐదు దశాబ్ధాల్లో అగ్రస్థాయి రాజ్యాల్తో సరిసమాన స్థాయికెదిగింది. ఉత్తరకొరియా మాత్రం ఉన్న స్థితిలోనే ఆగిపోయింది. స్వాతంత్రానికి పూర్వం నుంచి తెలుగు ప్రాంతం మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉండేది. పొట్టిశ్రీరాములు ఆత్మార్పణతో ఆంధ్రరాష్ట్రం ఆవిర్భవించింది. అప్పటికప్పుడు రాష్ట్రానికి ఆస్తులు రాలేదు.. అప్పులు కూడా నెత్తినపడలేదు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం అనంతరం ఆరుదశాబ్ధాల పాటు హైదరాబాద్‌ను అందరం కలసి అభివృద్ధి చేశాం.. అక్కడ ఆదాయం ఇప్పుడు తెలంగాణాకు పరిమితమైంది. అసంబద్ధ విభజనతో ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి పునర్‌నిర్మించుకోవాల్సిన ఆవశ్యకతేర్పడిందంటూ చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాను సాంకేతిక విద్య ప్రాధాన్యతను గుర్తించి ప్రోత్సహించానన్నారు. ఈ ఫలితంగా ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐటిరంగ నిపుణుల్లో 25శాతం భారతీయులుంటే ప్రతి నలుగురిలో ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే ఉన్నారన్నారు. పునర్ నిర్మాణంలో భాగంగా రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధికి బీజాలేశామన్నారు. రాజధానిలేని ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ స్థాయి నగర నిర్మాణానికి ఉపక్రమించామన్నారు. శాతవాహనుడు అమరావతినే రాజధానిగా చేసుకుని దేశాన్నేలాడని గుర్తు చేశారు. ఆ ప్రాంతంలోనే నాగార్జునుడు తొలి విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పి ప్రపంచానికి ఆధునిక విజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. వీర్నుంచే తాను కూడా ఉత్తేజాన్ని పొందానన్నారు. రాష్ట్రానికున్న సుమారు వెయ్యి కిలోమీటర్ల సముద్ర తీరాన్ని సమర్ధవంతంగా వినియోగించుకుంటున్నామన్నారు. ప్రతి జిల్లాలోని రేవుల నిర్మాణం ప్రారంభించామన్నారు. తీరం వెంబడి పారిశ్రామిక కారిడార్‌లు అభివృద్ధి పరుస్తున్నామన్నారు. వ్యవసాయంలో ఆధునిక మెళకువలు ప్రవేశపెడుతున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. నదుల్ని అనుసంధానించి అన్నిప్రాంతాలకు తాగు, సాగునీటినందిస్తామన్నారు. పోలవరాన్ని సకాలంలో పూర్తిచేస్తామన్నారు. దీంతో రెండుపంటలకు సమృద్ధిగా నీరందుబాటులోకొస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు కళా వెంకట్రావు, సుజయ్ కృష్ణరంగారావు, ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, అయితాబత్తుల ఆనందరావు, గొల్లపల్లి సూర్యారావు, కలెక్టర్ కార్తికేయమిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీ జాబితాలోకి మత్స్యకారులు



ముమ్మిడివరం (తూర్పుగోదావరి), ప్రభన్యూస్ బ్యూరో: ప్రస్తుతం షెడ్యూల్ తరగతుల్లో ఉన్న కులస్తులకు ఏమాత్రం భంగంవాటిల్లకుండా రాష్ట్రంలోని మత్స్యకారుల్ని ఎస్‌టి జాబితాలో చేర్చనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా గున్నేపల్లి జన్మభూమి సభలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్ధికంగా, సామాజికంగా తీవ్ర వెనుకబాటుకు గురై ఉన్నారన్నారు. దీర్ఘకాలంగా తమను ఎస్‌టి జాబితాలోకలపాలంటూ వారు ఉద్యమిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సమాజంలోని అంతరాన్ని పారద్రోలి అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్నదే తన లక్ష్యంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మతం విశ్వాసం ప్రాతిపదికగా ఏర్పడితే కులం వారసత్వంగా సంక్రమిస్తుందన్నారు. కొన్ని కులాలు ఇప్పటికీ తీవ్ర వెనుకబాటుకు గురై ఉన్నాయన్నారు. వాటిని ఉద్ధరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. అలాగే అగ్రకులాల్లోనిపేదలకు కూడా తగిన రీతిలో సహాయ సహకారాలందిస్తామన్నారు. ఇప్పటికే తానిచ్చిన హామీ మేరకు కాపులకు బిసి రిజర్వేషన్ కల్పిస్తూ తీర్మానం చేశామన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కట్టుబడున్నామన్నారు. కేంద్రం ప్రకటించిన జాబితా మేరకు ఆంధ్రప్రదేశ్‌లో 9.2శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువనున్నారన్నారు. వీరి ఆదాయ ప్రమాణాలు పెంచాల్సిన ఆవశ్యకతుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలంతా ఆదాయంతో పాటు ఆనందంగా ఉండడమే తన లక్ష్యంగా చెప్పారు.

కేవలం మెరుగైన సదుపాయాలు, ప్రమాణాలే కాదు.. ప్రతిరోజు ప్రతి నిమిషం తాను చేసే పనిలో ఆనందాన్ని చవిచూసేలా తీర్చిదిద్దుతానన్నారు. మానవ జన్మకతే సార్ధకతగా చెప్పారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. దీన్ని ఒక మిషన్‌గా భావించి ముందుకెళ్తున్నా మన్నారు. ఇందుకోసం ప్రకృతి ఆరాధాన చేపట్టామన్నారు. ఇప్పటికే జలసిరి హారతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల్లోనే సూర్య ఆరాధాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. గోదావరి, కృష్ణా నదుల పుష్కర సమయంలో చేపట్టిన సంకల్పం సత్ఫలితాల్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు చినరాజప్ప, సుజయ్ కృష్ణరంగారావు, కిమిడి కళావెంకట్రావు, ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, అయితాబత్తుల ఆనందరావు, కలెక్టర్ కార్తికేయమిశ్రా, ఎమ్‌పి పండుల రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గిస్తాం

ముమ్మిడివరం (తూర్పుగోదావరి), ప్రభన్యూస్ బ్యూరో: త్వరలోనే విద్యుత్ చార్జీలు తగ్గించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా చెయ్యేరు గున్నేపల్లి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ తాను తిరిగి అధికారంలోకొచ్చేసరికి రాష్ట్రం 22.50మిలియన్ యూనిట్ల కరెంట్ కొరతను ఎదుర్కొనేదన్నారు. కేవలం మూడు మాసాల్లోనే ఈ కొరతను అధిగమించామని, ఇప్పుడు రాష్ట్రం మిగులు విద్యుత్‌ను సాధించిందన్నారు. విస్తారంగా అందుబాటులో ఉన్న సౌరశక్తితో పాటు గాలిమరల ద్వారా కూడా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. దీంతో ఉత్పాధక ధర తగ్గిందన్నారు. గతంలో ప్రైవేటు సంస్థల్నుంచి అధికధరపై కొనుగోలు చేయాల్సొచ్చేదన్నారు. కాగా తగ్గిన ఉత్పాదక వ్యయానికనుగుణంగా విద్యుత్ సరఫరా ధర కూడా తగ్గించే ప్రతిపాదన ఉందన్నారు. దేశంలోనే అతితక్కువధరకువిద్యుత్ సరఫరా చేసే రాష్ట్రంగా ఏపీ త్వరలో ఆవిర్భవిస్తుందన్నారు. ఇప్పుడు రెండో విడత విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో గ్యాస్ గ్రిడ్ నెలకొల్పామన్నారు. గతంలో మహిళలకు తాము అమలు చేసిన దీపం పథకాన్ని కాంగ్రెస్ పాలకులు ఆర్పేశారన్నారు. తిరిగి ఈ పథకాన్ని కొనసాగించామన్నారు. నూరుశాతం గృహాలు గ్యాస్ కనెక్షన్లు అందించామన్నారు. స్థానికంగా లభ్యమౌతున్న గ్యాస్‌ను స్థానిక పరిశ్రమలకు సరఫరా చేసే అవకాశాల్ని పరిశీలిస్తున్నామన్నారు. ఇది అందుబాటులోకొస్తే పారిశ్రామిక ఉత్పత్తుల తయారీ వ్యయం తగ్గుతుందన్నారు. వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేశామన్నారు. అన్ని ఆవాసాలకు తాగు నీటితో పాటు ఆయకట్టు శివారు ప్రాంతానిక్కూడా సాగునీరు అందించనున్నామన్నారు. ఇప్పటికే 15వేల కిలోమీటర్ల పొడవైన గ్రామీణ రహదార్లనుసిసి రోడ్లుగా మార్చామన్నారు. అన్ని గ్రామాల్నుంచి మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల కెళ్ళే రోడ్లను అనుసంధానిస్తామన్నారు. రాష్ట్రంలో ఫైబర్‌గ్రిడ్ నెలకొల్పామన్నారు. ఇప్పటికే లక్షకు పైగా ఇళ్ళకు ఈ కనెక్షన్లు అందించామన్నారు. 15ఎమ్‌బిపిఎస్ వేగంతో ఇంటర్‌నెట్ సరఫరా చేస్తున్నామన్నారు. దీంతో ఐదొందల వరకు ఛానల్స్‌ను ఉచితంగా చూడొచ్చన్నారు. మూడు టెలిఫోన్లు ఉపయోగించడంతో పాటు వైఫై సేవలు పొందొచ్చన్నారు. ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇందుకోసం 58వేల కోట్లతో 19లక్షల ఇళ్ళను కొత్తగా నిర్మిస్తున్నామన్నారు. మానవ సంబంధాల్ని పెంచే ప్రయత్నం మొదలెట్టామన్నారు. ఉమ్మడి కుటుంబాల్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. త్వరలోనే ఇందుకోసం ఓ కొత్త పథకాన్ని అమల్లోకి తెస్తామన్నారు.

ప్రజాసేవ కేంద్రాలుగా ప్రభుత్వాఫీసులు



- నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన 5వ విడత జన్మభూమి
- గ్రామాలకు, వార్డులకు గ్రేడింగ్
- ఆహార దిగుబడుల నాణ్యతలో అగ్రగామిగా నిలవాలి
- జన్మభూమి-మా ఊరు టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం

అమరావతి, ఆంధ్రప్రభ: మనం చేస్తుంది కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని ప్రజా సేవ అన్న అంశమని ప్రతి ఉద్యోగి, ప్రజా ప్రతినిధి గుర్తుంచుకోవాలని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రజా సేవ కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 2022 నాటికి దేశంలో మూడవ అగ్రగామి రాష్ట్రంగా, 2029 నాటికి దేశంలోనే నెంబర్ వన్‌గా నిలవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2050 నాటికి ప్రపంచంలోని ఐదు నగరాల్లో ఒకటిగా అమరావతి అత్యున్నత రాష్ట్రంగా రూపుదిద్దుకోవాలన్నదే తమ అభిమతమని చెప్పారు. బుధవారం ముఖ్యమంత్రి జన్మభూమి-మా ఊరు కార్యక్రమంపై వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న 5వ విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని ప్రజల్లో విశ్వాసం, సంతృప్తి స్థాయిని పెంచిందన్నారు. గడిచిన మూడున్నరేళ్లుగా అభివృద్ధి, ఆర్థిక అసమానతలపై దృష్టి పెట్టడమే కాకుండా దీని కోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. పేదరికాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంతోనే కుటుంబ, సమాజ వికాస కార్యక్రమాలను తీసుకు వచ్చామని చెప్పారు. కొత్తగా మంజూరు చేస్తున్న నాలుగు లక్షల పెన్షన్‌లకు సంబంధించిన ధృవపత్రాలను గ్రామసభల్లో లబ్ధిదారులకు అందజేయాలని అధికారయంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు.

గ్రామాలకు, వార్డులకు గ్రేడింగ్‌లు

జన్మభూమి నిర్వహణపై గ్రామాలు, వార్డులకు గ్రేడింగ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉత్తమ గ్రామ, వార్డు, మండలం, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లకు అవార్డులు ఇచ్చి మరింత ప్రోత్సాహం అందించాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు అయ్యేలా చూడాలని నెలకొసారి గ్రామాలను సందర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు.


50 లక్షల మంది హాజరవ్వడం విశేషం

దాదాపు 50 లక్షల మంది జన్మభూమి గ్రామసభల్లో పాల్గొనడం విశేషమని ఇది ప్రజా స్పందనకు నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. సాధికార మిత్రల భాగస్వామ్యం తొలిరోజున 48 శాతం ఉంటే 9వ రోజున 65 శాతానికి చేరుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీపై 68 శాతం, రేషన్ కార్డులపై 67 శాతం, చంద్రన్న బీమాపై 71 శాతం ప్రజా సంతృప్తి వ్యక్తమైందని దీనిని 80 శాతానికి తీసుకువెళ్లేవిధంగా అధికార యంత్రాంగం కృషి చేయాలని సీఎం కోరారు.


ఆహార దిగుబడుల నాణ్యతలో అగ్రగామిగా నిలవాలి

ఆహార దిగుబడుల నాణ్యతలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవాలనే ఆకాంక్షను ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు. ప్రపంచానికే నాణ్యమైన ఆహార పదార్థాలు సరఫరా చేసే స్థాయికి చేరుకోవాలన్నారు. ఆక్వా, ఆహార దిగుబడులు, హార్టీ కల్చర్ ఉత్పత్తుల నాణ్యతలో రాష్ట్రం ముందంజలో ఉండాలన్నారు.

కృష్ణా కలెక్టర్ భేష్



జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి సంబంధించి ఫిర్యాదుల పరిష్కారం, ప్రజా సంతృప్తి, అత్యున్నత ప్రమాణాల్లో కృష్ణాజిల్లా ముందుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. కృష్ణాజిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం పనితీరును ఆయన కొనియాడారు. కృష్ణాజిల్లా స్ఫూర్తితో అన్ని కలెక్టరేట్లలో ప్రమాణాలు పెరగాలని సూచించారు. దేశ వ్యాప్తంగా 83 పంచాయితీలకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇస్తే వాటిలో 33 మన రాష్ట్రానికి దక్కడం అభినందనీయమని ఇది ప్రతి ఒక్కరు గర్వించదగ్గ అంశమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 40శాతం పైగా అవార్డులు రాష్ట్రానికి వచ్చాయని ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో నెంబర్ వన్‌గా నిలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు, వికలాంగులు సంస్థ చైర్మన్ జి.కోటేశ్వరరావు, రియల్ టైమ్ గవర్నెన్స్ సీఈవో బాబు.ఎ, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రామాంజనేయులు, ప్రణాళిక శాఖ అధికారులు సంజయ్ గుప్తా, మురళి, సెర్ప్ సీఈవో కృష్ణమోహన్, రైతు బజార్ల సీఈవో రమణమూర్తి, వివిధ జిల్లాల కలెక్టర్లు, జన్మభూమి నోడల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



అప్పుకంటే గ్రాంట్ మేలు!





కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీకి చంద్రబాబు లేఖ

- మొత్తం రూ.16,447 కోట్లు రావాలి
- కేంద్ర ప్రాయోజిత పథకాల బకాయిలివి
- నాబార్డ్ ద్వారా గ్రాంట్‌గా ఇవ్వండి
- ప్రత్యేక ప్యాకేజీ కింద 90:10 నిష్పత్తిలో నిధులివ్వాలి
- నాబార్డ్ రుణాలను ఏపీ పరిమితిలో కలపొద్దు
- 17న ప్రధానితో భేటీకానున్న ముఖ్యమంత్రి
- భేటీకి ముందు లేఖతో విశేష ప్రాధాన్యం

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేకు సంబంధించి వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులను త్వరిత గతిన విడుదల చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం కేంద్ర ఆర్ధిక శాఖా మంత్రి అరుణ్ జైట్లీకి ప్రత్యేకంగా లేఖ రాశారు. ముఖ్యమంత్రి ఈనెల 17న ఢిల్లీలో ప్రధాని మోడీని కలవనున్న నేపథ్యంలో ఈ లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాని భేటీలో ఏపీకి సంబంధించిన పలు అంశాలపై సీఎం చర్చించనున్నారు. కాగా తాజాగా ముఖ్యమంత్రి కేంద్ర ఆర్ధికశాఖా మంత్రికి రాసిన లేఖ సారాంశం ఇలా ఉంది. మొత్తంగా చూస్తే 2015-16 నుండి 2019-20 వరకు కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ. 16, 447 కోట్లు ఆంధ్రప్రదేశ్‌కు రావాలి. సత్వరమే ఈ నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలి. అంతర్జాతీయ బహుముఖ ఆర్థిక సంస్థల నుండి కాకుండా నాబార్డ్ ద్వారా ఏపీలో చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు రుణ మంజూరుకు అవకాశం కల్పించాలి. మొత్తం ఆరు ప్రాజెక్టులకు గాను 16,725 కోట్ల నిధులను నాబార్డ్ ద్వారా మంజూరు చేయాలి. నాబార్డ్ ద్వారా తీసుకునే రుణాలు రాష్ట్ర రుణ పరిమితిలో చేర్చరాదు. ఆ రుణాలను కేంద్రం ఇచ్చే గ్రాంటులుగా పరిగణించాలి. ఇదే సమయంలో ఏపీలో చేపడుతున్న పలు మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్ట్‌లకు నాబార్డ్ నుండి రుణాలు మంజూరు చేయాలి. ఏపీలో త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పంచాయితీ రాజ్ శాఖ రూ. 4500 కోట్ల విలువైన త్రాగునీటి సరఫరా ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించింది. దీనితో తోడు అన్ని మండలాలకు, జిల్లా కేంద్రాలకు రెండు వరుసల రహదారుల నిర్మాణం కోసం రోడ్లు, భవనాల శాఖ 3200 కోట్ల విలువైన ప్రాజెక్టులను సిద్ధం చేసింది. రాష్ట్రంలోని 13జిల్లాలో గురుకుల హాస్టల్స్ నిర్మాణం కోసం సాంఘిక సంక్షేమ శాఖ రూ. 3341కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రతిపాదించింది. పాతబ్రిడ్జిల మరమ్మతులు, కొత్త బ్రిడ్జిల నిర్మాణం కోసం రోడ్డు, భవనాల శాఖ రూ. 3200 కోట్ల విలువైన ప్రాజెక్టులను సిద్ధం చేసింది. రాజధాని ప్రాంతాన్నిపచ్చదనం, పరిశుభ్రంగా ఉంచేందుకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేజర్ పార్కులు అభివృద్ధి, ల్యాండ్ స్కేపింగ్, వరద నివారణ చర్యలు చేపట్టే ప్రాజెక్టును రూ. 1484కోట్ల అంచనాలతో సిద్ధం చేశారు. వెనుకబడిన ప్రాంతాల్లో గ్రామాల రోడ్లను అభివృద్ధి చేయడం కోసం పంచాయితీరాజ్‌శాఖ వెయ్యికోట్ల అంచనాలతో ప్రాజెక్ట్ సిద్ధం చేశారు. అయితే ఈఆరు ప్రాజెక్ట్‌లకు అవసరమయ్యే రూ. 16, 725 కోట్ల నిధులను నాబార్డ్ నుండి మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు అరుణ్ జెట్లీని కోరారు. నాబార్డ్ ద్వారా మంజూరు అయ్యే రుణాలను ఏపి రుణపరిమితిలో కలప కూడదని సీఎం విజ్ఞప్తిచేశారు. దీని వలన ప్రాజెక్ట్‌ల తర్వాత గతిన పూర్తి అవుతాయని సీఎం భావిస్తున్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు 90:10 నిష్పత్తిలో నిధుల కేటాయింపు జరపాలి. ఆ ప్రకారం ఏపికి 2015-16 ఆర్థికసంవత్సరంలో రూ. 2951 కోట్లు రావాల్సి ఉండగా, రూ. 2516కోట్లు మాత్రమే వచ్చాయి. ప్రత్యేక హోదా లేని ఇతర రాష్ట్రాలకు ఇచ్చినట్లు గానే ఏపీకి అప్పుడు నిధులు ఇచ్చారు. కానీ ఏపీ ప్రత్యేక ప్యాకేజీ కింద 90:10 నిష్పత్తిలో నిధులు ఇవ్వాలని సీఎం కోరారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాల కోసం రూ. 2854కోట్ల నిధులు ఇచ్చారని సీఎం లేఖలో పేర్కొన్నారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇచ్చిన నిధుల కంటే 13శాతం నిధుల అధికంగా ఇచ్చారన్నారు. ఇదే ప్రాతిపాదిక 2017-18లో రూ. 3238కోట్లు , 2018-19లో రూ. 3673 కోట్లు, 2019-20లో రూ. 4166కోట్ల నిధులు ఏపీకి రావాల్సి ఉందని సీఎం ఆ లేఖలో గుర్తుచేశారు.

పోలవరమే కీలకం!



- ప్రధానితో భేటీలో చర్చించనున్న సీఎం
- గోదావరి-పెన్నా నదుల అనుసంధానంపై నివేదిక
- ప్రాధాన్యత ప్రాజెక్టులకు రావాల్సిన నిధులపై చర్చ

అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టుతో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సమీకరణ, కేంద్రం నుంచి రావాల్సిన తక్షణ సాయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధానంగా దృష్టి పెట్టారు. అందులో భాగంగానే ఈనెల 17వ తేదీన ప్రధాని మోదీతో భేటీకాబోతున్నారంటున్నారు. ఈ భేటీలో ప్రధానంగా పోలవరం ప్రాజెక్టుపై కీలకంగా ప్రస్తావించనున్నారని అంటున్నారు. రాష్ట్ర పునర్‌విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన కేంద్రం సాయాన్ని త్వరితగతిన విడుదల చేయించుకునేందుకు ప్రధానితో జరిపే భేటీ మంచి సత్‌ఫలితాలను ఇస్తుందంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురవుతున్న ఆటంకాలపై ముఖ్యమంత్రి ప్రధానికి వివరించనున్నారు. ఇందుకు గాను రాష్ట్ర జలవనరుల శాఖాధికారులు ప్రత్యేకించి, ఒక నివేదికను రూపొందించారు. ఈ విషయమై ప్రధానికి ముఖ్యమంత్రి పవర్‌ప్రజెంటేషన్ ఇచ్చేందుకు కూడా సిద్ధమవుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇప్పటి వరకు జరిగిన పనులను, విడుదలైన నిధులు,ఇంకా రావాల్సిన నిధుల గురించి ప్రధానికి వివరించనున్నారని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి.పోలవరం ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించబోతున్న ఎగువ కాఫర్‌డ్యామ్,ప్రధాన డ్యామ్ గురించి ఆయన ఈ సందర్భంగా ప్రధానికి వివరిస్తారని అంటున్నారు. పెరిగిన ధరల నేపథ్యంలో పెంచిన ప్రాజెక్టు అంచనాలపై కూడా కూడా ప్రధానికి నివేదిక రూపంలో అందజేయనున్నారని అంటున్నారు.ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు గురించి ఆయన ప్రధానికి వివరిస్తారు. పోలవరం విషయంలో సరిహద్దు రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానాలను కూడా సీఎం, ప్రధాని దృష్టికి తీసుకెళ్లనున్నారని అంటున్నారు. 2013 భూసేకరణ చట్టం వల్ల నిర్వాసితులకు చెల్లించాల్సిన 33వేల కోట్ల పరిహారం గురించి కూడా వివరించనున్నారని అంటున్నారు. కొత్త భూసేకరణ చట్టం వల్ల పెరిగిన అంచనా వ్యయంపై కూడా వివరిస్తారని అంటున్నారు. ప్రాజెక్టుకు ఇతరత్రా రావాల్సిన అనుమతుల గురించి కూడా ప్రధాని దృష్టికి తీసుకెళతారని అంటున్నారు. పెరిగిన అంచనా వ్యయానికి సంబంధించిన నిధులతో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు,అనుమతులపై కూడా ప్రధానితో చర్చిస్తారంటున్నారు. దాదాపు సంవత్సర కాలం తర్వాత ముఖ్యమంత్రి,ప్రధానితో భేటీ అవతున్న నేపథ్యంలో ఈ భేటీకి ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. ప్రభుత్వం ముందుగా నిర్దేశించుకున్న విధంగా 100 రోజుల్లో 24 సాగునీటి ప్రాజెక్టుల గురించి కూడా సీఎం ప్రధానికి వివరించి, నిధులు రాబట్టేందుకు సిద్దమవుతున్నారని, నిర్దేశించుకున్న విధంగా రాష్ట్రంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు,పూర్తయినవి, పలు దశల్లో ఉన్నవి, ఇప్పటికే ప్రారంభించిన ప్రాజెక్టుల సంపూర్ణ సమగ్ర సమాచారంతో ప్రధానికి నివేదించబోతున్నారు.భవిష్యత్‌లో సాగునీటి ప్రాజెక్టులకు ఎటువంటి ఆటంకం తలెత్తకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వ్యూహాత్మకంగా ముందుకుసాగుతున్నారని అంటున్నారు.అదే విధంగా ప్రధాని స్ఫూర్తితో ఇప్పటికే రాష్ట్రంలో గోదావరి - కృష్ణా నదుల అనుసంధాన్ని విజయవంతంగా పూర్తి చేసి, పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని సాగునీటి అవసరాలకు మళ్లించిన వైనాన్ని కూడా సీఎం, ప్రధానికి వివరిస్తారంటున్నారు. అలాగే భవిష్యత్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న గోదావరి - పెన్నా అనుసంధానం గురించి కూడా ప్రధానితో చర్చించనున్నారు. గోదావరి - పెన్నా నదుల అనుసంధానం పూర్తయితే రాష్ట్రంలో సుమారు 1,500 టీఎంసీల జలాలను నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉండే అంశతో పాటు ఇందుకోసం ఏడు వేల ఎకరాల అటవీ భూమి, 25వేల ఎకరాల ఇతర భూములను సేకరించాల్సి ఉండడంతో ఈ అంశాన్ని ప్రధానికి వివరిస్తారని అంటున్నారు. ప్రధానంగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూపొందించిన రూ. 80వేల కోట్లు అంచనాలను కూడా ముఖ్యమంత్రి ఈ భేటీలో ప్రధానికి వివరిస్తారని అంటున్నారు.



(ఫైల్‌ఫొటో)

జన్మభూమి గ్రామ సభలకు జనం వెల్లువ



- 8వ రోజు కూడా అన్ని జిల్లాలకు 'సీ' గ్రేడు
- కర్నూలు ఫస్ట్, కడప లాస్ట్

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జనం వెల్లువలా వస్తున్నారు. అందుకు తగ్గట్టే వినతుల సంఖ్య కూడా పెరిగింది. వినతులు 7వ రోజు, 8వ రోజు 11 శాతం పెరిగాయి. ప్రజల హాజరు ఏడో రోజు కంటే ఎనిమిదోరోజు 15 శాతం పెరిగింది. జన్మభూమి 8వ రోజు అన్ని జిల్లాలకు సి-గ్రేడ్ రావడం విశేషం.

గత మూడ్రోజులుగా వరుసగా అన్ని జిల్లాలకు సి-గ్రేడ్ రావడం ప్రధానాంశం. 8వ రోజు గ్రేడింగ్‌లో కర్నూలు జిల్లా 28 పాయింట్లతో ముందుండగా, కడప జిల్లా 21 పాయింట్లతో చివరన నిలిచింది. గత 8 రోజులపాటు జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమ వివరాలు బుధవారం సాయంత్రం ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్ విలేకరులకు వివరించారు.

	8 రోజుల వివరాలు..(2 నుంచి 9 వరకు)	బుధవారం వివరాలు(9వ రోజు)
గ్రామ సభలు -	80,203	---
వినతులు -	9,36,754	38,645
ప్రజల సంఖ్య -	51,48,739	1,83,912
రేషన్‌కార్డులు -	1,58,241	5,592
పింఛన్లు -	95,097	3,978
వైద్య శిబిరాలు -	15,088	546
రోగుల సంఖ్య -	11,33,934	---
కళ్లజోళ్ల పంపిణీ -	42,174	1.115

కాగా యాక్టివిటి-బి కింద ఇప్పటి వరకు 1,92,967 మందికి బహుమతులు పురస్కారాలు అందజేయగా, 9వ రోజు 7,654 మంది విజేతలకు బహుమతులు అందజేసినట్లు పరకాల తెలిపారు. ఇప్పటి వరకు 72,491 సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు, అలాగే మొత్తం 3,19,699 పోటీలు నిర్వహించగా, 32,065 శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు.

సచివాలయంలో సంక్రాంతి సంబరాలు

రంగవల్లులు, ఆటల పోటీలు

అమరావతి, ఆంధ్రప్రభ : నిత్యం విధి నిర్వహణలో ఒత్తిళ్లకు గురయ్యే సచివాలయ ఉద్యోగులు సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం సచివాలయ ప్రాంగణంల సంక్రాంతి సంబరాల్లో పాల్గొని ఆనందోత్సాహాలు పంచుకున్నారు. బుధవారం సాయంత్రం సచివాలయ ప్రాంగణంలో జరిగిన రంగవల్లులు, ఆటల పోటీలతో పండుగ వాతావరణం ముందే కనిపించింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలను రాష్ట్ర యువజన క్రీడల శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, హోంశాఖ ముఖ్యకార్యదర్శి అనూరాధ, మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శి కె.సునీత పర్యవేక్షించారు. మహిళా ఉద్యోగులు వేసిన ముగ్గులను ఆసక్తిగా తిలకించారు. పురుషులకు కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. సంక్రాంతి సంబురాలను ఉద్దేశించి హోంశాఖ ముఖ్యకార్యదర్శి అనూరాధ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి దగ్గర నుంచి ప్రతియేటా సచివాలయంలో సంక్రాంతి సంబరాలు ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ సంబరాల్లో భాగంగా ఉద్యోగుల మధ్య సాంప్రదాయ ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలు ఉద్యోగుల్లో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయన్నారు. రాష్ట్ర విభజనతో ఏపీని పునాదుల స్థాయి నుంచి అభివృద్ధి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సచివాలయ ఉద్యోగులు సైతం రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని వివరించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యు.మురళీకృష్ణ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి సంక్రాంతి సంబరాల పేరుతో ఆటల పోటీలు జరుగుతున్నాయన్నారు. వీటి నిర్వహణకు కోటి రూపాయలు కేటాయించిందన్నారు. ముగ్గుల పోటీల్లో 300 మందికిపైగా మహిళా ఉద్యోగులు పాల్గొన్నట్లు చెప్పారు. పురుషులకు నిర్వహించిన కబడ్డీలో 15 జట్లు పాల్గొంటున్నాయన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నామన్నారు. గురువారం కబడ్డీ పోటీలతోపాటు కోలాటం, గంగిరెద్దుల ప్రదర్శన ఉంటుందన్నారు.



ఉత్సాహంగా జన్మభూమి

- నేటితో గ్రామసభలకు తెర
- ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యం
- అయిదో జన్మభూమికి అనూహ్య స్పందన
- తొలిసారిగా నోడల్ అధికారులుగా ఐఏఎస్‌లు

అమరావతి, ఆంధ్రప్రభ: గత తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న జన్మభూమి మా వూరు కార్యక్రమం నేటితో ముగుస్తోంది. గతంలో ప్రజల వద్దకు పాలనను తల పించే రీతిలో సాగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాష్ట్రం లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం జరిగిన కార్యక్రమాల్లో ఇది ఐదవది. అయితే గతంలో జరిగిన నాలుగు జన్మభూమి కార్యక్రమాలకన్నా భిన్నంగా ఐదో విడత జన్మభూమి మావూరు కార్యక్రమం జరిగిందనే అభిప్రా యంతో రాష్ట్ర ప్రభుత్వం వుంది. మొట్టమొదటి సారిగా రెవెన్యూ డివిజన్ల బదులు గా నియోజకవర్గాలవారీగా సివిల్ సర్వీసెస్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియ మించడం విశేషం. జన్మభూమిని ఆషామాషీగా కాకుండా ఫలితాలు రాబట్టే విధంగా నిర్వహించాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా ప్రభుత్వం సివిల్ సర్వీసెస్ అధి కారులను క్షేత్రస్థాయిలో నియమించింది. ఫలితంగా అధికార యంత్రాం గంలోనూ కదలిక రావడం జరిగింది. రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి రోజుకు రెండు సార్లు, క్షేత్రస్థాయిలో నోడల్ ఆఫీసర్లు రోజుకు రెండుసార్లు సమీక్షలు చేయడం ద్వారా అధికార యంత్రాంగాన్ని గాడిలో పెట్టారు. ఇందుకోసం రాష్ట్ర సచివాలయంలోని ముఖ్యమంత్రి బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం జన్మభూమి మావూరు కార్య క్రమాలను ఎప్పటికప్పుడు సి.ఎం.ఓ.కు అందించడంలో ముఖ్య పాత్రను పోషిం చింది. రియల్ టైం గవర్నెన్స్ కేంద్రానికి ఎప్పటికప్పుడు నివేదికలు అధికారులు పంపడం జరుగుతోంది. ఫలితంగానే జన్మభూమి కార్యక్రమ అమలుతీరును నోడల్ అధికారులు సమీక్షిస్తూ ముందుకు సాగుతున్నారు. కేవలం తొమ్మిది రోజుల లోనే అర కోటికి మందికిపైగా పాల్గొన్న జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో నాలుగవ విడతతో పోలిస్తే తగ్గాయని చెబుతున్నారు. ఎక్కువ శాతం ఫిర్యాదులకు మెరుగ్గా లభించడంతో రాష్ట్రంలో అయిదవ విడతలో వివిధ అంశాలపై ఫిర్యాదులు తగ్గాయి. కాగా ఈసారి మొత్తంపది అంశాలపై జన్మభూమి మాఊరుకార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించింది. ఎంపిక చేసిన అంశాలపైనే ఫోకస్ పెట్టిన నేపథ్యంలో ప్రజల నుండి అనుబంధమైన ఫిర్యాదులే వచ్చాయి. మౌళిక సదుపాయాలు, రియల్‌టైం పాలన, స్వచ్ఛాంధ్రప్రదేశ్, ఆరోగ్యం, ఆనందం, విద్య, వికాసం, సహజ వనరులు, అభివృద్ధి, పేదరికం, వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధి, ఆనం దహరి వంటి పది అంశాలకు కొనసాగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో అందిన ఫలితాలపై కార్యాచరణ దిశగా కసరత్తు చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం వుంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలకు గ్రేడ్‌లు ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులైన అధికారులు, సిబ్బందిని కూడా గుర్తించాలని నిర్ణ యించారు. రాష్ట్రస్థాయిలో, జిల్లాస్థాయిలో సమావేశాలు నిర్వహించి సత్కరించా లని నిర్ణయించారు. ఫలితంగానే ఈ నెల 12వ తేదీన జిల్లాల స్థాయిలో, 19న రాష్ట్రస్థాయిలో కార్యక్రమం జరుగనుంది.ఇదిలా వుండగా ఈ నెల 2 వ తేదీ నుంచి బుధవారం మధ్యాహ్నం 12 గంటల దాకా రాష్ట్రవ్యాప్తంగా 9,49,592 ఆర్జీ లు అందాయి. సందర్భంగా నిర్వహించిన 5కె రన్‌లో 1,99,120 మంది పాల్గొ న్నారు. అత్యధికంగా గుంటూరుజిల్లా నుంచి 1,21,814 ఆర్జీలు, కనిష్టంగా శ్రీకాకుళం నుంచి 24,165 ఆర్జీలు అందాయి.



బుధవారం తూర్పుగోదావరి జిల్లా చెయ్యేరు గున్నేపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న సీఎం

80 శాతం సంతృప్తే లక్ష్యం

కాగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నపథకాలకు సంబంధించి 80 శాతం సంతృప్తిని సాధించేందుకు ఉద్దేశించిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంతో గత తొమ్మిది రోజులలోనూ సత్ఫలితాలు సాధించామనే అభిప్రాయం రాష్ట్ర ప్రభుత్వం లో వుంది. పలు పథకాలపై ఫోన్ల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరిపితే సగటున 60 శాతంకు పైగా సంతృప్తి తో కూడిన సమాధానాలు వచ్చాయని అధికారవర్గాలు పేర్కొన్నాయి. ఫలానా పథకం బాగాలేదని మెజారిటీ ప్రజల నుంచి అభ్యంతరాలు తలెత్తిన పక్షంలో ప్రభుత్వం వాటి విషయంలో పునరాలోచన చేసేందుకు కూడా వెన కాడబోదనే సంకేతాలను ఇవ్వడం జరిగింది. జిల్లాలతో పాటు, మండలాలు, గ్రామాలవారీగా కూడా జన్మభూమి మా ఊరు జరిగిన తీరుపై ప్రభుత్వం ఇప్పటికే విశ్లేషించాలని నిర్ణయించింది. వచ్చే జన్మభూమి నాటికి రాష్ట్రంలో ప్రజల సమస్యలు తగ్గించేక్రమంలో మరిన్ని చర్యలు తీసుకుంటామనే సంకేతాలను ఇవ్వడం జరి గింది. పెద్ద ఎత్తున గ్రామ సభలు నిర్వహించడంతో పాటు రేషన్ కార్డులు, వైద్య క్యాం పులు, నేత్ర చికిత్సాశిబిరాలు, పెన్షన్లు తదితర కార్యక్రమాలు కూడా జన్మభూమిలో చోటు చేసుకున్నాయి.

నేడు సీఎం అనంత జిల్లా పర్యటన

ఎస్కేయూ, ప్రభన్యూస్: ఈనెల 2వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి - మా వూరు ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేడు అనంత పురంజిల్లాలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 10.15 గంటలకు ప్రత్యే క ఎయిర్ క్రాఫ్ట్ ద్వారా గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి 10.55 గంట లకు పుట్టపర్తి చేరుకోనున్నారు. 11 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 11.15 గంటల గంటలకు కొత్తచెరువులోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుంటారు. అక్క డ నుండి బుక్కపట్నంలో పైలాన్ ను ఆవిష్కరించి, బుక్కపట్నం చెరువులో జలహా రతి ఇవ్వనున్నారు. అలాగే హంద్రీనీవా పనులను పరిశీలిస్తారు. 12.25 గంటలకు పుట్టపర్తి ఎయిర్‌పోర్టు చేరుకుని హెలికాప్టర్ ద్వారా 12.50 గంటలకు ధర్మవరంలో జన్మభూమి సభాస్థలికి చేరుకుంటారు. 12.50 నుండి 1.15 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. 1.30 గంటల నుండి 2 గంటల వరకు జలహారతి ఇచ్చి, ధర్మవరం చెరువులోకి చేప పిల్లలను విడుదల చేశారు. 2 నుంచి 4.30 గంటల వరకు జన్మభూ మి మా వూరు కార్యక్రమంలో పాల్గొంటారు. 4.45 గంటలకు బహిరంగ సభ స్థలి నుండి రోడ్డు మార్గాన బయలుదేరి హెలిప్యాడ్ కు చేరుకుంటారు. 5.20 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుని ఆ తర్వాత 5.25 గంటలకు ప్రత్యేక విమానం ద్వారా గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళ్తారు.

15న కేంద్ర కార్యాలయాలకు సెలవు

అమరావతి, ఆంధ్రప్రభ: సంక్రాంతి పండుగ సందర్భంగా కేంద్రప్రభుత్వం ఏపీ, తెలంగాణలలో కేంద్ర కార్యాలయాలకు ఈనెల 15న సెలవు ప్రకటించింది. గతంలో జనవరి 15న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు లేదు. అయితే, ఆప్ష నల్ హాలీడేగా ఉన్న ఈ రోజును పూర్తి సెలవు దినంగా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ ఆదేశాలు జారీచేసింది. ఇంతకుముందు సెలవు దినంగా ప్రకటించిన సెప్టెంబరు 3వ తేదీన కార్యాలయాలు యధావిధిగా పని చేస్తాయని స్పష్టం చేసింది.

వ్యవసాయం దండగ అన్నారు

- అన్నదాతల కష్టాలు వారికి ఎలా తెలుస్తాయి?
- ఏడాది ఓపిక పట్టండి రైతుల కష్టాలు తీరుస్తా
- ప్రజాసంకల్ప పాదయాత్రలో జగన్ హామీ

తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: అసలు వ్యవసా యమే దండగ అన్నవారికి రైతులు పడే కష్టాలెలా తెలుస్తాయని వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగ న్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. చిత్తూరు జిల్లాలో కొనసా గుతున్న ప్రజాసంకల్ప పాదయాత్ర లో భాగంగా ఆయన బుధవారం గంగాధరనెల్లూరు నియోజక వర్గంలోని మారు మూల పల్లెల గుండా ముందుకు సాగారు. పెనుమూరు మండలం జెట్టివానిపల్లెలో మొదలైన పాదయాత్ర వెదురుకుప్పం మండలం జక్కిదొన, గంటావారిపల్లె, బొట్ల వారిపల్లె, నల్లవెంగ నపల్లె, మాతూరు క్రాస్, పాతగుంట, చెన్నుగారిపల్లె మీదుగా గుండుపల్లి వరకు దాదాపు 14 కిలోమీటర్ల దూరం కొనసాగించారు. దారి పొడవునా చెరకు, పళ్ల రైతులు, నల్లబెల్లం తయారీ రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను వివరించారు. పండిం చిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అమలు కావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చెర కు రైతులు సహకార చక్కెర కర్మాగారాలు మూతపడి పోవడంతో ప్రైవేటు కర్మాగారాల దోపిడీకి గురవుతు



న్నారన్నారు. నల్లబెల్లం తయారీదారులైన రైతులు అటు బెల్లం తయారీపై ఆంక్షలు విధించడమే కాక ఇటు బెల్లం తయారీ యంత్రాలకు సంబంధించిన విద్యుత్ బిల్లుల భారంతో కుంగిపోతున్నామన్నారు. దాదాపుగా అందరి సమస్యలను వ్యక్తిగతంగా విం టూ వచ్చిన జగన్ ప్రతి ఒక్కరికి వచ్చే ఎన్నికల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవ సాయ రంగానికి చేయతలపెట్టిన పథకాలను వివ రించారు. అసలు వ్యవసాయమే దండగన్న వారే రాష్ట్రాధినేతలుగా ఉన్నప్పుడు రైతులకు ఏవిధంగా మేలు జరుగు తుందని ప్రశ్నించారు. మరో ఏడాది పాటు ఓపిక పడితే తమ ప్రభుత్వ హయాంలో అం దరి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. మారు మూల గ్రామాల గుండా కొనసాగిన యాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని జగన్‌కు ఘనంగా స్వాగ తం పలికారు. పలుచోట్ల యువతీ యువకులు జగన్ తో సెల్ఫీలు దిగడానికి పోటీలు పడ్డారు. ఉదయం జెట్టి వానిపల్లెలో మొదలైన యాత్ర సాయంత్రం గుడ్డుపల్లె చేరుకోవడంతో ముగిసిందగి. 58వ రోజుయాత్రలో భాగంగా జగన్ నల్లవెంగనపల్లె చేరుకోవడంతో 800 కిలోమీటర్ల దూరం పూర్తయిందని పార్టీ వర్గాలు చెప్పడంతో అక్కడ జగన్ మొక్కను నాటారు. ఈ పాదయాత్రలో గంగాధరనెల్లూరు శాసన సభ్యుడు నారాయణస్వామి తదితర స్థానిక నేతలు పాల్గొన్నా రు. గురువారం మధ్యాహ్నం వరకు గంగాధర నెల్లూ రు నియోజకవర్గంలోని వెదురుకుప్పం మండలం గు ండానే కొనసాగనున్న యాత్ర తిరిగి చంద్రగిరి నియో జకవర్గానికి చెందిన రామచంద్రాపురం మండలంలో కొనసాగుతుందని పార్టీ వర్గాలు ప్రకటించాయి.

రాజకీయ నిరుద్యోగులకు దేవాలయాలు పునరావాస కేంద్రాలా!

- ఆలయాలను కాపాడుకునేందుకు భక్తులతో ఉద్యమం
- విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి

కదిరి, ప్రభన్యూస్: దేశంలో దేవాలయాలు రాజ కీయ నిరుద్యోగులకు పునరావాసకేంద్రాలుగా మారా యని, దేవాలయాలు కాపాడుకోవడానికి భక్తులతో ఉద్యమం నడుపుతామని విశాఖ శ్రీ శారదా పీఠాధిప తి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా పర్యటనలో భాగం గా కదిరిలో మూడు రోజుల పాటుగా భక్తులకు అను గ్రహ భాషణం చేసిన స్వామిజీ బుధవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవ నారసిం హక్షేత్రాలలో పురాతనమైన ఖాద్రీ నృసింహక్షేత్రంలో బస చేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చినట్లు స్వామిజీ పేర్కొన్నారు. దేశంలోని పురాతన దేవాల యాల పరిస్థితి, అర్చకులపై పాలక మండళ్ల పెత్తనం, దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనాలపై దృష్టి సారించి వాటి స్థితిగతులను పరిశీలించడం జరుగుతోంద న్నారు. విజయయాత్రలో సనాతన సాంప్రదాయా లతో పాటు దేవాలయాల విశిష్టతపై హిందువులకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. రాష్ట్రం తో పాటు దేశంలో దేవాలయాల వ్యవస్థ కుప్ప కూలు తోందన్నారు. దేవాలయాలు రాజకీయ నిరుద్యోగుల కు పునరావాస కేంద్రాలుగా మారాయని స్వామిజీ ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ కనకదుర్గమ్మ గుడి, కాళహస్తిలో మరెక్కడైనా దిగజారుడు తనంతో కూడిన క్షుద్రపూజలకు ఆలవాలంగా మారడం శోచనీయంగా పేర్కొన్నారు. హిందూ దేవాలయా లపై ప్రభుత్వ పెత్తనంతో పాటు రాజకీయ పెత్తనం మితిమీరిందన్నారు. దేవాలయాల్లో ప్రతిదీ డబ్బుకు అమ్ముడుపోయే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంద న్నారు. దేవుని దర్శించుకోవాలన్నా డబ్బుతోనే ముడి పడడం జరుగుతోందన్నారు. అన్ని మతస్థుల విష యంలో ప్రభుత్వ జోక్యం లేకపోతుండగా, హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం ఏమిటని? స్వామిజీ ప్రశ్నించారు. దేవాలయాలను కాపాడుకోవాలని,



భక్తులతో ఉద్యమం నడపనున్నట్లు స్వామిజీ ఈ సందర్భంగానే వెల్లడించారు. కాగా ఖాద్రీనృసింహ క్షేత్రానికి కర్ణాటక భక్తుల తాకిడి విపరీతంగా ఉందని, అయితే భక్తులకు వసతి సౌకర్యాలను కల్పించడంలో లోపం ఉందన్నారు. ఈ లోపాలపై దేవాదాయ శాఖ కమీషనర్‌కు, దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి సైతం తీసుకెళ్లనున్నట్లు స్వామిజీ తెలిపారు. మకర సంక్రమణ అనంతరం రాయలసీమలోని కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో పర్యటించనున్నట్లు స్వామిజీ తెలిపారు.

13న రాష్ట్ర కేబినెట్ భేటీ

- 17న ఢిల్లీకి ముఖ్యమంత్రి

అమరావతి, ఆంధ్రప్రభ: ఈ నెల 13 వ తేదీన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగనుంది. తొలుత 17 వ తేదీన కేబినెట్ భేటీ వుంటుందని ప్రకటించారు. అయి తే అదే రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్యమంత్రిని కలవాలంటూ ఆహ్వా నించారు. ఫలితంగానే ముందుగానే మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఢిల్లీ పర్యటనలో రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఒక ముఖ్యమైన ప్రాజెక్టుకు ప్రధానిని ఆహ్వానించే యోచనలో ముఖ్యమంత్రి వున్నట్లు సమాచారం.

కలెక్టర్ల సదస్సు వేదిక మార్పు

కాగా ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 18, 19 వ తేదీలలో రెండు రోజులపాటు కలెక్టర్ల సదస్సు జరుగనుంది.అయితే మారిన షెడ్యూల్ ప్రకారం వెలగపూడి సచివాలయంకు బదులుగా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం వద్ద వున్న గ్రీవెన్స్ భవనంలో సదస్సును నిర్వహించాలని తాజాగా నిర్ణయించారు. ఇందుకోసం శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సచివాలయంలోని 5వ బ్లాక్‌లో నిర్మిస్తున్న కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడంతో కలెక్టర్ల సదస్సు స్థలాన్ని మార్చారు.

రాష్ట్రానికి రూ. 100.84 కోట్ల నాబార్డు నిధులు

అమరావతి, ఆంధ్రప్రభ: పునర్విభజన తరువాత ఏర్పడిన నవ్యాంధ్ర ప్రదేశ్ లో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసి వ్యవసాయ, ఉద్యాన పంటలకు సాగు నీరు అందించేందుకు తోడ్పాటును అందిస్తూ నాబార్డు రూ.100.84 కోట్ల రుణాన్ని మంజూరు చేసినట్లు నాబార్డు సీజీఎం కె.సురేష్ కుమార్ బుధవారం తెలియజేశారు. రాష్ట్రంలో రూ.120.62 కోట్ల విలువైన 20 ప్రాజెక్టుల కోసం తమ వంతుగా రూ.100.84 కోట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మంజూరు చేయడం జరిగిందని, ఈ నిధులను అనంతపురంలో 1, గుంటూరులో 5, కడపలో 1, కృష్ణా లో 5, కర్నూలులో 2, ప్రకాశంలో 1, శ్రీకాకుళంలో 3, విశాఖలో 1, పశ్చిమ గోదా వరిలో 1 కలిపి మొత్తంగా 9 జిల్లాల్లో 20 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు త్వరగతిన పూర్తి చేసేందుకు కేటాయించినట్లు తెలిపారు. ఈ 20 ప్రాజెక్టులు పూర్తయితే ఆయా జిల్లా ల్లో 9,965.56 హెక్టార్ల వ్యవసాయ, ఉద్యాన పంటలకు సాగునీరు అందుతుందని, తాజాగా మంజూరు చేసిన నిధులతో కలిపి ఇప్పటి వరకు ఆర్ఐడీఎఫ్ రుణం క్రింద రూ.720 కోట్లను ఏపీ ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందని ఆయన తెలియజేశారు.

ఈ ఏడాది పదవీ విరమణ చేయనున్న ఐపీఎస్‌ల జాబితా

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది పదవీ విరమణ చేయ నున్న ఐపీఎస్ అధికారుల జాబితాను విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ విడుదల చేశారు. ఈ ఏడాది పదవీ విరమణ చేయనున్న వారిలో జనవరి 31న కె.కోటేశ్వరరావు, ఫిబ్ర వరి 28న బి.వి.రమణ కుమార్, ఏప్రిల్ 30న షేక్ మహ్మద్ ఇక్బాల్, జూన్ 30న డాక్ట ర్ ఎం.మాలకొండయ్య, జూలై 31న ఎం.సుబ్బరావు, ఆగస్టు 31న డాక్టర్ టి.యోగానంద్, సెప్టెంబర్ 30న ఎస్.వి.రమణ మూర్తి, నవంబర్ 30న జె.బ్రహ్మా రెడ్డి పదవీ విరమణ చేయనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దశలవారీగా ప్రాజెక్టులు పూర్తి

- నదుల అనుసంధానం బాబు పుణ్యమే
- అభివృద్ధిలో ఆంధ్రాను అగ్రభాగాన నిలుపుతాం
- మంత్రి శిద్దా రాఘవరావు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ప్రాజెక్టుల ను దశలవారీగా పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు చెప్పారు. బుధవారం దర్శి నియోజక వర్గ పరిధిలోని చౌటపాలెం గ్రామంలో జరిగిన 5వ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వాలు ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో లక్షల కోట్లు దోపిడి చేశారన్నారు. రాష్ట్రంలో నదుల అనుసంధానం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపట్టారన్నారు. గోదావరి నదిని కృష్ణానదికి పట్టిసీమ ద్వారా అనుసంధానం చేశారన్నారు. రాష్ట్రంలో రూ. 660 కోట్ల వ్యయంతో చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ముఖ్యమం త్రి అనేక అభివృద్ధి సంక్షేమ, కార్యక్రమాలు వేగవం తంగా అమలు చేస్తున్నారన్నారు. అమరావతి నుంచి అనంతపురం వరకు 8 లైన్ల రహదారి నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలి పారు. దర్శి నియోజకవర్గంలో మూడున్నర సంవత్స రాలలో రూ.1800 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశామన్నారు. దర్శి నియోజకవర్గ పరిధిలో రూ.350 కోట్లతో చంద్రన్న బాట కింద 80 కి.మీల సిమెంటు రహదారులు నిర్మించామన్నారు. దర్శి నియోజక వర్గం పరిధిలోని ప్రజలకు తాగునీటి సమస్యలు పరిష్కరించడానికి తమ సొంత నిధులతో 75 ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు.

తూర్పు చౌటపాలెం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామంలో పూర్తిగా రోడ్డు నిర్మించడానికి 2 కోట్లు నిధులు ఇస్తామని ఆయన చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతి ఒక్కరు ప్రభుత్వానికి మదద్తు ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ సందర్భం గా తూర్పు చౌటపాలెం గ్రామంలో 30 లక్షల రూపా యలతో నిర్మించిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని పార్కును మంత్రి ప్రారంభించారు. 13.77 లక్షలతో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పార్కు నుంచి రాజంపల్లి రోడ్డు వరకు నిర్మించిన సిమెంటు రోడ్డును, బీసీ కాలనీలోని రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును రూ.10 లక్షలతో నిర్మించిన ఈశ్వరమ్మ గుడి రోడ్డును మంత్రి ప్రారంభించారు. గ్రామంలో 30.33 లక్షల రూపాయలతో నిర్మించిన తాగునీటి పథకాన్ని మంత్రి ప్రారంభించారు. దర్శి మండలంకు చెందిన 118 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.4 కోట్ల వడ్డీ లేని రుణాలను చెక్కును మంత్రి అందజేశా రు. దర్శి మండలంలో చంద్రన్న బీమా స్కాలర్ షిప్ ను పథకం కింద 3439 మంది విద్యార్థులకు 48 లక్ష లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సూరే చిన్న సుబ్బారావు, దర్శి ఎంపీపీ పూసల సంజీవయ్య, కనీస వేతనాలు అమ లు బోర్డు డైరెక్టర్ శోభారాణి, దర్శి జడ్పీటీసీ స్టీవెన్ సర్పంచ్ మారం ధనలక్ష్మీ, జన్మభూమి మా ఊరు పరిశీలకులు ఏ.కె.ఝా, దర్శి నియోజకవర్గ ప్రత్యేక అధికారి బి.రవి, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్‌ల భవనాలు ఐకానిక్‌గా ఉండాలి

- రాజధాని పనుల పురోగతి సమీక్షలో సీఎం చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: అమరావతిలో నిర్మించే భవనాల ఆకృతులు, పను ల షెడ్యుళ్ళను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించారు. అన్ని క్యాంపస్‌ల భవనాలు ఐకానిక్‌గా ఉండాలని , షెడ్యుళ్ళకు అనుగుణంగా పనులు త్వరలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విజయవాడ లోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని పనుల పురోగతిని బుధవారం సాయంత్రం సమీక్షించారు. రాజధాని అమరావతి లో అమృతా విశ్వవిద్యాపీఠం నిర్మాణ పనులకు వచ్చే నెల మొదటి వారంలో శంకు స్థాపన జరగనుంది. అమృత యూనివర్సిటీ ఆకృతులను, మాస్టర్ ప్లాన్‌ను సీఎం పరిశీలించారు. 200 ఎకరాల్లో నిర్మించే ఈ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ మేనె జ్మెంట్, ఇంజనీరింగ్ విభాగాలుంటాయి. అమృత యూనివర్సిటీలో 2018 ఆగస్టు నుండి తరగతులు ప్రారంభం అవుతాయని సీఆర్డీఏ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రిని అమృత విశ్వవిద్యాపీఠం ప్రతినిధులు ఆహ్వానించారు. ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి, బసవతారకం క్యాన్స ర్ ఆసుపత్రి, ఇంకో యూకె ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ , బ్రహ్మకుమారి విశ్వశాంతి కేంద్రం ప్రతినిధులు కూడా అమరావతిలో నిర్మించే భవనాల ఆకృతులను, పనుల షెడ్యుళ్ళను కూడా ముఖ్యమంత్రికి వివరించారు. అమరావతిలో నిర్మించేకళాగ్రా మానికి సంబంధించిన ప్రెజెంటేషన్ కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు ఈ ప్రాజెక్టులో భాగంగా ఎన్టీఆర్ కళావేదిక (బహుళ ప్రయోజనకర ఆడిటోరియం) అమ్యూజ్మెంట్ పార్కు, ప్రదర్శన కేంద్రం, నదీ తీర అభివృద్ధి చేపడతారు. ఏప్రిల్ రెండో వారంలో నిర్వహించే అర్బన్ ఇన్నోవేషన్ స మ్మిట్ గురించిన ప్రతిపాదన లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పట్టణ ప్రణాళిక, సాంకేతికతకు సంబంధించిన కలబోతకు ఇందో అంతర్జాతీయ వేదిక కావాలని అధికారులను ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్తంగా మొరాయించిన సర్వర్లు

- జీఎస్టీ రిటర్న్స్ దాఖలుకు మరోమారు గడువు పెంపు
- ఈ నెల 25 వరకు రిటర్న్స్‌కు అవకాశం

అమరావతి, ఆంధ్రప్రభ: దేశ వాణిజ్య పన్నుల రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన జీఎస్టీకి ఆదినుంచి అడ్డంకులు, అవాంతరాలు ఏర్పడుతు న్నాయి. ఈ నేపథ్యంలోనే వ్యాపారులు జీఎస్టీ రిటర్న్స్ దాఖలు చేసేందుకు బుధవారం తుది గడువు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యాపారులంతా ఒక్క సారిగా లావాదేవీలను అప్‌లోడ్ చేయడంతో సర్వర్లు మొరాయించాయి. గత రెండ్రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో రిటర్న్స్ దాఖలుకు గడువును మరోమారు పెంచారు. ఈనెల 25 వరకు రిటర్న్స్ దాఖలు చేసు కునేందుకు సడలింపు ఇచ్చారు. కాగా గతేడాది జులై నుంచి దేశవ్యాప్తంగా జీఎస్టీ అమల్లోకి వచ్చింది. జీఎస్టీ నిబంధనల ప్రకారం ప్రతినెలా వ్యాపారులు తమ లావా దేవీలను కంప్యూటర్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. జీఎస్టీలో ఆర్-1, ఆర్-2 విభాగాలున్నాయి. మొదటి విభాగంలో కొనుగోలుదారుడు చేసిన లావాదేవీలను జీఎస్టీ కౌన్సిల్‌కు పొందుపర్చాల్సి ఉంటుంది. రెండో విభాగంలో అమ్మకందారుల వివరాలను కూడా పొందుపర్చాల్సి ఉంది. ఐతే సాంకేతిక ఇబ్బందులతో రెండో విభాగాన్ని సంవత్సరంపాటు సడలించారు. ఈ ఏడాది జూన్ నుంచి ఆర్-1తోపాటు ఆర్-2 రిటర్న్స్ దాఖలు చేయాల్సి ఉంది. రిటర్న్స్ దాఖలు చేసేందుకు ప్రయత్నించ గా సాంకేతిక సమస్యలు తలెత్తాయి.

అప్పుడు కూడా సర్వర్లు పనిచేయకపోవడంతో ఆగడువును నవంబర్ వరకు, అనంతరం డిసెంబర్ నెలాఖరు వరకు పొడిగించా రు. తిరిగి అదే సమస్య తలెత్తడంతో రిటర్న్స్ దాఖలు చేసే గడువును మరోమారు సడలించాల్సి వచ్చింది. సాధారణంగా జీఎస్టీ నిబంధనల ప్రకారం గడువులోపల రిటర్న్స్ దాఖలు చేయక పోతే ప్రతినెలకు సంబంధిచిన లెక్కలకు రోజుకు రూ.50 చొప్పున అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంది. అంటే ఆరు నెలల కాలానికి రోజుకు రూ. 300 చొప్పున పెనాల్టీ ఉంటుంది. బుధవారం సర్వర్లు పనిచేయకపోవడంతో అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందని వ్యాపారులు అందోళన చెందారు. ఐతే జీఎస్టీ అధికారులు గడువును పెంచడంతో వ్యాపారులు ఊపిరిపీల్చుకున్నారు.

మీకో న్యాయం మాకో న్యాయమా..?

- రేపు ఖజానా కార్యాలయాల వద్ద ధర్నా
- సీపీఎస్‌ని రద్దు చేసేవరకు పోరాడతాం
- ఏపీ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

అమరావతి, ఆంధ్రప్రభ: శాసన సభ్యులు ఒక్కరోజు అసెంబ్లీకి హాజరైతే జీవి తాంతం పెన్షన్ వస్తుందని, కాని ప్రభుత్వ ఉద్యోగులు 35సంవత్సరాలు పనిచేసినా పెన్షన్ ఇవ్వటంలేదని ఇదెక్కడి న్యాయమని ఏపీ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు అన్నారు. బుధవారం విజయవాడ రెవెన్యూ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన సీపీఎస్‌ని రద్దు కోరుతూ శుక్ర వారం రాష్ట్రంతోపాటు జిల్లా ఖజానా కార్యాలయాల్లో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో జేఏసీఏపీ, జాక్టో, ఫాప్టో, పెన్షన్ సాదన సమితితోపాటు 94 సంఘాలు పాల్గొంటాయన్నారు. 2004లో ప్రవేశపెట్టిన సీపీఎస్‌ని పశ్చిమ బెం గాల్, త్రిపుర, కేరళ ప్రభుత్వాల మినహా అన్ని రాష్ట్రాలు సీపీఎస్‌ని అవలంభి స్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిని రాష్ట్రాల మీద బలవంతంగా రుద్దలేద న్నారు. అప్పట్లో తక్కువ మంది ఉద్యోగులతోపాటు, సీపీఎస్ పై సరైన అవగాహన లేక అడ్డుకోలేదని మరో మాటకు సమాదానమిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, కేరళలో సీపీఎస్ పై ఒక కమిటీ వేయటం జరిగిందన్నారు. కేంద్రం 2009లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాడ్యువిటీ, కుటుంబ పెన్షన్ ఇచ్చిందని, ఏపీలో కూడా ఇచ్చినప్పటికీ 9నెలల్లోనే రద్దుచేశారన్నారు. ఇప్పుడు ఈ రెండింటి మీద జీవో ఇచ్చినప్పటికీ అమలు కావటం లేదని, అమల య్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

సక్సెస్ బాటలో జీరోవేస్ట్ ప్రాజెక్టు

- ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి లోకేష్
- పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతం
- గ్రామాల్లో చెత్త ద్వారా సంపద సృష్టి

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న జీరోవేస్ట్ ప్రాజెక్ట్ సక్సెస్ బాటలో నడుస్తుంది. పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమవ్వడంతో దీనిపై రాష్ట్ర పంచా యితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖమంత్రి నారాలోకేష్ ప్రత్యేక దృష్టిసారించారు. దీనిలో భాగంగానే గ్రామల్లో లభి ంచేచెత్త నుంచి సంపద సృష్టించేవిధంగా చర్యలు తీసుకుంటు న్నారు. పంచాయితీల్లో పారిశుద్యంతోపాటు సేంద్రియ ఎరు వులతో నాణ్యమైన ఆహార పదార్థాలను పండించడమే లక్ష్యం గా జీరో వేస్ట్ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఆప రేషన్ జీరో వేస్ట్ కింద గ్రామంలోని వీధుల్లో, కాలువల్లో చెరువు గట్లపైన వివిధ ప్రదేశాల్లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను వేరుచేసి ఘనవ్యర్థాల షెడ్‌కు తరలించి పేపర్, ప్లాస్టిక్, పాలిథీన్ కవర్, చెత్త చెదారం రోడ్లమీద కనిపించకుండా చర్య లు తీసుకుంటున్నారు. ఊబరైజేషన్ ఆఫ్ డంప్ పేరుతో గ్రా మాల్లో రైతుల నుంచి సేకరించిన చెత్త, పేడతో వర్మికంపోస్ట్ తయారు చేసి దాన్ని తిరిగి రైతులకే అప్పగించే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. పేడను సేకరించేందుకు గ్రీన్ అంబాసిడర్లు, కమ్యునిటీ మొబలైజర్లు ఏర్పాటు చేశారు. ప్రతి రోజుగ్రీన్ అంబాసిడర్లు ఆయా గ్రామాల్లో రైతులు ఇంటి ముందుకు ట్రాక్టర్లతో నిర్ధిష్ట సమయంలో వచ్చి తడిచెత్త, పొడిచెత్తను సేకరిస్తారు. సేకరించిన తడిచెత్త, పేడను ఆగ్రా మంలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు తొట్టెల్లో వేస్తారు. దాదాపు 60 రోజుల అనంతరం ఏర్పడే వర్మీకంపోస్టును తిరిగి రైతులకు ఇవ్వనున్నారు. ఈవర్మీ కంపోస్టు అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో ఈప్రాజెక్టును నిర్వహిస్తున్నారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుద్యం కోసం పనిచేసే కార్మికు లకు వేతనాలు కూడా ఇవ్వనున్నారు. రైతుల్లో వర్మికంపోస్ట్ వాడకాన్ని ప్రోత్సహించడం, పంట పొలాలను సారవంతం గా చేయటం, సేంద్రియ ఎరువులతో నాణ్యమైన ఆహార పదా ర్థాలను తయారుచేయడమే లక్ష్యంగా పంచాయితీరాజ్ శాఖ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. వీటితోపాటు పశువులు కలిగిన రైతు గ్రామపంచాయితీ గ్రీన్ అంబాసిడర్‌కి పేడ ఇచ్చి తద్వా రా వర్మి కంపోస్టును తీసుకోవచ్చు. పైలెట్ ప్రాజెక్టుగా పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.4.75లక్షల ఇళ్ల నుంచి ఊబరైజేషన్ ద్వారా పేడను సేకరిస్తున్నారు. ఇదే తరహాలో చిత్తూరు జిల్లా లో 166, కృష్ణా జిల్లాలో 307 ఇళ్ల నుంచి పేడ, చెత్తను సేకరిసు న్నారు. చెత్త సేకరణ కోసం 120 ట్రాక్టర్లు, 36 ఆటోలు, 1478 ట్రై సైకిళ్లు వినియోగిస్తున్నారు. సుమారు 12,795 మంది రైతులు పేడను ఊబరైజేషన్‌కు అందిస్తున్నారు. దాని నిర్వహ ణ కోసం 3,966మంది గ్రీన్ అంబాసిడర్లును నియమించా రు. ఊబరైజేషన్ ద్వారా ఇప్పటికే 58,965 టన్నుల పేడను సేకరించారు. ప్రస్తుతం 650 నాడిఫ్ ఫిట్లు అందుబాటులో ఉన్నాయి. 1703 టన్నుల పేడను కంపోస్టు ఫిట్‌ల్లో ఉంచి ఇప్పటికే సుమారు 95 టన్నుల వర్మీకంపోస్ట్‌ని తయారు చేశారు. వాటిని కేజీ, రెండు కేజీల ప్రకారం ప్యాకేజీల్లో ఉంచి రైతులకు అందించడానికి సిద్ధంచేశారు. ఈవిధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడం ద్వారా పారిశుద్యాన్ని మెరుగ పర్చడంతోపాటు చెత్త నుంచి సంపద తయారు చేసుకునే అవకాశాన్ని కల్పించాలని పంచాయితీరాజ్ శాఖ ప్రణాళికలు తయారు చేసింది. ప్రతి పంచాయితీలో ఊబరైజేషన్ ద్వారా అక్కడ లభించే చెత్త, పేడను వర్మీకంపోస్టులకు తరలించి అక్కడ తయారయిన సేంద్రియ ఎరువుతో వ్యవసాయం చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. నరేగా పథకంతో ఇప్పటి వరకు 2014 నుంచి రూ.93.6 కోట్ల ఖర్చుతో 212740 వర్మి కంపోస్ట్ పిట్‌లను ఏర్పాటు చేశారు.

మార్చిలోగా సగం పంచాయితీల్లో జీరో వేస్ట్ ప్రాజెక్ట్

అడిషనల్ కమిషనర్ సుధాకర్ రావు

2018 మార్చిలోపు రాష్ట్రంలోని సగం పంచాయితీల్లో జీరో వేస్ట్ ప్రాజెక్ట్ చేపడతామని పంచాయితీరాజ్ అడిషనల్ కమిషనర్ సుదాకర్ రావు అన్నారు. బుధవారం ఆంధ్రప్రభ తో మాట్లాడిన ఆయన ఇప్పటికే 900 వర్మీకంపోస్ట్ షెడ్డులు నిర్మించామని, మరో 3500 షెడ్డులు నిర్మాణంలో ఉన్నాయ న్నారు. రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో జీరోవేస్ట్ ప్రాజెక్టు పూర్తిగా అమలవుతుందన్నారు. గ్రామాల్లో సేకరించి న తడి చెత్త, పేడను మొబలైజర్లు వర్మీ కంపోస్టు కేంద్రాలకి చేరుస్తారని అక్కడ ఊబరైజేషన్ ద్వారా సేంద్రియ ఎరువుగా మార్చుతారన్నారు. పొడి చెత్తలోని ప్లాస్టిక్‌ను విక్రయించడం జరుగుతుందని, దానిని ముక్కలు ముక్కలుగా చేసి రోడ్డు నిర్మాణంలో ఉపయోగించుకుంటారని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్లకు, మొబలైజర్లకు ప్రారంభంలో నరేగా పథకం నుంచే రోజువారి వేతనాలు ఇస్తారని, వర్మీకంపోస్టుల ఆదా యం పెరిగిన తర్వాత వాటిద్వారా చెల్లించడం జరుగుతుందన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
గురువారం 11 జనవరి 2018

ఎన్నారైలతో దూరం తగ్గుతోంది!

ఉపాధి కోసం, ఉన్నత విద్యా, ఉద్యోగావకాశాల కోసం ఏ దేశానికి వెళ్ళినా, స్వదేశాన్ని మరిచిపోవద్దని ప్రవాస భారతీయులకు కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ప్రధానమంత్రి, రాష్ట్రపతి హితబోధ చేయడం సర్వసాధారణమే. ఇంటర్నెట్ పుణ్యమా అని ప్రపంచంలో ఏ మూల ఏం జరుగుతోందో క్షణాల్లో తెలుసుకుంటున్న భారతీయులు లండన్‌లో పేలుళ్ళు సంభవించినా, అమెరికాలో హత్యలు జరిగినా తమ రక్త సంబంధీకులు ఎలా ఉన్నారోనని కలత చెందడమూ సర్వసాధారణమే. సమాచార విస్తృతి పెరగడం వల్ల ప్రవాస భారతీయులు స్వదేశంలో ఏం జరిగినా గతంలో మాదిరి కాకుండా వెంటనే స్పందిస్తున్నారు. మానసికంగా దూరం తగ్గుతోంది. విదేశాల్లో స్థిరపడి, అక్కడి పౌరసత్వాలను పొందిన భారతీయుల్లో ఎక్కువ మంది గతంలో వైద్యులు, ఇంజనీర్లు మాత్రమే ఉండేవారు. ఇప్పుడు చట్టసభల్లో ప్రాతినిధ్యం సంపాదించే స్థాయికి ఎదుగుతున్నారు. అమెరికా పూర్వ అధ్యక్షుడు బరాక్ ఒబామా తన పాలనా యంత్రాంగంలో భారత సంతతికి చెందిన వారి సేవలను బాగా ఉపయోగించుకున్నారు. ఇప్పుడు ట్రంప్ కూడా అదే రీతిలో భారత సంతతికి చెందిన వారిని ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారు. ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారిగా పనిచేస్తున్న నిక్కీ హేలీ భారత సంతతికి చెందిన మహిళ. ప్రవాస భారతీయులు ప్రతి సంవత్సరారంభంలో ఢిల్లీలో కలుసుకుని ఉమ్మడి సమస్యలను చర్చించుకోవడం, భారత ప్రభుత్వం నుంచి పొందాల్సిన సహాయాల గురించి జాబితా తయారు చేసి కేంద్రానికి అందజేయడం ఆనవాయితీగా మారింది. భారతీయ ప్రవాసీ సదస్సు పేరిట మూడు రోజుల పాటు నిర్వహించే సమావేశాల్లో ఈసారి రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేసిన ప్రసంగం ఆలోచనలను రేకెత్తిస్తోంది. ప్రవాస భారతీయులు కేవలం పరస్పరం పొగుడుకోవడానికి, తమ ఉన్నతి గురించి సాటివారికి తెలియజేయడానికి మాత్రమే విలువైన సమయాన్ని వెచ్చించడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదనీ, స్వదేశానికి తాము సైతం ఎంతో కొంత సాయం చేయగలమా అని ఆలోచించాలని ఆయన సలహా ఇచ్చారు. ప్రధానమంత్రి బాధ్యతలను స్వీకరించిన నాటి నుంచి నరేంద్రమోడీ ఏటా ఇలాంటి సలహాలు ఇవ్వడమే కాకుండా, స్వరాష్ట్రమైన గుజరాత్‌లో పరిశ్రమల స్థాపనకు ప్రవాస భారతీయులను ఆహ్వానిస్తూనే ఉన్నారు. ఆయన పిలుపు వృధా కాలేదు. చాలా మంది ఎన్ఆర్ఐలు ఉజ్వల గుజరాత్ సభలకు హాజరై ఇప్పటికే భారీగాపెట్టుబడులు పెట్టారు. ప్రవాస భారతీయుల పెట్టుబడులను ఆశిస్తున్న కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా వారికి కనీస మౌలిక సదుపాయాలను కల్పించడం అత్యవసరం. భూములు, విద్యుత్, నీరు పుష్కలంగా లభించేట్టు చూడాలి. పరిశ్రమలు నిలదొక్కుకోవడానికి కొంతకాలం పాటు రాయితీలు ఇవ్వాలి. వీటికి సన్నద్ధం అయిన తర్వాతనే, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐల) కోసం, ప్రవాస భారతీయుల నిధుల కోసం ఆశించడం అర్ధవంతం అవుతుంది. కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా, ప్రవాస భారతీయులకు తగిన వనరులు, వసతులు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. యూపీఏ హయాంలో ప్రవాస భారతీయుల సమస్యలను పరిష్కరించడం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేశారు. అంతకుముందు వాజ్‌పేయి హయాంలోని ఎన్‌డియే-1 ప్రభుత్వంలో పెట్టుబడుల ఉపసంహరణ శాఖ ఉండేది. దానిని యూపీఏ హయాంలో ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రవాస భారతీయుల శాఖగా మార్చారు. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలను చేపట్టిన పరిస్థితుల్లో వచ్చిన మార్పును చూస్తూనే ఉన్నాం. హెచ్-1బీ వీసాల విషయంలో ఆయన ఎన్ని పిల్లి మొగ్గలు వేశారో కళ్ళారా చూశాం. అమెరికాలో కానీ, గల్ఫ్ దేశాల్లో కానీ, భారతీయుల సేవలు, మేథో సంపత్తి లేనిదే పనులు జరగవన్న వాస్తవాన్ని ట్రంప్ ఆలస్యంగా తెలుసుకున్నారు. హిల్లరీ క్లింటన్ అమెరికా అధ్యక్షురాలు అయి ఉంటే ప్రవాస భారతీయుల పరిస్థితి మెరుగ్గా ఉండేది. 23 పైగా దేశాల్లో చట్టసభల్లో సభ్యులుగా రాణిస్తున్న 123 మంది ప్రవాస భారతీయులు ఢిల్లీలో జరిగిన భారతీయ ప్రవాసీ దివస్‌కి హాజరు కావడం చెప్పుకోదగిన విషయం. ప్రవాస భారతీయులంటే మనకు ముందుగా గుర్తొచ్చేది అమెరికా, బ్రిటన్ వంటి పాశ్చాత్య దేశాల్లో స్థిరపడిన వారే. కానీ, గల్ఫ్ దేశాల్లో స్థిరపడిన భారతీయుల శ్రేయస్సు గురించి, సమస్యల గురించి తెలుసుకుని పరిష్కరించడం ఎంతైనా అవసరం. ముఖ్యంగా, మోసపూరిత ఏజెంట్ల వలలో చిక్కుకున్న ఉద్యోగార్థుల సమస్యలను పరిష్కరించడం ఎంతైనా అవసరం. యూపీఏ హయాంలో ప్రవాస భారతీయుల శాఖ మంత్రిగా వాయలార్ రవి గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయులకు న్యాయం చేకూర్చే విషయమై కృషి చేశారు. ఇప్పుడు విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఆ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తున్న మాట నిజమే అయినా, ప్రత్యేక శాఖను కొనసాగిస్తే ప్రవాస భారతీయుల సమస్యలు తక్షణం పరిష్కారం అవుతాయి.

డిజిటల్ పాలనకే మొగ్గు!

ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి రాగానే మూడు కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు ప్రకటించారు. మేక్ ఇన్ ఇండియా, డిజిటలైజేషన్, డీమానిటైజేషన్‌లను పట్టుపట్టి మరీ అమలు చేశారు. మేక్ ఇన్ ఇండియాను విజయవంతంచేయడానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐల) పరిమితిని 49 శాతానికి పెంచారు. రక్షణోత్పత్తి రంగంలో పరాధీనతను తగ్గించడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశమని కూడా ప్రకటించారు. విదేశీ పరిజ్ఞానంతో రక్షణ రంగానికి అవసరమైన యంత్రాలు, విడిభాగాలను దేశంలోనే ఉత్పత్తి చేసుకోవడం ద్వారా, తయారీరంగంలో ఉపాధి అవకాశాలను పెంచాలన్నది ఆయన అభిమతం. విదేశాల నుంచి ఆశించిన స్థాయిలో ఎఫ్‌డిఐలు రాకపోవడంతో ఈ కార్యక్రమం ముందుకు సాగడం లేదు. డిజిటలైజేన్ మాత్రం అనుకున్న ప్రకారమే ప్రోత్సాహకరంగా పరుగులు తీస్తోంది. 2017 మూడో త్రైమాసికంలో పార్లమెంటు జిఎస్టీని అమలులోకి తెచ్చింది. బీహార్‌లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మహాకూటమి నుంచి వై దొలగి ఎన్‌డిఏలో చేరడంతో బీజేపీ ప్రాబల్యం పెరిగింది. ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌ని తన ఖాతాలో వేసుకుంది. గుజరాత్‌లో మెజారిటీ తగ్గినా అధికారాన్ని నిలబెట్టుకుంది. ప్రధానమంత్రి మోడీ ప్రాధాన్యం ఇస్తున్న ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా అమలు జేయడానికీ, సుపరిపాలనను అందించడానికీ ఈ పరిణామాలు దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు. అమెరికాలో మాదిరిగా భారత్‌లోని రాష్ట్రాలు ప్రజాస్వామ్యానికి ప్రయోగశాలలుగా ఉపయోగపడవచ్చు. వాటి ప్రయోగాలు రోజురోజుకీ మరింత రాటు తేలుతున్నాయి. దేశంలోని రాష్ట్రాల్లో అభివృద్ధి గురించిన తాజా వివరాలను ప్రతి వారం వాధ్వానీ నేతృత్వంలోని కమిటీ సేకరిస్తోంది.

2017 మూడో త్రైమాసికంలో ఈ కమిటీ సేకరించిన వివరాల ప్రకారం వివిధ రాష్ట్రాలు డిజిటల్ పాలనపై దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి. వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యవసరమనీ, ఇందుకు రాజకీయ మద్దతు అవసరమనీ నిర్ధారణకు వచ్చాయి.

విద్యుత్ రంగంలో రాష్ట్రాలు, ప్రైవేటు రంగం పరిధిలోని డిస్కంలు స్మార్ట్ మీటర్ల వినియోగం ద్వారా ఇంధన వాడకంలో పొదుపును పాటించగలిగాయి.

ఢిల్లీలో టాటా పవర్ విద్యుత్ పంపిణీ విభాగం వచ్చే మార్చి నుంచి 2,50,000 స్మార్ట్ మీటర్లను పంపిణీ చేయనున్నట్టు ప్రకటించింది. ఈ స్మార్ట్ మీటర్లను ఇంటర్నెట్‌తో అనుసంధానం చేయవచ్చు. కేంద్ర విద్యుత్ వ్యవస్థనూ, స్మార్ట్ మీటర్లను అనుసంధానం చేయడానికి దీని ద్వారా వీలుంది. ఏ విధంగా ఎప్పుడు విద్యును వినియోగదారులు వినియోగించుకోవాలో తెలియజేయడానికి దీని ద్వారా వీలుంటుంది.

ఆంధ్రప్రదేశ్‌లో పది లక్షల సంప్రదాయ బల్బుల స్థానే ఎల్ఈడీ బల్బులను వినియోగిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇంధనం పొదుపునకు, మరిన్ని మెరుగైన



విద్యుత్ సౌకర్యాలను అమలు జేయడానికి ఎల్ఈడీ బల్బులు ఉపయోగపడుతున్నాయి. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. ఈ కార్యక్రమం కింద పదిలక్షల వీధి లైట్లకు సంప్రదాయ బల్బుల స్థానే ఎల్ఈడీ బల్బులను అమర్చారు. ఏటా 25 మిలియన్ డాలర్ల సొమ్మును ఆదా చేశారు. ఈ విధానాన్ని ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్‌ను ఎప్పుడు ఎలా వినియోగించుకోవచ్చునో వినియోగదారులకు తెలియజేసే వీలుంది. ఒడిషా కూడా ఎల్ఈడీ బల్బుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నట్టు ప్రకటించింది. ముందుగా వీధిలైట్లకు ఈ బల్బులను అమర్చి క్రమంగా ఇళ్ళకు కూడా పంపిణీ చేసేందుకు పెద్ద ప్రణాళికను రూపొందించింది.

ఆంధ్రప్రదేశ్‌లో రెండు డిస్కమ్‌లు భారత్ క్యూఆర్‌ల ద్వారా చెల్లింపులను డిజిటల్ చెల్లింపులను అనుమతిస్తున్నాయి. పాలనా సామర్థ్యాన్నీ, నైపుణ్యాన్నీ పెంచేందుకు దేశంలోని రాష్ట్రాలు డిజిటల్ పరికరాలను వినియోగిస్తున్నాయి. ఇతర రంగాల్లో కూడా డిజిటల్ సర్వీసుల వినియోగానికి అనుమతిస్తున్నాయి. ఈశాన్య రాష్ట్రమైన నాగాలాండ్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెల్లింపులన్నీ డిజిటల్ ప్రాతిపదికపైనే జరుగుతున్నాయి. కూలీల వేతనాలన్నీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ విధానంలో పారదర్శకత ఎంతో ఉంది. అవకతవకలకూ, అక్రమాలకూ అవకాశాలు తక్కువ.

మహారాష్ట్రలో మహా డిబిటి పోర్టల్‌ని ప్రారంభించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఈ పోర్టల్ ద్వారా సబ్సిడీ మొత్తాలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ప్రొక్యూర్‌మెంట్ల కోసం కేంద్ర ప్రభుత్వ ఈ మార్కెట్ ప్లేస్ విధానాన్ని వినియోగించుకుంటున్నట్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ప్రకటించాయి.

కర్నాటక ప్రభుత్వం రైతులకు తోడ్పాటునిచ్చేందుకు మైక్రో సాఫ్ట్ సంస్థతో సంప్రదిస్తోంది. ఏయే పంటలు వేస్తే రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయో తెలుసుకునేందుకు మైక్రోసాఫ్ట్ సహకారంతో సమాచారాన్ని కర్నాటక వ్యవసాయ శాఖ సేకరిస్తోంది.

పంజాబ్ ప్రభుత్వం నిర్మాణ రంగంలో కార్మికులకు వేతనాలు, ఇతర సదుపాయాలను నమోదు చేయడానికి ఒక పోర్టల్‌ని నిర్వహిస్తోంది. ఆరోగ్య సంరక్షణ, విద్య,శిక్షణ రంగాల్లో సేవల విస్తృతికి, మెరుగుదలకు డిజిటల్ పరికరాలనూ, వ్యవస్థలనూ పలు రాష్ట్రా లు ఉపయోగించుకుంటున్నాయి.తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో శిశు సంరక్షణలో క్లౌడ్ ఆధారిత విశ్లేషణకు మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కార్యక్రమం కింద శిశువుల ఆరోగ్య రక్షణకు సంబంధించిన సమాచారాన్ని మైక్రోసాఫ్ట్ సహకారంతో సేకరిస్తారు. నేత్ర వ్యాధుల గురించిన సమాచారాన్ని సేకరించేందుకు మైక్రోసాఫ్ట్ సహకారం సతీసుకుంటున్నారు. తెలంగాణలో ముఖ్యంగా, హైదరాబాద్‌లో డిజిటల్ ఆరోగ్య రికార్డులను నిర్వస్తున్నారు. మహిళా శిశు రక్షణకు తీసుకుంటున్న చర్యలు ఏవిధంగా వారికి లబ్ధి చేకూరుస్తున్నాయో సమాచారాన్ని డిజిటల్ వ్యవస్థ ద్వారా సేకరించి ప్రభుత్వం భద్రపరుస్తోంది.

కర్నాటక టాటా ట్రస్టు సహకారంతో ఆరోగ్య సేవల హబ్‌ని ప్రారంభిస్తోంది. లబ్ధిదారులకు మెరుగైన సేవలందించడానికి ఈ రికార్డులు ఎంతో ఉపయోగపడతాయి. స్థానిక ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాల వినియోగాన్ని 50 శాతం పెంచేందుకు డిజిటల్ పద్ధతిని వినియోగించుకోవాలని కర్నాటక ప్రభుత్వం యత్నిస్తోంది. ఆధార్ కార్డుల ఆధారంగా 140 లక్షల ఇళ్ళకు ఆరోగ్య సేవలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది.

ఉత్తరప్రదేశ్ టెలిమెడిసిన్ విధానాన్ని ప్రవేశ పెడుతోంది.ఆరోగ్య సేవలు ప్రజలందరికీ అందించేందుకు ఇదే మెరుగైన విధానమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రోగులకు వైద్యుల సలహాలు ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉండేట్టు చూడటానికి ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తోంది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పరిశ్రమలకు అనుమతులకు సింగిల్ విండో విధానాన్ని డిజిటల్ పద్ధతి ద్వారా అమలు జేస్తోంది. ఇందుకోసం ఒక పోర్టల్‌ని ప్రారంభించాలని నిర్ణయించింది.

గుజరాత్ ప్రభుత్వం వివిధ శాఖల్ల డిజిటల్ విధానం అమలు కోసం గూగుల్ సంస్థతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. హర్యానా ముఖ్యమంత్రి విద్య, ఉపాధి శిక్షణ రంగాల్లో మెరుగైన సేవలను అందించడానికి ఢిల్లీలోని డెల్ ఫౌండేషన్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.


చత్తీస్‌గఢ్ ప్రభుత్వం మహిళలకు స్మార్ట్ ఫోన్‌లను పంపిణీ చేస్తోంది. వివిధ సేవలకు స్మార్ట్ ఫోన్‌ని వినియోగించడంలో మహిళలకు మెలకువలను నేర్పుతోంది. మొత్తం మీద దేశంలోని చాలా రాష్ట్రా లు మెరుగైన,పారదర్శకమైనపాలన కోసం డిజిటల్ వైపు మొగ్గు చూపుతున్నాయి.ముఖ్యంగా,చిన్న రాష్ట్రా ల్లో సుపరిపాలనకు మార్గాన్ని సుగమం చేయడానికి డిజిటల్ వ్యవస్థ ఎంతో ఉపయోగ పడుతోంది.

● ఎ.పి. స్వామి

నివాళి

నిజాయితీకి నిలువుటద్దం


తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సుదీర్ఘ కాలం ఆ పదవిలో కొనసాగడం వల్ల ఆయన తర్వాత ఎవరు అని ఆరోజుల్లో పత్రికల్లో పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు వచ్చేవి. అంత సమర్థులు ఎవరూ లేరని కూడా నిర్ధారణకు వచ్చిన పత్రికలు ఆ దిశగా కథనాలను కూడా ప్రచురించేవి. నెహ్రూ మంత్రివర్గంలో రైల్వే శాఖను నిర్వహించి, సమర్థుడిగా పేరు తెచ్చుకున్న లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని పదవిలో కొనసాగింది కొద్ది కాలమే


నేడు వర్థంతి

అయినా, దేశానికి ఎంతో పేరు తెచ్చారు. 1965లో పాకిస్తాన్‌తో యుద్ధంలో భారత సత్తా తెలియజేసి పొట్టివాడైనా గట్టివాడనిపించారు. నైతిక విలువలకూ, ప్రమాణాలకూ లాల్ బహదూర్ పెట్టింది పేరు. శాస్త్రి అనేది ఆయన సామాజిక వర్గాన్ని సూచించే నామం కాదు. కాశీ విద్యాపీఠంలో శాస్త్రి పట్టా పొందడం వల్ల ఆయన శాస్త్రి అయ్యారు. రాజకీయాల్లో తన వారసులను ప్రవేశపెట్టాలని ఏనాడూ ఆయన ఆలోచించలేదు. రైల్వే మంత్రిగాఉన్నప్పుడు రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత స్వీకరించి రాజీనామా చేసి ఉన్నత విలువలకు దర్పణంగా నిలిచారు. పాకిస్తాన్‌తో యుద్ధం సమయంలో జైజవాన్, జైకిసాన్ నినాదాన్ని ఇచ్చి దేశ ప్రలను సంఘటితం చేశారు. దేశ రక్షణ నిధికి విరాళాలు ఇవ్వాలని ఆయన ఇచ్చిన పిలుపునకు మహిళలు స్పందించిన తీరు అపూర్వం. తమ ఒంటి మీద ఉన్న బంగారం ఆభరణాలను తృణప్రాయంగా ఎంచి దేశ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చారు. లాల్ బహదూర్ అంటే మూర్తీభవించిన నిజాయితీ, నైతిక రీతి. ఆనాటి సోవియట్ యూనియన్‌లో భాగమైన తాష్కెంట్‌లో పాక్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు వెళ్ళినప్పుడు ఆయన గుండెపోటు వల్ల మరణించారు. ఆయన మరణంపై అనుమానాలు ఈనాటికీ వ్యక్తమవుతూనే ఉన్నాయి. విషప్రయోగం వల్ల ఆయన మరణించారన్న కథనాలు ఇప్పటికీ వెలువడుతున్నాయి. లాల్ బహదూర్ అధికారంలో ఉన్నది స్వల్పకాలమే అయినా దేశ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.

చరిత్రలో ఈ రోజు

- 1920: ఫ్రెంచి ప్రయాణికుల నౌక ఆఫ్రిక్ లా రోషెల్ వద్ద మునక, 550 మంది జలసమాధి.
- 1922: మధుమేహ వ్యాధి చికిత్సనిమిత్తం 14ఏళ్ళ లియోనార్డ్‌థాంప్సన్(జపాన్)కు తొలిసారి ఇన్సులిన్ ఇచ్చారు.
- 1942: కౌలాలంపూర్, మలయాలను జపాన్ ఆక్రమించింది.
- 1972: తూర్పు పాకిస్థాన్ బంగ్లాదేశ్‌గా అవతరించింది. అబూ సయ్యద్ చౌదరి రాష్ట్ర పతిగానూ, ముజిబుర్ రహ్మాన్ ప్రధాన మంత్రిగానూ బాధ్యతలు చేపట్టారు.
- 1988: రసాయనిక ఆయుధాల (విష వాయువు, తదితరాలు)ను 140 దేశాలు నిషేధించాయి.
- 1991: ఇరాక్‌పై యుద్ధానికి ఆదేశించేందుకు అవసరమైన అధికారాన్ని అమెరికన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జి బుష్‌కు కట్టబెట్టింది.



రైస్‌బ్రాన్ ఉత్పత్తిలో అగ్రస్థానం

ప్రధాన ఆహారధాన్యాల ఉత్పత్తిలో మిగులు స్థానంలో ఉన్న భారతదేశం వంటనూనెల అంశంలో దిగుమతులపై ఆధారపడింది. ఇప్పటికీ 60 శాతానికి పైబడి వంటనూనెలను దిగుమతి చేసుకోవలసి వస్తోంది. దీని విలువ 60 వేల కోట్ల రూపాయల పైమాటే. ఈ తరుణంలో రైస్ బ్రాన్ (తవుడు నుండి తీసిన నూనె) వంటనూనె ఉత్పత్తి విషయంలో మన దేశానిదే అగ్రస్థానం కావటం కాస్త సంతోషాన్నిచ్చే అంశం. ప్రపంచ రైస్‌బ్రాన్ వంటనూనె ఉత్పత్తిలో 36 శాతం మనదే కావటం గమనార్హం. ఇప్పటికీ మన దేశంలో తవుడు నూనె మిల్లులకు సరిపడా ముడిపదార్థం దొరకటం లేదు. ఈ కారణంగా అవి తమ సామర్థ్యంలో 65 శాతానికి మించి పనిచేయటం లేదు. విదేశాల నుండి తవుడు దిగుమతి చేసుకొనే అవకాశం ఉన్నా 15 శాతం దిగుమతి సుంకం కారణంగా మిల్లులు దిగుమతికి వెనుకంజ వేస్తున్నాయి. వ్యవసాయ వాణిజ్య రంగ నిపుణులు ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి 15 శాతం తవుడు దిగుమతి సుంకం రద్దుకు ఒప్పించాయి. ఫలితంగా మలేషియా, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల నుండి తవుడు దిగుమతి కి అవకాశం లభించింది.

ధాన్యాన్ని మర ఆడినప్పుడు సుమారుగా 63 నుండి 65 శాతం బియ్యం, 23 నుండి 25 శాతం ఊక, 8 నుండి 10 శాతం తవుడు వస్తాయి. భారతదేశంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తవుడు దోహదపడింది. పశువుల దాణాలో తవుడుకే అగ్రస్థానం. పాల అధిక దిగుబడికి, పాలలో వెన్న శాతాల పెరుగుదలకు తవుడును పశువులకు ప్రధాన దాణాగా వినియోగిస్తారు. ముప్ఫైఏళ్ళ క్రితం తెలుగు వాడైన సర్దేశాయి తిరుమల రావు తవుడు నుండి నూనె తీసే ప్రక్రియను కనుగొన్నారు. అనంతపురంలోని తైల సాంకేతిక పరిశోధనా సంస్థలో ఈ విజయాన్ని సాధించారు.

తవుడు నూనెలో విలువైన పోషకాలున్నాయి. తక్కువ కొలెస్ట్రాల్ గల నూనెగా ఇది పేరు పొందింది. విలువైన ఇ విటమిన్‌కు ఇది ఖజానాగా మారింది. వంటనూనెలలో పేరు పొందిన ఆలివ్ ఆయిల్‌ను సైతం సవాల్ చేసే విశిష్ట అంశాలు ఈ నూనెలో ఉండడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఈ నూనె వాడకం ఊపు అందుకుంది. వంటనూనెల్లో వందల రకాలు ఉన్నా అందులో పేరుపొందిన మొదటి పరికరాల్లో తవుడు నూనె (రైస్‌బ్రాన్ ఆయిల్) స్థానం సంపాదించింది. ప్రపంచంలో వరి ఎక్కువగా ఉత్పత్తయ్యే చైనాను, ప్రపంచ వరి మార్కెట్ శాసిస్తున్న థాయ్‌లాండ్‌ను పక్కకు నెట్టి భారతదేశం తవుడు నూనె ఉత్పత్తి - వినియోగం ఎగుమతుల్లో దూసుకుపోతోంది. ఏటా నూనె తీసిన తవుడు ఎగుమతి ద్వారా 500 కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశంలో వరి పండించే అన్ని రాష్ట్రాలలోను 400 కి పైగా తవుడు నుండి నూనె తీసే మిల్లులు ఉన్నాయి. ప్రస్తుతం మన దేశంలో 8.2 లక్షల టన్నుల తవుడు నూనె ఉత్పత్తవుతోంది. ముడి తవుడులో 15 నుండి 24 శాతం నూనె ఉంటుంది. తవుడు నూనె మిల్లులు ఎక్కువగా ఉన్న చైనా, భారత్, థాయ్‌లాండ్, జపాన్, వియత్నాం దేశాలు అనారోగ్యకర పోటీ నివారణ కోసం ఒక సమాఖ్యగా ఏర్పడ్డాయి. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రైస్‌బ్రాన్ ఆయిల్ (ఐసి ఆర్‌బిఒ) పేరుతో ఈ సమాఖ్య 2013లో థాయ్‌లాండ్‌లో సమావేశమైంది. గుండెజబ్బుల నివారణ కారణాంశాలతో పాటు తక్కువ కేలరీలు ఇతర నూనెల్లోలేని ఇ విటమిన్ 20 శాతం తక్కువ నూనె వాడినా రుచులలో తేడా లేకపోవడం మొదలైన సుగుణాల తవుడు నూనెలో ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ కితాబు నిచ్చింది. ఇప్పటికి ప్రపంచ వంట నూనెల రంగంలో 60 శాతం వాటాను పామాయిల్, సోయాచిక్కుడు నూనెలే ఆక్రమించడం కొసమెరుపు.

❑ పుట్టా సోమన్న చౌదరి, 94403 39682

తెలుగు.. మనకెంత తెలుసు!

ప్రతి మనిషి తన తల్లి గురించి, తన అమ్మనుడి (మాతృభాష) గురించి గొప్పగా చెప్పుకోవాలి. అలా చెప్పుకోవాలంటే అమ్మ మమకారాన్ని చవిచూడాలి. భాష గొప్పదనాన్ని, దాని సౌందర్యాన్ని తెలుసుకోవాలి.

మన అమ్మ నుడి గురించి మనలో చాలామందికి, చాలా విషయాలు తెలియవనే చెప్పాలి. ప్రస్తుతం మనం మాట్లాడుతున్న, రాస్తున్న తెలుగుమాటలు నిజంగా అవి మన తెలుగుమాటలు కావు. నేడు వాడుకలో వున్నమాటలలో 50 శాతం ఇంగ్లీషు పదాలు, 30 శాతం సంస్కృత పదాలు, 10 శాతం ఉర్దూ, హిందీ ఇతర పదాలువున్నాయి. అంటే మనం మాట్లాడే మాటలలో 10 శాతం మాత్రమే తెలుగుపదాలు.

ఉదాహరణకు ఈ నుడువు (వాక్యం) చూడండి.

మమ్మీ ఈ రోజు మా స్కూలులో ఫుట్‌బాల్ మ్యాచ్ ప్రారంభోత్సవం అని ఓ పిల్లాడు, అమ్మతో అన్నాడనుకుందాం.

ఒకసారి పై నుడువులో మాటలు పరిశీలిస్తే -

మమ్మీ, స్కూల్, ఫుట్‌బాల్, మ్యాచ్ - ఇంగ్లీషు పదాలు.

రోజు - అరబ్బీ పదం, ప్రారంభోత్సవం -సంస్కృత పదం అంటే అంత పెద్ద వాక్యంలో తెలుగుమాటలు, ఈ, మా, లో ఎంత దుర్మార్గం, మనం మాట్లాడే మాటలు మనవి కావు. దీనికి కారణం మన పుస్తకాలలో (నోయిలు) ఇంత వరకు వాడిన భాష, ఆంధ్రీకరణ కాదు సంస్కృతీకరణ భాషను వాడడమే. అవే మనం చదవడమే కారణం.

మనం ఇప్పటికైనా కళ్ళుతెరిచి మన అమ్మనుడిని మన మాటలను రక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మధ్యనే ఐక్యరాజ్యసమితి (యుఎన్‌ఓ) నివేదిక ప్రకారం ఇండియాలో రాబోయే 30 సంవత్సరాలలో కనుమరుగయ్యే భాషలలో తెలుగొకటని తేలింది.

నిజమే అనిపిస్తుంది. ఎందుకంటే నేడు తెలుగువారి ఇళ్ళలో అంతా ఇంగ్లీషు బడి చదువులే. పిల్లలకు తెలుగు అక్షరాలు రావు, ఆపై తెలుగు చదవలేరు. పైగా మాట్లాడలేరు కదా! కనుక ఇకనైనా ప్రభుత్వాలు (ఏలికలు), తెలుగువారు నడుంకట్టి మన భాషను కాపాడుకోవాలి. ఒకసారి మనం నిజజీవితంలో ప్రతి పొద్దు మాట్లాడే, రాసే పదాలను పరిశీలిద్దాం.

మనం వాడుతున్న ఇంగ్లీషు పదాలు: స్టేషన్, కాలేజీ, బస్, రైలు, టికెట్, కారు, బైకు, పెట్రోలు, డీసెల్, గ్యాస్, టిఫిన్, మీల్స్, వాటర్, స్కూలు, మమ్మీ, డాడీ, అంకుల్, ఆంటీ, బెట్, రెడ్, గుడ్, బ్యాడ్, రైట్, రాంగ్, ఎస్, నో, లవ్, డాక్టరు, యాక్టర్, పెన్, బ్రష్, మనీ, సుగర్, సెల్, లాప్‌టాప్... ఇలా ఎన్నో ... ఎన్నెన్నో...



మనం నిత్యం వాడుతున్న సంస్కృత పదాలు

ఇవన్నీ తెలుగుపదాలే అని అందరూ భావిస్తుంటారు. నిజానికివి సంస్కృత పదాలని మనలో చాలామందికి తెలియదు.

భాష, బాధ, భోజనం, వర్షం, కష్టం, నష్టం, ఇష్టం, మూత్రం, రక్తం, ఇంధనం, ఉపన్యాసం, అధ్యాపకుడు, కర్షకుడు, సచివాలయం, కార్యాలయం, విద్య, భామ, నూతన, ఉదయం, రాత్రి, భర్త, భార్య, మాత, పిత, అర్చన, సంవత్సరం, సంతోషం, మనస్కారం, సభ, సంస్కృతి, కృతజ్ఞత ... యిలా... ఎన్నో ఎన్నెన్నో...

మన నిత్యం వాడే ఉర్దూ, హిందీ ఇతర నుడులు

ఖర్చు, జబ్బు, కిమ్మత్తు, దవాఖానా, సుల్తాను, ఖైదీ, రోజు, పద్దు, సర్కారు, స్వారీ, కాగితం, తగాదా, జప్తు, జమానా, గుమస్తా, జమీన్, శిస్తు, ఆఖరు, వగైరా, హంగామా, చాకిరి, సలాం, జిల్లా, జమీందారు, ఖరీదు, దస్తూరి, ఫిర్యాదు, కబురు, దివాను, రుమాలు, సాలీనా, మొదలైనవి ... ఎన్నో...

మన నిత్య జీవితంలో మనకు తెలియకుండానే చాప కింద నీరులా పరభాషా పదాలు ప్రవేశించి, మన మాటల్ని బయటకు నెట్టాయి. అంటే పరభాషా పదాలు ఉపయోగించకూడదని, పరభాషను నేర్చుకోకూడదని కాదు మన వాదన.

ఏదైనా ఒకపరభాషా పదం వచ్చినప్పుడు, దానికి తగిన పదాన్ని మన మాతృభాషలో కనిపెట్టి, వాడుకలోకి తేవాలి. అలాంటి ప్రయత్నాన్ని తమిళులు, ఫ్రెంచివారు, హిబ్బ్రూ, అరబ్బులు, కన్నడిగులు చేస్తున్నారు. కొత్తమాటలు కనుపెడుతూ, వారి అమ్మనుడిని అభివృద్ధి చేసుకొంటున్నారు. మన తెలుగువారు మాత్రం, సంస్కృతీకరణ పదాలతో, ఆంగ్ల పదాలతో పబ్బం గడుపుకొంటున్నారు. ఈ విషయాన్ని అందరూ ఆలోచించవలసి ఉంది. మేధావులు, భాషావేత్తలు, ప్రభుత్వాలు స్పందించాలి. పక్క రాష్ట్రా ల వారినైనా చూసి, మన తెలుగుకు పట్టిన తెగులును వదిలించుకోవాలి. తెలుగును తప్పనిసరిగా పాఠ్యాంశాలలో చేర్చాలి. పాత జీవోలను అమలు పరచాలి. అప్పుడే తెలుగుభాష పదికాలాల పాటు మనగలుగుతుంది. లేదంటే రాబోయే కాలంలో తెలుగు అక్షరాలను మ్యూజియంలో చూడవలసి వస్తుంది.

వాడుకలోకి తెచ్చుకోవలసిన కొన్ని తెలుగు మాటలను పరిశీలిద్దాం

సాఫ్ట్‌వేర్ : నునురువు, **హార్డ్ వేర్**: కటురువు, **పేపర్, కాగితం**: రాతాకు, **కంప్యూటర్**: లెక్కిన, ఎనికెన, **గుడ్‌మార్నింగ్**: మేలుపొద్దు, **గుడ్ ఈవినింగ్**: మేలు మాపటేల, **నైట్**: చీకటేల, **వెల్‌కం, స్వాగతం**: మేలురాకడ, **కాన్వెంట్, ప్రైమరీ స్కూల్, ప్రాథమిక**: మొదలిడుబడి, తొలిబడి, **సెకండరీ స్కూలు**: మలిబడి, **హైస్కూల్**: మిడిబడి, **కాలేజీ, కళాశాల**: పాటిచదివిలు, **యూనివర్శిటీ**: పెనుచదివిలు, **పాఠము, లెసన్**: చదువెన, **ప్రభుత్వం**: దొరతనం, **హెల్‌మెట్**: తలకాపెన, **స్టాండ్**: నిలిపెన, **స్టీరింగ్**: తిప్పెన, **విరామం**: విడుపు, **మార్కులు**: పొందికలు, అంకములు, **సభ**: కూటువ. **బస్సు**: పేరేగి, **కారు**: ఊరేగి, **సమాఖ్య**: ఎల్లది, సాటిది, **వ్యవస్థ**: కూటమి, **సంఘము**: కూటమి, మేళకం, **రచయిత**: రాతరి, **కవి**: నుడిరి, **సాహిత్యం**: నున్నుడి, **కావ్యం**: నెన్నుడి, **కాఫీ**: కాగినీరు, **క్రికెట్**: జిగటాట, **బ్యాట్**: బొప్పిని, **మాతృభాష**: అమ్మనుడి, **రైలు**: పట్టాలబండి, **ఎక్స్‌ప్రెస్**: వడిబండి, **కాలుక్యులేటర్**: ఎంచిక, **ఇంటర్నెట్**: లోవల, **సినిమా**: తెరాట, **సెల్**: చేపలుక, **టివి**: తొలచూపి, **ప్రారంభోత్సవం** : తొలికొను వేడుక, **రోడ్డు**: బాట, పోక, **దినము**: పొద్దు, నాడు, **బాధలు, కష్టాలు**: ఇడుములు, పాట్లు, **ప్రశ్న**: అడగ, **సమాధానం** : విడుపు, ఎరికెన.

● రాఘవ మాస్టారు
కర్నాటక సాహితీ సమాఖ్య,
బెంగళూరు - 0974377 6920

సూటిమాట

జయకు నోబెల్ ఇవ్వాలి

దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి, అన్నా డిఎంకె అధినేత్రి జయలలిత పేరును నోబెల్ బహుమతికి సిఫార్సు చేయాలి. ఇరవై రెండేళ్ళ క్రితమే ఆమె ఆడపిల్లల హత్యల నిరోధక పథకాన్ని (తొట్టిల్ కుళై థైగల్ తిట్టం-- క్రెడిల్ బేబీ స్కీమ్) ప్రవేశపెట్టారు. ఆమె పేదల కోసం ప్రవేశపెట్టిన జనాకర్షణ పథకాలన్నీ ఒకెత్తు. ఆడపిల్లలు భారంగా భావించి భ్రూణహత్యలకు పాల్పడుతున్న నేటి సమాజంలో వారిని కాపాడేందుకు



జయలలిత ఉదాత్తమైన ఆలోచన చేశారు. అందుకే ఆమె నోబెల్ బహుమతికి అర్హురాలు. ఆమె అప్పట్లో సేలంలో ఈపథకాన్ని ప్రారంభించారు. తర్వాత రాష్ట్రమంతటా విస్తరింపజేశారు. ఈ పథకం అమలులోకి వచ్చిన తర్వాత భ్రూణ హత్యలు బాగా తగ్గాయి. ఈ పథకం అమలులోకి వచ్చిన తర్వాతే, కేంద్రం సేవ్ బేబీ చైల్డ్ నినాదాన్ని ఇచ్చింది.

❑ తమిళనాడు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్
వి.జయరామన్

ఆధార్ బదులుగా వర్చువల్ ఐడీ



● వెబ్‌సైట్ ద్వారా తాత్కాలిక నంబర్ ● అన్ని ధృవీకరణలకు ఉపయుక్తం
● ప్రజల సమాచార గోప్యత ప్రధానం ● మార్చి ఒకటవ తేదీ నుంచి వర్తింపు

న్యూఢిల్లీ: ఆధార్ కార్డుదారులు వారి గోప్యతకు సంబంధించిన ఆందోళనలను పరిష్కరించే దిశగా వర్చువల్ ఐడీ అనే సరికొత్త అంశాన్ని యూఐడీఏఐ బుధవారం ప్రవేశపెట్టింది. ఆధార్‌కార్డులు అదేపనిగా 12 అంకెల బయోమెట్రిక్ ఐడీకి బదులుగా సిమ్ వెరిఫికేషన్ సహా అనేక అవసరాలకు వర్చువల్ ఐడీని యూఐడీఏఐ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు. దీనివలన కార్డుదారులు ధృవీకరణ సమయంలో వారి ఆధార్ నంబర్‌ను పంచుకోవాల్సిన పనిలేదు. 16 అంకెల వర్చువల్ ఐడీ ద్వారా కార్డుదారుని పేరు, చిరునామా, ఫొటో లాంటి పరిమిత సమాచారాన్ని పొందవచ్చు. కార్డుదారులు ఒకటికి మించి ఎన్ని వర్చువల్ ఐడీలనైనా పొందవచ్చని అధికారులు తెలిపారు. కొత్త ఐడీ తీసుకున్నప్పుడు పాత ఐడీ అయాచితంగా రద్దు అయిపోతుంది. వర్చువల్ ఐడీ ఒక వ్యక్తి ఆధార్ నంబర్‌కు సంబంధించి తాత్కాలికమైన 16 అంకెల సంఖ్య. ఆధార్ జారీ చేసే అథారిటీ మార్చి ఒకటవ తేదీ నుంచి వర్చువల్ ఐడీని ఆమోదించడం ప్రారంభిస్తుంది. ప్రజల నుంచి ఆధార్ ధృవీకరణ కోరే ఏజెన్సీలు జూన్ ఒకటవ తేదీ నుంచి వర్చువల్ ఐడీని తప్పనిసరిగా అంగీకరించాలి. నిర్దేశిత గడువు నాటికి సదరు ఏజెన్సీలు కొత్త విధానానికి మారని పక్షంలో అవి ఆర్థికపరమైన చర్యలను చవిచూడాల్సి ఉంటుంది.

ధృవీకరణ లేదా కేవైసీ సేవల కోసం ప్రజలు ఆధార్‌నంబరుకు బదులుగా వర్చువల్ ఐడీని వినియోగించవచ్చు. ఆధార్ నంబర్ తరహాలోనే వర్చువల్ ఐడీ ద్వారా ధృవీకరణ చేపట్టడం జరుగుతుంది అని యూఐడీఏఐ ఒక సర్క్యులర్‌లో పేర్కొంది. ఆధార్ డేటాలో వ్యక్తుల గోప్యతా సమాచార భద్రతను బలోపేతం చేసే దిశగా వర్చువల్ ఐడీ రంగంలోకి వచ్చింది. వినియోగదారులు యూఐడీఏఐ వెబ్‌సైట్ నుంచి నిర్దేశిత కాలానికి వర్చువల్ ఐడీ పొందవచ్చు. అవసరమైతే దాన్ని మార్చుకోవాలని నిర్ణయించుకునేంతవరకు వినియోగించుకోవచ్చు. వారు సర్వీస్ ఏజెన్సీలకు ధృవీకరణ సందర్భంగా వేలిముద్రతో పాటు వర్చువల్ ఐడీని ఇవ్వాలి. దీని వలన వేర్వేరు ఏజెన్సీలకు ఆధార్ నంబర్లను సేకరించే పని తగ్గుతుంది.

యూఐడీఏఐ నిబంధనలకు లోబడి ధృవీకరణ చేపట్టే ఏజెన్సీలు ఆధార్ కార్డుదారుని తరఫున వర్చువల్ ఐడీని వెబ్‌సైట్ నుంచి పొందరాదు. ధృవీకరణ సందర్భంగా ఆధార్ కార్డుదారులు వారి ఆధార్ నంబర్‌కు బదులుగా 16 అంకెల వర్చువల్ ఐడీని ఇచ్చేలా చూడాలని అన్ని ఏజెన్సీలను యూఐడీఏఐ ఆదేశించింది. ఇప్పటివరకు 119 కోట్ల మంది ఆధార్ నంబర్ కలిగి ఉన్నారు.

ఆధార్ లేకుంటే భారతీయులు కారా?

నిరాశ్రయుల వ్యవహారంపై సుప్రీం వ్యాఖ్య



న్యూఢిల్లీ: పట్టణాల్లో ఇండ్లు లేనివారికి ఆధార్ కార్డులు ఎలా ఇస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు బుధవారం ప్రశ్నించింది. దేశ వ్యాప్తంగా పట్టణాల్లో ఇండ్లు లేనివారికి ఆవాసం సమకూర్చే అంశంపై విచారణ సందర్భంగా ఒక వ్యక్తికి ఇల్లు లేని పక్షంలో అతడ్ని ఆధార్ కార్డులో ఎలా ప్రస్తావిస్తారు అని ఉత్తరప్రదేశ్ సర్కారుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అదనపు సొలి సిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నిం చింది. అలాంటప్పుడు సదరు వ్యక్తులకు ఆధార్ ఉండదని మెహతా విన్నవించుకున్నారు. దానికి ఆధార్ లేని అలాంటి నిరాశ్రయులు భారతదేశంలో లేదా ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ హయాంలో ఉండరా, వారిని షెల్టర్ హోమ్‌లలో ఉంచరా అని ధర్మాసనం నిలదీసింది. ఆధార్ లేనివారు మనుగడలో లేరనడం సరికాదని, వారికి చిరునామాతో కూడిన వోటర్ ఐడీ లాంటి గుర్తింపు కార్డులు ఉంటాయని మెహతా వివరణ ఇచ్చారు. మేము ఒక మానవ సమస్యతో వ్యవహరిస్తున్నాము. దానికి(ఆధార్‌కు) శాశ్వత చిరునామా ఇస్తున్నాం. ఇండ్లు లేని వారు ఎప్పటికీ సంచార జనాభాగానే మిగిలిపోతారు అని ధర్మాసనానికి వివరించారు. అయితే ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశంలో 90 కోట్లమందికిపైగా ప్రజలకు ఆధార్ ఉందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

ఇస్రో నూతన చైర్మన్‌గా డాక్టర్ కె.శివన్

● 9వ సారధిగా నియామకం ● అంతరిక్షప్రయోగ రంగంలో అంచలంచెలుగా ఉన్నత శిఖరాలకు ● ఒకే రాకెట్‌లో 104 ఉపగ్రహాల ప్రయోగంలో కీలక పాత్ర



ప్రభ న్యూస్ బ్యూరో, నెల్లూరు : భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) నూతన చైర్మన్‌గా డాక్టర్ కె. శివన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇస్రో చైర్మన్‌గా సేవలందిస్తున్న ఏఎస్ కిరణ్‌కుమార్ మూడేళ్ల పదవీకాలం బుధవారంతో ముగిసింది. దీంతో ఆయన స్థానంలో విక్రమ సారాభాయి స్పేస్ సెంటర్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న కె. శివన్‌ను ఇస్రో నూతన చైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర అంతరిక్ష పరిశోధనా కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగనున్నారు. అంతరిక్ష ప్రయోగ రంగంలో ప్రపంచ దేశాలతో పోటీపడుతూ ఇప్పటికే ఆ రంగంలో అగ్రస్థానానికి చేరుకున్న ఇస్రోకు 9వ చైర్మన్‌గా నియమితులైన శివన్ 1982 నుంచి ఇస్రోకు సేవలందిస్తూ అంచెలంచెలుగా ఉన్నతస్థాయికి ఎదిగారు. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన ఆయన గత ఏడాది ఇస్రో ఒకే రాకెట్‌లో 104 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించిన ప్రతిష్టాత్మకమైన ఆ ప్రయోగం విజయవంతంలోనూ, తెరవెనుక ఈయన తనవంతు పాత్ర పోషించారు. మిషన్ రూపకల్పనలోనూ , రాకెట్ గమ్యాన్ని , సమయాన్ని నిర్దేశించడంలోనూ ఈయన దిట్ట. మద్రాసు యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీలో 1980లో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన శివన్ బెంగుళూరు ఐఐఎస్‌టీలో మాస్టర్ ఇంజనీరింగ్ అగ్రస్థానంలో ఉత్తీర్ణత సాధించారు. ఓ వైపు 1982 నుంచి ఇస్రోకు సేవలందిస్తూనే మరో వైపు అంతరిక్ష ప్రయోగాల్లో ఎప్పటికప్పుడు నైపుణ్యతను సాధించేందుకు ఆయన తనవంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే 2006లో ముంబాయి ఐఐటీలో పీహెచ్‌డీ కూడా పూర్తిచేశారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గతంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన డాక్టర్ ఆఫ్ సైన్స్ సత్యభామ యూనివర్శిటీ చెన్నై నుంచి డాక్టరేట్‌ను కూడా అందించింది.అలాకే 2014లో విక్రమ సారాభాయి అవార్డును కూడా ప్రకటించింది.

ఇస్రో చైర్మన్‌లు వీరే ..

1. విక్రమ సారాభాయి (1963 -1971)
2. ఎంజీకే (1971 -1972)
3. సతీష్‌ధావన్ (1972- 1984)
4. రామచంద్రన్ (1984-1994)
5. కస్తూరి రంగన్ (1994-2003)
6. జీ. మాధవన్ నాయర్ (2003-09)
7. కె. రాధాకృష్ణన్ (2009-2014)
8. ఏఎస్ కిరణ్‌కుమార్ (2014-2018)
9. డాక్టర్ కె. శివన్ ..

సివిల్స్ మెయిన్ ఫలితాల విడుదల

న్యూఢిల్లీ: సివిల్స్ మెయిన్ పరీక్షా ఫలితాలను యూపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. మెయిన్ పరీక్ష గత ఏడాది అక్టోబర్ 28 నుంచి నవంబర్ మూడవ తేదీ దాకా జరిగింది. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, తదితర సర్వీసుల్లో అధికారుల ఎం పిక కోసం యూపీఎస్సీ ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ దశల్లో సివిల్ సర్వీసెస్ పరీక్షలు నిర్వహిస్తుంది. మెయిన్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల రోల్ నంబర్లను కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు యూపీఎస్సీ ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే మొత్తం ఎంత మంది ఉత్తీర్ణులైనదీ వెల్లడిం చలేదు. ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరి 19న పర్సనాలిటీ టెస్ట్ లేదా ఇంటర్వ్యూ ఉంటుంది. అభ్యర్థులు ఇంటర్వ్యూ కోసం జనవరి 18వ తేదీ నుంచి యూపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి ఇ-సమ్మన్ లెటర్‌ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

బ్రిటన్ కేబినెట్‌లోకి నారాయణ మూర్తి అల్లుడు

రిషి సునక్‌కు హౌసింగ్, లోకల్ గవర్నమెంట్ మంత్రిత్వశాఖ



లండన్ : ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అల్లుడు రిషి సునక్‌ను ఉన్నత పదవి వరించింది. బ్రిటన్ పార్లమెంటు సభ్యుడిగా ఉన్న ఆయనకు థెరీసా మే కేబినెట్‌లో చోటు లభించింది. కన్జర్వేటివ్ ప్రభుత్వం సోమవారం చేపట్టిన మంత్రివర్గం, కార్యదర్శుల పునర్వ్యవస్థీకరణలో ఇద్దరు భారత సంతతి ఎంపీలకు మంత్రులుగా అవకాశం లభించింది. రిషితోపాటు సుయెల్ల ఫెర్నాండెజ్ ఉన్నారు. ఫెర్నాండెజ్ పూర్వీకులు గోవాకు చెందిన వారు. ఈ ఇద్దరు కూడా గతంలో బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఓటేసిన వారు కావడం విశేషం. బ్రెగ్జిట్ స్టీరింగ్ కమిటీలో ఫెర్నాండెజ్ సభ్యుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. దీంతో కేబినెట్‌లో భారత సంతతి మంత్రుల సంఖ్య మూడుకు చేరింది. రిషికి కీలక బాధ్యతలు అప్పగించిన విషయాన్ని మంగళవారం రాత్రి బ్రిటన్ ప్రధానమంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది. రిషికి హౌసింగ్, కమ్యూనిటీ, లోకల్ గవర్నమెంట్ మంత్రిత్వశాఖను కట్టబెట్టారు. ఈసారి కేబినెట్ ప్రక్షాళనలో మహిళలు, మైనార్టీ చట్టసభ్యులకు ప్రాధాన్యత ఇచ్చారు.

37 ఏళ్ల రిషి సునక్ 2014లో రాజకీయాల్లోకి వచ్చారు. యార్క్‌షైర్‌లోని రిచ్‌మడ్ నియోజకవర్గం నుంచి 2015, 2017 ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించారు. కిందటేడాది ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీల్లో చదువుకున్నారు. సునక్ తండ్రి వైద్యుడు కాగా, తల్లి ఫార్మసిస్ట్. డిగ్రీ పూర్తిచేసిన తర్వాత సునక్ లండన్‌లో వ్యాపారసంస్థను ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన ఓ సిలికాన్ వ్యాలీ కంపెనీలో సునక్ పెట్టుబడులు ఉన్నట్లు సమాచారం. స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూల్‌లో సహ విద్యార్థిని అయిన నారాయణ మూర్తి కుమార్తె అక్షతామూర్తిని ప్రేమించి పెళ్లిచేసుకున్నారు.

రేపే పీఎస్‌ఎల్‌వీ - 40 ప్రయోగం

నేడు కౌంట్‌డౌన్ ప్రారంభం



సూళ్లూరుపేట, ప్రభన్యూస్: సతీష్ ధవన్ స్పేష్ సెంటర్ (షార్) సెంటర్ రెండవ ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ -సీ40 ప్రయోగానికి సర్వం సిద్దం చేశారు. ఇందుకు సంబంధించి బుధవారం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాల్లో ఎంఆర్ఆర్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాకెట్‌కు సంబందించి నాలుగు దశలు అనుసంధానం పూర్తిచేసి తుది విడత పరీక్షలు నిర్వహించి ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డుకు అప్పగించారు. లాంచ్ ఆథరైజేషన్ బోర్డు చైర్మన్ కున్హికృష్ణన్ ఆధ్వ ర్యంలో మరో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రయోగానికి సంబంధించి గురువారం ఉదయం 5.25గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ కౌంట్‌డౌన్ ప్రక్రియ 28గంటలు జరుగనుంది. శుక్రవారం ఉదయం 9.28గంటలకు ప్రయోగం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ రాకెట్ ద్వారా కార్టొశాట్ -2ఈతో పాటు ఒక మైక్రోశాట్, ఒక నానోశాటిలైట్‌లను రోదసిలోకి పంపనున్నారు. వీటితో పాటు అమెరికా, కెనాడా, కొరియా, పిన్‌ల్యాండ్, యుకె దేశాలకు చెందిన 28 మైక్రో నానో శాటిలైట్‌లను రోదసిలోకి పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్దం చేశారు.


పాతికేళ్ల కిందటే బ్రిటన్‌లో జిహాద్!

● 1995లో సయీద్ ముస్లింలను ఉగ్రవాదం వైపు మళ్లించాడు
● అంతర్జాతీయ ఉగ్రవాది లండన్ పర్యటనపై బీబీసీ డాక్యుమెంటరీ




లండన్: లష్కర్ ఇతోయిబా ఉగ్రసంస్థ వ్యవస్థాపకుడు, 2008 ముంబై పేలుళ్ల సూత్రధారి హఫీజ్ సయీద్ చీకటి కోణం ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. 1990 దశకంలో బ్రిటన్ పర్యటనలో ఇతను జిహాద్‌కు పునాదులు వేశాడని బీబీసీ వెల్లడించింది. బ్రిటన్‌లోని ముస్లింలతో సమావేశాలు జరిపారని, జిహాద్ దిశగా వారిని ప్రేరేపించాడని తెలిపింది. 'ప్రస్తుతం పాక్‌లోని జమాత్ ఉద్ దవా గ్రూపునకు అధినేతగా ఉన్న, అంతర్జాతీయ ఉగ్రవాది హఫీజ్ సయీద్ 1995లో ఇక్కడకు వచ్చాడు. ఈ విషయాన్ని లష్కర్ ఇ తోయిబా పత్రిక ఒకటి ప్రచురించింది. బర్మింగ్‌హామ్ ప్రసంగంలో ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడు. హిందువులపై జిహాద్‌కు పిలుపునిచ్చాడు. లీసెస్టర్ పర్యటనలో 4000 మంది యువకులతో సమావేశం అయ్యాడు. కార్యక్రమ నిర్వాహకుల్లో ఒకరైన సాజిద్ ఇక్బాల్ స్కాట్‌లాండ్ బీబీసీకి ఈ విషయాన్ని వెల్లడించాడు' అని బీబీసీ రేడియో పేర్కొంది. ఈ మేరకు 'ద డాన్ ఆఫ్ బ్రిటీష్ జిహాద్' పేరుతో నాలుగు డాక్యుమెంటరీలను మంగళవారం ప్రసారంచేసింది. గ్లాస్కో లోని సెంట్రల్ మసీదు ప్రసంగంలో ముస్లింలను మరింత రెచ్చగొట్టాడు. ఇస్లామిక్‌లను హతమార్చేందుకు జియోనిస్టులు బిలియన్ డాలర్లు ఖర్చు చెస్తున్నారు. రాజకీయాధికారం కోసం ముస్లింలను ప్రలోభ పెట్టాలని చూస్తున్నారు. మనల్ని అప్పుల్లో ముంచేందుకు వడ్డీ ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నారు' అంటూ సయీద్ ప్రసంగించినట్లు బీబీసీ తెలిపింది. కాగా, సెంట్రల్ మసీద్ ఒక ఉగ్రవాదికి తలుపులు బార్లా తెరవడం తనను ఆశ్చర్యానికి గురిచేసింది. 2001లో హోంశాఖ లష్కరే తోయిబాను ఉగ్రసంస్థగా, హఫీజ్‌ను ఉగ్రవాదిగా ప్రకటించింది అని సాజిద్ ఇక్బాల్ చెప్పినట్లు బీబీసీ డాక్యుమెంటరీ స్పష్టంచేసింది.

ఈ ఏడాది నుంచే 2021 జన గణన



న్యూఢిల్లీ: యావత్ దేశంలో 130 కోట్ల మంది జనాభాకు వర్తించే 2012 జనగణన పనులు ఈ సంవత్సరం ప్రారంభమవుతాయని కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ బుధవారం తెలిపింది. హోమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఇక్కడ జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో 2021లో చేపట్టాల్సిన జనగణనకు అవసరమైన మార్గసూచీని చర్చించారు. 2021 జనగణనకు సంబంధించి 2018లో చేపట్టాల్సిన కార్యకలాపాల గురించి సమావేశం చర్చించిందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. చివరిసారిగా 2011లో జనగణన చేపట్టారు. 2011 భారత జన గణన నివేదికల ప్రకారం భారతదేశ జనాభా 1,21,08,54,977.

2020 ఎన్నికల్లో ఓర్పీ నాపై గెలవలేదు



వాషింగ్టన్ : అమెరికాలో 2020 ఎన్నికల వేడి ఇప్పటి నుండే ఊపందు కుంది. అమెరికా అధ్యక్ష కుర్చీ కోసం టెలివిజన్ సలహాదారు ఓర్పీ విన్‌ఫ్రీ వచ్చినా ఓటమే చవి చూస్తారని, ఆమెను అస్సలు గెలవనివ్వబోనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఎన్నికల్లో ఆమె నిల్చున్నా.. తానే సునాయసంగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. బీవర్లీహిల్స్‌లో నిర్వహించిన గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ప్రదానోత్సవంలో ఓర్పీ పాల్గొని ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ట్రంప్ పైవిధంగా ఆమెపై విమర్శలుగుప్పించారు. 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓర్పీ పోటీ చేయనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. 63 ఏళ్ల ఓర్పీ గోల్డెన్ గ్లోబ్ అవార్డు పొందిన మొదటి ఆఫ్రికన్-అమెరికా మహిళగా ఘనత సాధించారు.

సిక్కులకు వ్యతిరేకంగా జరిగిన అల్లర్లపై కొత్త సిట్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

దర్యాప్తులేకుండానే 186 కేసుల మూసివేతపై అసహనం



న్యూఢిల్లీ: 1984 సంవత్సరంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య అనంతరం సిక్కులకు వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లపై దర్యాప్తుకోసం కొత్తగా ముగ్గురు సభ్యులతో కూడిన సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం)ను ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు బుధవారం ప్రకటించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఆధ్వర్యంలోని జస్టిస్ ఎ.ఎం. ఖాన్‌విల్కర్, డివై. చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం తమ నిర్ణయాన్ని వెలువరిస్తూ... కొత్త సిట్‌లో సభ్యుల నియామకంకోసం పేర్లను సూచించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ సిట్ బృందానికి మాజీ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వం వహిస్తాడని, మిగతా ఇద్దరు సభ్యుల్లో ఒకరు డిఐజీ ర్యాంకుకు తక్కువకాని పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారి, మరొకరు సర్వీసులో ఉన్న పోలీస్ అధికారి ఉంటారని తెలిపింది. గతంలో ఈ అల్లర్లపై దర్యాప్తు చేసిన సిట్ మొత్తం కేసులను పూర్తిగా దర్యాప్తు చేయలేదని ధర్మాసనం పేర్కొంది. 1984లో చెలరేగిన అల్లర్లపై నమోదైన కేసుల వివరాలు, సిట్ పురోగతిపై గత ఏడాది ఆగస్టు 16న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జె.ఎం. పాంచల్, న్యాయమూర్తి కెఎస్‌పి రాధాకృష్ణన్‌లతో కూడిన ఒక సూపర్‌వైజరీ బాడీని నియమించి నివేదికను మూడు నెలల్లో సుప్రీంకోర్టుకు సమర్పించాలని కోరామన్నారు. ఈ సూపర్‌వైజరీ బాడీ బుధవారం తన నివేదికను సుప్రీంకోర్టుకు సీల్డ్ లెదర్ బ్యాగ్‌లో సమర్పించింది. అనంతరం, నివేదికను అధ్యయనం చేసిన ధర్మాసనం సిట్ దర్యాప్తును తప్పుపట్టింది. నమోదైన మొత్తం 241 కేసుల్లో 186 కేసులను ఎలాంటి దర్యాప్తు చేపట్టకుండానే సిట్ మూసివేసిందని సూపర్‌వైజరీ బాడీ గుర్తించిందని ధర్మాసనం వెల్లడించింది. కేంద్రం గతంలో ఈ అల్లర్లకు సంబంధించి సిట్ దర్యాప్తు చేసిన 250 కేసుల్లో 241 కేసులకు సంబంధించి క్లోజర్ నివేదికలను సమర్పించిందని వెల్లడించింది. తొమ్మిది కేసులను సిట్ ఇంకా దర్యాప్తు చేస్తున్నదని, మరో రెండు సిబిఐ దర్యాప్తు చేస్తున్నదని తెలిపింది. హోం మంత్రిత్వ శాఖ నియమించిన పాత సిట్ (బృందానికి 1986 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి ప్రమోద్ అస్థానా నేతృత్వం వహించగా, సభ్యులుగా పదవీ విరమణ చేసిన జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రాకేష్ కపూర్, అదనపు డిప్యూటీ కమిషనర్ ఢిల్లీ పోలీస్ కుమార్ గ్యాణేష్ ఉన్నారు) దర్యాప్తు జరిపి మూసివేయాలని నిర్ణయించిన 199 కేసులకు సంబంధించిన ఫైళ్లను ఈ ఏడాది మార్చి 24లోగా తమకు సమర్పించాలని కేంద్రాన్ని కోరింది. ఇందిరా గాంధీ హత్యానంతరం చెలరేగిన అల్లర్లలో ఒక్క ఢిల్లీలోనే 2,733 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ అల్లర్లపై సిక్ గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు ఎస్ గుర్‌లాద్ సింగ్ కహలాన్ సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు.

లోపాలు ఎత్తి చూపితే పెత్తనం అంటారేం?

కార్యనిర్వాహక వ్యవస్థపై సుప్రీం ధర్మాగ్రహం

న్యూఢిల్లీ: పాలనాయంత్రాంగంలో లోపాలను ఎత్తి చూపితే ప్రభుత్వాన్ని నడిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం ప్రయత్నిస్తోందంటూ విమర్శలు చేస్తారేం అని కార్యనిర్వాహక వ్యవస్థపై సుప్రీంకోర్టు ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేసింది.కార్యనిర్వాహక వ్యవస్థ తన బాధ్య తలను నిర్వర్తించకపోవడం వల్లనే సమస్యలు ఎదుర వుతున్నాయని జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దేశంలోని నగరాలు, పట్టణాల్లో ఇళ్ళు లేని వారికి ఆశ్రయం అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉత్తరప్రదేశ్‌లో దీనదయాళ్ అంత్యోదయ యోజన-నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్(ఎన్‌యుఎల్ ఎం) పథకం 2014 నుంచి అమలులో ఉంది.కానీ, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఈ పథకం అమలు విషయంలో చేసిందేమీ లేదని సుప్రీంకోర్టు బెంచ్ పేర్కొంది.ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తరపున వాదించిన అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతానుద్దేశించి ఈ అంశాన్ని మా నవీయకోణం నుంచి పరిశీలించాలని పేర్కొంది. ఎటు వంటి నీడ లేని వారికి సంబంధించింది ఈ కేసు. ఈ విషయంలో ప్రభుత్వం ముఖ్యంగా, కార్యనిర్వాహక వ్యవస్థ వెంటనే స్పందించాలి. అని బెంచ్ స్పష్టం చేసింది. పట్టణ ప్రాంతాల్లో గృహాల నిర్మాణం అంశం విషయంలో రాష్ట్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేయా లని సుప్రీంకోర్టు బెంచ్ సూచించింది.ఇళ్ళ నిర్మాణ కార్యక్రమాలు త్వరిత గతిన పూర్తి కావడానికి కేం ద్రం, రాష్ట్రా లతో సమన్వయంతో పని చేయాలని బెంచ్ సూచించింది. పిటిషనర్ తరపున వాదించిన సీని యర్ న్యాయవాది ప్రశాంత భూషణ్ ఉత్తర ప్రదేశ్‌లో లక్షా 80వేల మందికి ఆవాసాలు కల్పించాల్సి ఉండ గా, ప్రస్తుతం ఏడువేల మందికే వసతి లభిస్తోందని చెప్పారు.

దావోస్ వేదికగా ట్రంప్‌తో మోడీ భేటీ...!

వాషింగ్టన్ : ఈనెల 22న దావోస్‌లో జరిగే ప్రపం చ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరుకానున్నాడు. ఈ విషయాన్ని వైట్ హౌస్ అధికారిక వర్గాలు ప్రకటించాయి. అయితే భారత్ నుండి ప్రధాని మోడీ సైతం ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఇద్దరూ శిఖరాగ్ర సదస్సులో భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సదస్సుకు గత 18 ఏళ్లలో ఏ అమెరికా అధ్యక్షుడు కూడా హాజరుకాలేదు. ఈ సారి ట్రంప్ దీనికిహాజరై సరికొత్త రికార్డు సృష్టిస్తారని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ దేశాధినేతలతో అమెరికా ఎజెండాను ట్రంప్ ముందుకు తీసుకెళ్లనున్నట్టు సమాచారం. దీంతో భారత్‌తోనూ ట్రంప్ ద్వైపాక్షిక చర్చలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. దాదాపు రెండు దశాబ్దాల తరువాత కూడా భారత ప్రధాని మొదటిసారి వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌కు హాజరుకానున్నారు. 1997లో అప్పటి ప్రధాని దేవగౌడ ఈ సదస్సుకు వెళ్లారు. ఈసారి మొత్తం 100 మంది ప్రతినిధుల మోడీ టీం దావోస్‌కు వెళ్లనుంది. సహకరించినా.. తమ నుండి సహాయ సహకారాలు అందుతాయని స్టీవ్ స్పష్టం చేశారు.

2017లో 138 మంది పాక్ సైనికుల హతం

న్యూఢిల్లీ: 2017లో జమ్ము,కశ్మీర్‌లోని వాస్తావాధీన రేఖ(ఎల్‌ఓసి) వెంబడి చొరబాట్ల సమయంలో.. ఇతర వ్యూహాత్మక దాడుల్లో పాకిస్తాన్‌కు చెందిన 138 మంది సైనికులను హతమార్చామని ప్రభుత్వ ఇంటెలిజెన్స్ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఇదే సమయంలో భారత్ తన 28 మంది సైనికులను కోల్పోయిందని తెలిపాయి. తమవైపు చనిపోయిన సైనికుల వివరాలను పాక్ వెల్లడించదని... చనిపోయిన వారంతా సాధారణ పౌరులుగా చిత్రీకరిస్తుందని ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొన్నాయి. గత ఏడాదిగా జమ్ము కశ్మీర్‌లో భారతసైన్యం కాల్పుల విరమణ ఉల్లంఘనలను, ఉగ్రవాదుల కలాపాలను దీటుగా ఎదుర్కొంటున్నదని, సరిహద్దుల్లో పరస్పర కాల్పులసందర్భంగా పాక్‌కు చెందిన సైనికులు 138 మృతిచెంగా, 155 వరకు తీవ్రంగా గాయపడటమో లేదా చనిపోవడమో జరిగిందని ఇంటెలిజెన్స్ వర్గాలు చెప్పాయి.

గుల్బర్గ్ నరమేధం నిందితుడి అరెస్టు

అహ్మదాబాద్: 2002 నాటి గుల్బర్గ్ నరమేధం ఘటనలో నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. 16 ఏళ్ల తర్వాత అశిష్ పాండేను బుధవారం అహ్మదాబాద్‌లోని అస్లాలి ప్రాంతంలో క్రైంబ్రాంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆనాటి మారణహోమం కేసులో 24 మందిని దోషులుగా ప్రకటించిన ప్రత్యేక న్యాయస్థానం 11 మందికి జీవితఖైదు విధించింది. వీరిలో ఐదుగురు పరారీలోనే ఉండిపోయారు. ముస్లింలు ఎక్కువగా ఉండే గుల్బర్గ్ సొసైటీలో గుర్తుతెలియని దుండగుల మూక 69 మందిని హతమార్చింది. మృతుల్లో కాంగ్రెస్ మాజీ ఎంపీ ఎహసాన్ జాఫ్రి కూడా ఉన్నారు. గోద్రా అల్లర్ల అనంతరం చోటుచేసుకున్న దారుణ మారణకాండల్లో ఇదే అత్యంత విషాదకరమైంది.

ప్రజాప్రతినిధులకు బార్ కౌన్సిల్ నోటీసులు

న్యూఢిల్లీ: న్యాయవాదులుగా ప్రాక్టీసు చేస్తున్న ఎమ్మెల్యేలూ,ఎంపీలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) నోటీసులు జారీ చేసింది.ఈ నోటీసులకు వారం లోగా సమాధానమివ్వాలని కౌన్సిల్ ఆదేశించింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వోద్యోగులు న్యాయవాదులుగా ప్రాక్టీసు చేయకూడదనీ,తమకు అందిన పిటిషన్‌ను పురస్కరించుకుని నోటీసులు జారీ చేశామని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మానన్ కుమార్ మిశ్రా ఒక వార్తా సంస్థకు తెలిపారు. బీజేపీ ఢిల్లీ అధికార ప్రతినిధి అశ్వినీకుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌ని పురస్కరించుకుని ఈ నోటీసులు జారీ చేసినట్టు ఆయన చెప్పారు.

Andhraprabha business 2018
బిజినెస్ BUSINESS

మారుతి కార్ల ధరకు రెక్కలు
రూ.17,000 వరకు పెంపు

న్యూఢిల్లీ : మారుతి సుజుకి బుధవారం నాడు అన్నీ మోడల్స్ కార్లపై రూ.17వేల వరకు ధరలు పెంచేసింది. నిర్వహణా వ్యయం పెరిగిపోవడంతో ధరలు పెంచాల్సి వచ్చిందని బీఎస్ఈకి సమాచారం అందించింది. మోడల్‌ను బట్టి ధర రూ.1,700 నుంచి రూ.17,000 వరకు పెంచినట్లు వివరణ ఇచ్చింది. ముడి పదార్థాలు, పరిపాలన పరిమైన వ్యయం, డిస్ట్రిబ్యూషన్ ఖర్చులు పెరిగిపోయాయని తెలిపింది. ఆల్టో 800 సీసీ నుంచి ప్రీమియం క్రాస్‌వోవర్ ఎస్ క్రాస్ వరకు విక్రయిస్తోంది. వీటి ధర రూ.2.45 లక్షల నుంచి రూ.11.29 లక్షలు వరకు ఉంటాయి. ఇప్పటికే పలు కంపెనీలు ...టాటామోటార్స్ జనవరి 1 నుంచి 25వేలుపెంచేసింది. హ్యుందాయ్ మోటార్, హోండాకార్స్, మహీంద్రా అండ్ మహీంద్రాలు ఈ నెల నుంచి ధరలు పెంచుతామని ప్రకటించాయి. అయితే ఏ వాహనంపై ఎంత పెంచేది ఇప్పటి వరకు ప్రకటించలేదు.




100% ఎఫ్‌డీఐలకు ఓకే
ఇక విదేశీ పెట్టుబడుల వరద

● ఎఫ్‌డీఐ పాలసీ సవరణలకు కేబినెట్ ఆమోదం ● సులభతర వాణిజ్యం కోసమేనని ప్రకటన ● కీలక రంగాల్లో ఆటోమేటిక్ రూట్‌లో 100% ఎఫ్‌డీఐలు ● ఎయిరిండియాలో 49% విదేశీ పెట్టుబడులకు అనుమతి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : సులభతర వాణిజ్యానికి మరింత ప్రోత్సాహం ఇచ్చే దిశగా కేంద్రమంత్రి వర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. దేశంలోకి పెట్టుబడులు, ఆదాయం, ఉద్యోగ కల్పనను పెంచేందుకు విదేశీపెట్టుబడుల విధానాన్ని మరింత సరళీకరించింది. బుధవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్రమంత్రివర్గం పలు నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది. కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థ ఎయిరిండియాలో 49శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. సింగిల్ బ్రాండ్ రిటైల్ వర్తకంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నేరుగా ఆటోమేటిక్ రూట్‌లో వందశాతం విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. కీలకమైన రంగాలలో విదేశీ పెట్టుబడులకు ద్వారాలు బార్లా తెరిచింది. ఈమేరకు నూతన ఎఫ్‌డీఐ విధానానికి ఆమోదం తెలిపింది. దీంతో సింగిల్ బ్రాండ్ రిటైల్ వర్తకంలో వందశాతం విదేశీ పెట్టుబడులకు అవకాశం కలగనుంది. వీటితో పాటు నిర్మాణ రంగం అభివృద్ధి కోసం వందశాతం ఎఫ్‌డీఐలకు అనుమతించింది. ఎఫ్ఐఐ, ఎఫ్‌పీఐలు నేరుగా ప్రైమరీ మార్కెట్ల ద్వారా పవర్ ఎక్స్ఛేంజ్ చసే అవకాశాన్ని కల్పించింది. ఎఫ్ డీఐ విధానం లోని వైద్య పరికరాలు అన్న పదానికి నిర్వచనం మారుస్తూ... చేసిన సవరణకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది.విదేశీ పెట్టుబడుల విధానానానికి చేసిన పలు సవరణలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. పెట్టుబడుల నిబంధనలను సరళీకరించడంతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మరింత ప్రోత్సాహం లభించనుంది. విదేశీ పెట్టుబడులు భారీ స్థాయిలో దేశంలోకి వచ్చి ఆదాయం, ఉపాధికల్పన పెరగనుంది. ఫ్రెండ్లీ ఎఫ్‌డీఐ పాలసీ ద్వారా దేశ ఆర్థికరంగానికి మరింత ఊపు లభించనుంది. కీలకమైన రంగాలలో ఆటోమేటిక్ రూట్ ద్వారా వందశాతం ఎఫ్‌డీఐలకు అనుమతించంతో పెద్దఎత్తున పెట్టుబడులు రానున్నాయి. నిర్మాణరంగం, బీమా, పింఛన్లు, ఆర్థిక సేవలు, ప్రసారమాధ్యమాలు, పౌరవిమానయానం, ఫార్మాసూ టికల్స్, ఆస్తుల పునర్నిర్మాణ కంపెనీలు, తదితర రంగాల్లో ఎఫ్‌డీఐ సంస్కరణలతో భారీ మార్పులు రానున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగా 20141- 15లో 45.15 బిలియన్ డాలర్లు, 2015-16లో 55.46 బిలియన్ డాలర్లు, 2016-17 లో 60.08 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. కాగా యూపీఏ హయాం 2013- 14లో కేవలం 36.05 బిలియన్ డాలర్లు మాత్రమే వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీఐలను మరింత ఆకర్షించేందుకు నిబంధనలు మరింత సరళీకృతం చేస్తూ కేంద్రమంత్రివర్గం పలు నిర్ణయాలు తీసుకుంటోంది. తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ కంపెనీ మూసివేతకు ఆమోదం తెలుపుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరక ు కంపెనీ ఉద్యోగులకు బకాయిలు ఇప్పటికే చెల్లించిట్లు తెలిపింది. సంస్థ భూములను కర్నాటక ప్రభుత్వానికి అమ్మారు.



ఎయిరిండియాలో 49% విదేశీ పెట్టుబడులు



ప్రభుత్వ రంగ సంస్థ ఎయిరిండియాలో 49శాతం విదేశీ పెట్టుబడులకు కేంద్ర మంత్రివర్గం అనుమతించడం కీలక నిర్ణయమని మార్కెట్ నిపుణలు అభిప్రాయ ప డుతు న్నారు. ఈ నిర్ణయం ప్రపంచంలోని పెట్టుబడిదా రులకు ఓ సానుకూల సంకేతం పంపుతుం దని అంచనా వేస్తున్నారు. గత అనేక సంవత్సరాలుగా ఎయిరిండియా సంస్థ నష్టాల్లో కూరుకు పోయింది. ఈ నేపథ్యంలోనే ప్రభు త్వం ఎయిరిం డియాలో విదేశీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాంతో విదేశీ విమాన సంస్థలు ఎయిరిం డియాలో పెట్టుబడులు పెట్టే అవకాశాలున్నాయి. అయితే సింహభాగం 51శాతం ప్రభు త్వం వద్దనే ఉండనుండ డంతో, భారతీయ విమాన సంస్థగానే కొనసాగుతుంది.

2020 వరకు ఎంపీ ల్యాడ్స్ పథకం

ఎంపీ ల్యాడ్స్ పథకాన్ని 2020 వరకు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయిం చింది. 14వ ఆర్థిక సంఘం ముగిసే వరకు దీనిని కొనసాగించాలని నిర్ణయించారు. ప్రతి ఏడాదికి ఈ పథకం అమలుకు 3,950 కోట్ల రూపాయలను కేంద్రప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రానున్న మూడేళ్లకు ఇందుకోసం 11,850కోట్ల రూపా యలు ఖర్చు చేయనుంది. పథకంలో భాగంగా ప్రతి పార్లమెంటు సభ్యుడు తమ నియోజకవర్గంలో శాశ్వత పనులు చేసేందుకు నిధులు కేటాయిస్తారు. ప్రధానంగా ఈ పథకం కింద కమ్యూ నిటీ భవనాలు, తాగునీరు, ప్రజారోగ్యం, పారిశుధ్యం, రోడ్లు తదితర పనులకు నిధులను ఖర్చు చేస్తారు.

బజాజ్ డిస్కవరీ బైక్‌లు



న్యూఢిల్లీ : బజాజ్ ఆటో బుధవారం నాడు డిస్కవ రీ రేంజికి చెందిన రెండు కొత్త బైక్‌లను మార్కెట్లో విడుద ల చేసింది. డిస్కవరీ 110, డిస్కవరీ 125 మోడ ల్స్ ధరను రూ.50,496 నుంచి రూ.56,314 (ఎక్స్ షోరూం మహా రాష్ట్ర)గా ప్రకటిం చింది. ప్రీమియం సెగ్మెంట్ లో మంచి పట్టుసాధించ డానికి ఈ బైక్‌లను మార్కెట్‌కు పరిచయం చేసింది. డిస్కవరి 110 మోడల్ బైక్ పవర్ 115.5 సీసీ ఇంజిన్‌ను కలిగి ఉంటుంది ధర రూ.50,496 కాగా, డిస్కవరీ 125సీసీ .. 124.5 సీసీ పవర్ యూనిట్ ధర రూ. 43,491 కాగా డ్రమ్, డిస్క్ యూనిట్ ధర రూ.56,314గా నిర్నయించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త బైక్‌లను విడుదల చేసిన తర్వాత బజాజ్ ఆటో ప్రెసిడెంట్ (మోటార్‌సైకిల్) ఎరి క్ వాస్ మాట్లాడుతూ.. 100 సీసీ సెగ్మెంట్‌లో ప్లాటినా, కంఫోర్ట్‌టెక్ , సీటి 100 లో మార్కెట్లో మంచి పట్టు సాధించామని, ప్రస్తుతం డిస్కవరి 110,125 సీసీ సెగ్మెంట్‌లో ప్రీమియం అనుభూతిని కస్టమర్లు పొందుతారని అన్నారు. అత్యాధునిక టెక్నాలజీపై ఆసక్తి కలిగిన వారు బైక్‌లను ఇష్టపడతారని.. రెండు మోడల్స్ బైక్‌ల ఫీచర్ల విషయానికి వస్తే ఎల్ఈడీ, డే టైం రన్నింగ్ హెడ్ ల్యాంప్స్‌తో పాటు డిజిటల్ ఇన్స్ట్రుమెంట్, డిస్‌ప్లే ప్యానెల్ ఉంటాయని తెలిపారు.

డిసెంబర్‌లో జోరందుకున్న డిజిటల్ లావాదేవీలు
సుమారు వంద కోట్ల లావాదేవీలు

న్యూఢిల్లీ : డిజిటల్ లావాదేవీలు డిసెంబర్ నెలలో రికార్డు స్థాయిలో వందకోట్లు దాటిపోయాయని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో వెల్లడించిం ది. డిసెంబ ర్ 2017లో మొత్తం 1.06 బిలియన్ డిజిటల్ లావాదె వీలు జరగ్గా... నవంబర్ 2017లో మొత్తం 998 మలియన్ లావాదేవీ లు జరిగాయని సుమారు 6.5 శాతం వృద్ధి కనిపించిందని తెలిపింది. డిజిటల్ లావదేవీల విషయానికి వస్తే వివిధ రకాలల్లో చెల్లింపులు జరిగాయి. వాటిలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఇమ్మిడయేట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్) కార్డ్స్, ఆన్‌లైన్ వ్యాలెట్‌లున్నాయి. పక్కాగా చెప్పాలంటే నవంబర్‌తో పోల్చుకుంటే డిసెంబర్‌లో యూపీఐ ద్వారా 40శాతం లావాదేవీలు జరిగాయి. అలాగే ఐఎంపీఎస్ ద్వారా 10 శాతం లావాదేవీలు పెరిగి 98 మిలియన్ లావాదేవీలు డిసెంబర్‌లో జరగ్గా.. నవంబర్‌లో 89.5 మిలియన్ లావాదేవీలు జరిగినట్లు ఆర్‌బీఐ ఒక ప్రకటనలో వివరించింది. అలాగే స్మార్ట్‌ఫోన్ ద్వారా కూడా లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. దీంతో పాటు సంప్రదాయంగా జరిగే కార్డు లావాదేవీలు కూడా గతేడాది డిసెంబర్‌లో ఎనిమిది శాతం పెరిగి 564 మిలియన్‌లకు చేరగా.. అంతకు ముందు నవంబర్‌నెలలో 244.6 మిలయన్‌లుగా నమోదయ్యాయి.

మార్కెట్లను ఆకట్టుకోని ఎఫ్‌డీఐ
స్వల్పనష్టాలతో ముగిసిన మార్కెట్

ముంబై: కేంద్రప్రభుత్వం బుధవారం నాడు విదేశీ ప్రత్యక్షపెట్టుబడుల్లో పలు సంస్కరణలు తీసుకొచ్చింది. ఇవేవీ మదుపరులు పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. కార్పొరేట్ ఫలితాలు, బడ్జెట్‌పైనే మదుపరులు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. నష్టాల్లో కూరుకుపోయిన ఎయిర్‌ఇండియాలో విదేశీ ఎయిర్‌లైన్స్ 49 శాతం పెట్టుబడులకు అనుమతించింది. దీంతో పాటు సింగిల్‌బ్రాండ్ రిటైల్, నిర్మాణరంగం, పవర్ ఎక్స్ఛేంజీల్లో పెట్టుబడులకు అనుమతించింది. కాగా గురువారం నాడు ఐటి కంపెనీలు క్యూ3 ఫలితాలు ప్రకటించబోతున్నాయి. ముందుగా గురువారం టీసీఎస్, గురువారం ఇన్ఫోసిస్ ఫలితాలు వెల్లడిస్తుంది. మొత్తానికి బుధవారం సెన్సెక్స్ 10.12 పాయింట్లు క్షీణించి 34,433.07 వద్ద నిఫ్టీ 4.80 శాతం క్షీణించి 10,655.50 వద్ద ముగిసింది. కాగా మంగళవారం విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు రూ.303.94 కోట్ల షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.522.90 కోట్ల షేర్లు కొనుగోలు చేశారని స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. బీఎస్ఈలో నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్, ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, బజాజ్‌ఆటో, ఎస్‌బీఐ, టాటామోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, భారతి ఎయిర్‌టెల్, ఎల్‌అండ్‌టి, పవర్‌గ్రిడ్, ఐటీసీ, లిమిటెడ్; హీరోమోటో, ఎస్ బ్యాంకు, సన్‌ఫార్మా, కొటక్ బ్యాంకు, ఎంఅండ్ఎం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, టాటాస్టీల్, ఐసీఐసీఐ బ్యాంకులున్నాయి. దీనికి వ్యతిరేకంగా లాభాలను ఆర్జించిన షేర్లు టీసీఎస్, విప్రో, కోల్ ఇండియా, అదానీపోర్ట్స్, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఒఎన్‌జీసీ, హెచ్‌యూఎల్, రిల్‌లున్నాయి.

రూ.1,2,5 నాణెల ముద్రణ నిలిపివేత
ఆన్‌లైన్ చెల్లింపుల ప్రభావం



న్యూఢిల్లీ : కేంద్రప్రభుత్వం తాత్కాలికంగా రూ.1,2,5 నాణెల ముద్రణను నిలిపివేసింది. ఇప్పటికే దేశంలోని పలు మింట్‌లలో (టంకశాలల్లో) గుట్టలు గుట్టలుగా నిల్వలు పేరుకుపోయాయి. సెక్యూరిటి ప్రింటింగ్ అండ్ మింటింగ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పీఎంసీఐఎల్) మంగళవారం నాడు ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలోని మింట్‌లలో ఇప్పటికే 2.525 మిలియన్ నాణెలు నిల్వలు అలా పేరుకుపోయాయి. రిజర్వుబ్యాంకు (ఆర్‌బీఐ) వాటిని తీసుకుని చలామణిలో తీసుకురాకపో వడంతో మింట్‌లలో అవి అలా రాసులు రాసులుగా పోగయ్యాయి. ఆర్‌బీఐ ఎందుకు ఈ నాణెలను తీసుకోవడం లేదంటే గత 6-9 నెలల నుంచి ఆన్‌లైన్ చెల్లింపు వ్యవస్థ పెరిగిపోవడంతో ఈ నాణెలు తీసుకోవడం లేదు. పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రభుత్వం ఆన్‌లైన్ చెల్లింపులను పెద్దెత్తున ప్రోత్సహిస్తూ వస్తోంది. ఇప్పటికే భారీగా పేరుకుపోయిన నాణెల నేపథ్యంతో మింట్‌లలు కొత్త నాణెల ఉత్పత్తిని తక్షణమే నిలిపివేయాలని నిర్ణయించాయి. అయితే కొత్త నాణెల ఉత్పత్తి నిలిపివేయడం వల్ల మార్కెట్లో నాణెల కొరత ఏర్పడదు కానీ.. దీంతో పాటు దేశంలోని పలుమింట్‌లలో పనిచేస్తున్న సుమారు 3,000 మంది ఉద్యోగులపై కూడా ప్రభావం చూపుతుంది. దీనిపై ఇప్పటికే యూనియన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశాన్ని వారు తమ అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లారు. దేశంలోని మింట్‌లు లేదా టంకశాలలో రూ.1,2,5 నాణెలను ఏడాదికి 2.528 వందల కోట్ల నాణెల ముద్రించే సామర్థ్యం కలిగి ఉన్నాయి. కాగా ఈ ఏడాది దేశంలో 15.5 వందల కోట్ల నాణెల డిమాండ్ ఉండొవచ్చునని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది.

వృద్ధిరేటుకు ఊపు!

● జీడీపీ పెరుగుతుందని కితాబు ● 2018లో జీడీపీ7.3శాతం




వాషింగ్టన్ : భారత ఆర్థికవ్యవస్థకు ప్రపంచ బ్యాంకు మంచి కితాబిచ్చింది. మున్ముందు మంచి పురోగతి సాధ్యపడు తుందని వెల్లడించింది. దేశ ఆర్థిక పరిస్థితి అమోఘంగా ఉంటుందని ప్రశంసలు కురిపించింది. ఏడాది (2018) స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 7.3 శాతంగా, వచ్చే రెండు సంవత్సరాల్లో వృద్ధిరేటు 7.5 శాతంగా నమోదు కావచ్చునని ప్రపంచబ్యాంకు అంచనా వేసింది. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చుకుంటే భారత్‌కు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని, ప్రభుత్వం కొన్ని శక్తిమంతమైన సంస్కరణలు తీసుకోరావడమే దీనికంతకూ కారణమని పేర్కొంది. పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్టి) అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్థిక వ్యవస్థలో కొంత మేర వ్యతిరేక ప్రభావం కనిపించిందని.. అయినా 2017లో 6.7 శాతం వృద్ధిరేటును సాధించ గలిగిందని కితాబిచ్చింది. కాగా 2018 ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఎలా ఉంటుందో మంగళవారం నాడు విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోల్చుకుంటే వచ్చే దశాబ్ద కాలంలో భారత్ అగ్రస్థానంలోనిలుస్తుందని తేల్చి చెప్పింది. స్వల్పకాలానికి సంబంధించి గణాంకాలపై తాను దృష్టి పెట్టడం లేదని.. దీర్ఘకాలంలో భారత్ వృద్ధిరేటులో దూసుకుపోయే సత్తా కలిగి ఉందని ప్రపంచ బ్యాంకు డైరెక్టర్, డెవలెప్‌మెంట్ ప్రాస్పెక్టస్ గ్రూపు ఐయాన్ కోసే పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. చైనాతో పోల్చుకుంటే.. ప్రస్తుతం భారత్ వృద్ధిరేటు కాస్తా వెనుకబడింది. అయితే క్రమంగా వృద్ధిరేటులో చైనాను భారత్ మించిపోతుందన్నారు. గత మూడు సంవత్సరాల వృద్ధిరేటు చూస్తే పటిష్టంగానే ఉందని.. కోస్ చెప్పారు. ఈ ఏడాది 7.3 శాతం, వచ్చే రెండేళ్ల పాటు 7.5 శాతం దాటిపోతుందని ఆయన భరోసాను వ్యక్తం చేశారు.

చైనా వృద్ధిరేటు 2017లో 6.8 శాతం కాగా.. భారత్ కంటే 0.1 శాతం ఎక్కువ. కాగా ఈ ఏడాది చైనా వృద్ధిరేటు 6.4 శాతం, వచ్చే రెండేళ్ల పాటు వృద్ధిరేటు స్వల్పంగా తగ్గి 6.3 శాతం, 6.2 శాతానికి దిగివస్తుందన్నారు. అయితే వృద్ధిరేటు పుంజుకోవాలంటే ప్రభుత్వం పలు చర్యలకు శ్రీకారం చుట్టాల్సి ఉంటుందని సూచించింది. వాటిలో పెట్టుబడులకు పెద్దపీట వేయాలని, అలాగే బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండిబకాయిలపై దృష్టిపెట్టి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. విద్యతో పాటు కార్మకరంగంలో సంస్కరణలు తీసుకురావాలని.. విద్య, ఆరోగ్యరంగాల్లో సంస్కరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న అంశాలపై దృష్టి పెడితే భారత్ వృద్ధిరేటుకు తిరుగుండదని కోసే అన్నారు. భారత్‌కు బాగా కలిసొచ్చే అంశం ఏమిటంటే పెద్దమొత్తంలో ఉన్న జనాభా.. అన్నీ రంగాల్లో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఇతర అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో పోల్చుకుంటే భారత్‌లో మహిళా కార్మికులు చాలా తక్కువన్నారు. యువతలో నిరుద్యోగాన్ని తగ్గించడానికి ప్రైవేటు పెట్టుబడులను పెద్దెత్తున ఆకర్షించాలన్నారు. బ్యాంకుల్లో మొండిబకాయిలను గాడిలో పెడితే చాలా వరకు ఈ సమస్యను తీర్చినట్లేనని కోసే అన్నారు. మొత్తానికి భారత్‌కు వచ్చే పది సంవత్సరాల పాటు 7 శాతం కంటే ఎక్కువ వృద్ధిరేటును సాధించే సత్తా కలిగి ఉందన్నారు. ప్రభుత్వం జీఎస్టిని తీసుకురావడంపై ప్రత్యేక శ్రద్ధ చూపించిదని.. దీంతో పాటు బ్యాంకులకు మూలధనం సమకూర్చడం చాలా కీలకమన్నారు. భారత ప్రభుత్వం ఇప్పటికే ఏ ఏ రంగాల్లో ఇబ్బందులున్నాయో వాటిపై దృష్టి పెట్టిందన్నారు. త్వరలోనే దాని ఫలితాలు కనిపిస్తాయన్నారు. భారత్ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని.. వృద్ధిరేటు పెంచుకునే సత్తా కలిగి ఉందని.. అదేసమయంలో కొన్ని సవాళ్లను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. పెద్దనోట్ల రద్దు వల్ల తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులు తెలెత్తినా.. దీర్ఘకాలంలో వృద్ధిరేటు ఆరోగ్యకరమైన రీతిలో 7 శాతం కంటే ఎక్కువ సాధించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ప్రపంచబ్యాంకు నివేదికలో వివరించింది. ఈ ఆర్థిక సంవత్సరం 2017-18 జీడీపీ వృద్ధిరేటు 6.7శాతం... క్రితం ఏడాది వృద్ధిరేటు 7.1 శాతంతో పోల్చుకుంటే కాస్తా తగ్గే అవకాశాలున్నాయి. దీనికి ప్రధాన కారణం వస్తు సేవల పన్ను (జీఎస్టి)అమల్లోకి తేవడమేనని తెలిపింది. దీంతో పాటు బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న మొండిబకాయిలతో పాటు ప్రైవేట్ పెట్టుబడులు మందగించడం కూడా వృద్ధిరేటు తగ్గడానికి ప్రధాన కారణమని ప్రపంచబ్యాంకు తాజా నివేదికలో వివరించింది.


వృద్ధిరేటు 7.3 శాతం

● వచ్చే ఆర్థికసంవత్సరం ● హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అంచనా



ముంబై : వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19లో జీడీపీ వృద్ధిరేటు 7.3 శాతానికి చేరుతుందని, ఈ ఆర్థిక సంవత్సరం 6.3 శాతమేనని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అంచనా వేసింది. కేంద్రప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై దృష్టి పెట్టడంతో వినియోగం కూడా పెరిగి వృద్ధిరేటు పెంచుకోవడానికి అవకాశాలు మెరుగుపడతాయని బ్యాంకు ఆర్థికవేత్త ఒక నివేదికలోపేర్కొన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఈ ఆర్థికసంవత్సరం వృద్ధిరేటు 6.5 శాతంగా అంచనా వేసింది. ఆర్థిక నిపుణులు అంచనా కంటే ఇది చాలా తక్కువగా తేలింది. కాగా ప్రభుత్వం జీఎస్టి అమల్లోకి తేవడంతో పాటు నోట్ల రద్దు వల్ల దాని ప్రభావం వృద్ధి రేటుపై పడుతోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అంచనా ప్రకారం ఈ ఏడాది రుతుపవనాలు సాధారణ స్థాయిలో ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పుంజుకుంటుందని.. దీంతో పాటు ప్రభుత్వం వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తే అది కూడా కలిసొచ్చే అంశమని పేర్కొంది. ప్రభుత్వం ఏడవ వేతన కమిషన్ సిఫారసులను అమలు చేయడం కూడా వృద్ధిరేటుకు ఊతం ఇస్తుందని బ్యాంకు నివేదికలో వివరించింది. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలపై ఫోకస్ పెడుతోంది. ముఖ్యంగా మౌలికరంగం.. రోడ్లు, రైల్వేలు, చౌకరకం గృహాలపై దృష్టిపెడుతోంది కాబట్టి ఇవి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇచ్చేవేనని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నివేదికలో పేర్కొంది. జీఎస్టి అమల్లోకి రావడం.. దీని ఇబ్బందులు క్రమంగా సమసిపోవడంతో పాటు పెద్దనోట్ల రద్దు ప్రభావం కూడా ప్రస్తుతం పూర్తి మటుమాయం అయ్యింది కాబట్టి ఈ రెండు వృద్ధిరేటు పెంచుకోవడానికి దోహదం చేస్తాయి. వృద్ధిరేటు అడ్డంకిగా మారుతున్న అంశాల విషయానికి వస్తే క్రమంగా పెరుగుతున్న ముడిచమురు ధరలు, కరెంటు ఖాతాలోటుతో పాటు, ద్రవ్యలోటు రెండు వృద్ధిరేటుకు అడ్డంకిగా మారనున్నాయి. గ్లోబల్ వృద్ధిరేటు మందగించడంతో దాని ప్రభావం వినియోగంపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం మూడు శాతం కంటే తక్కువకు తీసుకురావాలనుకున్నా అయ్యే పనికాదని తేల్చి చెప్పింది. 3.2 శాతంగా ఉండవచ్చునని స్పష్టం చేసింది. అయితే కరెంటు ఖాతాలోటు మాత్రం 2.5శాతంగా నమోదు కావచ్చునని.. ఈ ఆర్థిక సంవత్సరం 1.5 శాతానికి పరిమితం కావచ్చునని అంచనా వేసింది. ద్రవ్యోల్బణం గురించి ప్రస్తావిస్తూ.. ధరలు పెరిగి 2018 సెప్టెంబర్ ఆరుశాతానికి చేరవచ్చేనని, అటు తర్వాత ఆర్థిక సంవత్సరం రెండవ సగభాగంలో తగ్గుముఖం పట్టవచ్చునని అంచనా వేసింది. వడ్డీరేట్ల గురించి ప్రస్తావిస్తూ.. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రెపో రేటు గురించి ప్రస్తావిస్తూ ఆర్‌బీఐ 0.25 శాతం పెంచవచ్చునని అంచనా వేసింది.

హ్యుందాయ్ కొత్త వెర్నా



న్యూఢిల్లీ : హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఐ ఎంఎల్) బుధవారం నాడు కొత్తగా రెండు వెరియెంట్ మిడ్‌సైజు ప్రీమియం సెడాన్ వెర్నాలను మార్కెట్లో విడుదల చేసింది. 1.4 లీటర్ పెట్రోల్ ఇంజిన్ ధర రూ.7.79 లక్షల నుంచి రూ.9.09 లక్షల వరకు (ఎక్స్ షోరూం ఢిల్లీ)గా ప్రకటించింది. గత ఏడాది ఆగస్టు లో హ్యుందాయ్ కొత్త జనరేష న్ వెర్నాను మార్కెట్లో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే మార్కెట్లో 1.6 లీటర్ పెట్రోల్, డిజిల్ పవర్‌ట్రెయిన్స్‌కు విక్రయిస్తోంది. కొత్తగా బుధవారం నాడు విడుదల చేసిన నెక్స్ట్‌జెన్ వెర్నా 1.4 లీటర్ కప్పా డ్యూయెల్ వీటివీటి ఇంజిన్ కలిగింది. ఇంధన సామర్థ్యం కాస్తా ఎక్కువగా ఇస్తుందని డ్రైవింగ్‌కు సౌకర్యవం తంగా ఉంటుందని కస్టమర్ల అంచనాలకు తగ్గట్లు కారును రూపుదిద్దామని హెచ్ఎంఐఎల్ డైరెక్టర్ సేల్స్, మార్కెటింగ్ రాకేశ్ శ్రీవాత్సవ ఒక ప్రకటనలో తెలిపారు. దేశీయ మార్కెట్లో వెర్నాకు మంచి ప్రజాదరణ ఉందని, దీన్ని మరింత బలోపేతం చేయడానికి కస్టమర్లకు విస్తృత స్థాయిలో అవకాశాలు ఇచ్చేందుకు కొత్త మోడల్స్‌ను అందు బాటులోకి తెచ్చినట్లు ఆయన వివరించారు. కొత్త వెర్నా పవర్ ఔట్‌పుట్ 100 పీఎస్ తో పాటు, మైలేజీ లీటర్ పెట్రోల్‌కు 19.1 కిలోమీటర్లు వస్తుందని ఆయన చెప్పారు. రెండు మోడల్స్‌ను ప్రస్తుతానికి అందుబాటులో ఉంచారు. ఒకటి ఈ, రెండోది ఈఎక్స్, రెండు ఆరు స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్‌లు కలిగినవే. కాగా 1.6 లీటర్ పెట్రోల్ ఇంజిన్ వెర్నా ధర రూ.9.68 లక్షల నుంచి రూ.12.48 లక్షలు, డిజిల్ వెర్నా 1.6 లీటర్ ఇంజిన్ కారు ధర రూ.9.42 లక్షల నుంచి రూ.12.87 లక్షల వరకు ఉంటుంది.

అసెంబ్లీ సీట్ల పెంపు తథ్యం?!



- 15న కేంద్రం కీలక నిర్ణయం
- కేబినెట్ నోట్ సిద్ధం
- ప్రాథమిక అధ్యయనం పూర్తి
- మార్గదర్శకాల రూపకల్పనకు సుప్రీం మాజీ జడ్జితో కమిటీ

అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్త నియోజక వర్గాల ఏర్పాటు అంశం మళ్లీ ఊపందుకున్నది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఈనెల 15న నియోజక వర్గాల పునర్విభజనపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఇప్పటికే పలు సూచనలు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అందాయి. నియోజక వర్గాల పునర్ విభజనకు సంబంధించి కేంద్ర క్యాబినెట్ ప్రత్యేక నోట్ను రూపొందించింది. అందులో భాగంగా హోంమంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, కేంద్రానికి అందజేయనుంది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. తెలుగు రాష్ట్రాల్లోని అసెంబ్లీ సెగ్మెంట్ల డీలిమిటేషన్పై ఇప్పటికే ప్రాథమికంగా అధ్యయనం చేశారు. సెక్రటేరియట్ సీనియర్ అధికారి ఒకరు ఈ అంశాన్ని కీలకంగా పరిశీలిస్తున్నారు. కొత్తగా ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గాల ఏర్పాటుతో పాటు గరిష్టంగా 225 అసెంబ్లీ నియోజకవర్గాలకు లోబడి చర్యలు తీసుకోవాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. రెండు లక్షల జనాభాను ప్రామాణికంగా తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొండలు, నదులను కారణంగా చూపి, ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గాన్ని విభజించరాదంటున్నారు. నియోజక వర్గాల పునర్ విభజనకు సంబంధించిన అధ్యయనం చేసి, నివేదిక రూపొందించేందుకు కేంద్రం మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటు చేయదల్చిన అసెంబ్లీ సెగ్మెంట్ల కోసం ఈ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీ ఆంధ్రప్రదేశ్లో విస్తృతంగా పర్యటించి,ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, నియోజక వర్గాల పునర్ విభజన కోసం అవసరమైన మార్గదర్శకాలను రూపొందించి కేంద్రానికి నివేదిస్తుంది. ఈ మార్గదర్శకాల తయారీ ప్రక్రియ ఫిబ్రవరి 2వ తేదీన కల్లా పూర్తవుతుందంటున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం తూర్పుగోదావరి జిల్లాలో కొత్తగా మూడు నుంచి నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పాటయ్యే అవకాశం ఉందంటున్నారు. అదే విధంగా గుంటూరులో రెండు,విజయవాడ నగరంలో రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

అయితే కొత్త నియోజక వర్గాలను ప్రకటించే ముందు కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో పర్యటించి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటుంది. ఇప్పటికే ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త నియోజకవర్గాల అవసరంపై కమిటీ ముందు ఉంచేందుకు అన్ని రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా ఈ విషయమై కేడర్తో చర్చించనున్నారు. కొత్త నియోజకవర్గాల ఏర్పాటుపై కమిటీకి వివరించాలని టీడీపీ పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి.

నాలా బిల్లు మళ్లీ వెనక్కి!

- రెండోసారి లోపాలు ఉన్నాయని గవర్నర్ నరసింహన్ అభ్యంతరం
- వివరణ ఇవ్వాలని అధికారులకు సీఎం ఆదేశం



అమరావతి, ఆంధ్రప్రభ: నాలా బిల్లుకు సంబంధించిన వ్యవహారం మలుపులు తిరుగుతోంది. గవర్నర్ వద్దకు చేరిన రెండోసారి కూడా బిల్లును వెనక్కి పంపడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మొదటిసారి తెలిపిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండానే రెండవసారి బిల్లును పంపారని పేర్కొంటూ గవర్నర్ నరసింహన్ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయడం విశేషం. ఇదివరకే తాను ఇచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని గవర్నర్ పేర్కొన్నారు. ఇదిలా వుండగా మొదటిసారి గవర్నర్ లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించిన రాష్ట్రప్రభుత్వం అనంతరం సంభవించిన పరిణామాల నేపథ్యంలో నాలా చట్టానికి సంబంధించి అసెంబ్లీలో ఆర్డినెన్స్ను ఆమోదించి గవర్నర్కు పంపడం జరిగింది. ఈసారి గవర్నర్ సానుకూలంగా స్పందిస్తారని ఆశించిన ప్రభుత్వానికి చుక్కెదురైంది. కాగా గవర్నర్కు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య లేఖల యుద్ధం జరుగుతోందంటూ వస్తున్న వార్తలను రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి ఒకరు ఖండించారు. గవర్నర్ అభ్యంతరాలకు వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆర్డినెన్స్ ఆమోదించి నాలా బిల్లును గవర్నర్కు పంపామని పేర్కొన్నారు. అయితే గవర్నర్ మాత్రం కొన్ని వివరణలను కోరుతున్నారని తెలిపారు. నాలా బిల్లును గవర్నర్ తిప్పి పంపారంటూ మీడియాలో వస్తున్న కథనాలు సరికాదని పేర్కొన్నారు. నరసింహన్ అడిగిన వాటికి వివరణ ఇస్తున్నామని, ఇంతటితో సమస్య కూడా తొలగిపోతుందని అన్నారు. ఇదిలా వుండగా గవర్నర్ లేఖ నేపథ్యంలో తగిన చర్యల నిమిత్తం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ మన్మోహన్సింగ్ను ఆదేశించారు. గవర్నర్ కోరి నట్లుగా వివరణ పంపాలని కోరారు. ఇదిలా వుండగా నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ కన్వర్షన్ (నాలా) చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలోనే ప్రవేశపెట్టిన బిల్లును ఉభయ సభలు ఆమోదించడం జరిగింది. అనేకతర్జన, భర్జనల అనంతరం ప్రభుత్వం నాలా చట్టంపై నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన వివిధ వర్గాల నుంచి పలు వాదనలు వినిపిస్తున్న నేపధ్యంలో బిల్లు చట్టరూపం దాల్చడం విశేషం. ఇదిలా ఉండగా తొలుత ఈ బిల్లును ఆర్డినెన్స్ రూపంలో తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించింది. ఒక ఆర్డినెన్స్ తయారుచేసి గత నవంబర్లోనే రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్కు పంపారు. దీనిపై గవర్నర్ అనేక సందేహాలు లేవనెత్తుతూ తిరిగిపంపారు. ఇదే సమయంలో ఆర్థిక శాఖ కూడా ఈ బిల్లుపై అనేక సందేహాలను వ్యక్తం చేసింది. ఫలితం గానే ఈ బిల్లును శాసనసభ ముందుకు రాగా ఆమోదించడం జరిగింది. భూమార్పిడి జరిగే సమయంలో సంబంధిత అర్జీదారు నాలా యాక్టు కింద భూమి ప్రభుత్వ విలువలో 10 శాతం మేర పన్ను కింద చెల్లించాల్సి ఉంది. దీని తరువాత సంబంధిత రెవెన్యూశాఖాధికారి అర్జీపై క్షేత్రస్థాయిలో విచారించి 60 రోజుల్లో అర్జీదారునికి సర్టిఫికెట్ జారీ చేయాల్సి వుంటుంది. ఈ విచారణలో సదరు భూమి ప్రభుత్వ భూమి కాదని తేల్చాల్సి ఉంది. కానీ, తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం అర్జీదారు మీ సేవలో దరఖాస్తు చేస్తే సరిపోతుంది. అదే విధంగా ప్రస్తుతం ఉన్న నాలా ఫీజు ప్రభుత్వ విలువలో 10 శాతం ఉన్న దానిని తగ్గించేశారు. ఇది ప్రభుత్వ ఆదాయానికి గండిపడే అంశమే అయినప్పటికి ప్రభుత్వం ముందుకు సాగింది. అలాగే అర్జీదారు కన్వర్షన్ కోసం దరఖాస్తుచేసిన భూమి ఈనాం, దేవాదాయ, ఇరిగేషన్, అసైన్డ్ భూమా అనే అంశాన్ని నిర్ధారించేఅవకాశం లేదు. మీ సేవలో దరఖాస్తు చేసిన వెంటనే తక్కువ ఫీజుతో ఏ భూమినైనా మార్పు చేసుకునే అవ కాశం ఉందా అనే ప్రశ్నలు తాజా పరిణామాలతో తలెత్తుతున్నాయి. ఇలా కన్వర్షన్ జరిగిన భూములు ప్రైవేటు భూములు కావని తేలినప్పుడు ఏమి చేయాలనే ప్రశ్నలు తలెత్తుతుండటం విశేషం. సాగు భూముల పరిరక్షణకు, సాగు భూములను సాగేతర అవసరాలకు మళ్ళించడాన్ని నియంత్రించేందుకు ప్రస్తుతం ఏపీ వ్యవసాయ భూమి (సాగేతర అవసరాలకు భూమి మళ్లింపు-నాలా) చట్టం - 2006 అమలులో ఉంది. వ్యవసాయ భూమిని సాగేతర అవసరాలకు మళ్లించే సమయంలో ప్రభుత్వానికి కొంత రుసుము చెల్లించాలి. అధికారిక గణాంకాల ప్రకారం రూ. 1800 కోట్ల బకాయిలు నాలా కింద ఇప్పటికే వసూలు కావల్సి ఉంది. నాలా చట్టం మేరకు భూమి వినియోగ మార్పిడికి సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) వద్ద దరఖాస్తు చేసుకోవాలి. రెవెన్యూ అధికారులు ఆ దరఖాస్తును పరిశీలించి, వినియోగ మార్పిడికి ఆ భూమి అనువైనదే అని నిర్ధారించి అనుమతిస్తారు. అయితే ఈ ప్రక్రియలో కొంత అవినీతిచోటుచేసుకుంటుదన్న విమర్శలున్నాయి. అవినీతిని నిర్మూలించి పక్కాగా నాలా ఫీజులు ఎలా వసూలు చేయాలన్న దానిపై రెవెన్యూ శాఖ దృష్టిపెట్టకుండా మొత్తం విధానాన్నే ఎత్తివేయాలన్న యోచన చేయడం వివాదాస్పదమయ్యే అవకాశం వుంది.

పోలవరం కాంగ్రెస్ మానసిక పుత్రిక



- సర్వాధికారాలు మాకే దక్కుతాయి
- దమ్ముంటే ఈ ఏడాది చివరికి పూర్తి చేసి చూపించాలి
- కేంద్రం, రాష్ట్రాలకు రఘువీరా సవాల్

ఏలూరు, ప్రభన్యూస్ ప్రతినిధి : దమ్ముంటే పోలవరం ప్రాజెక్టును ఈ ఏడాది చివరికి పూర్తిచేసి చూపించాలని పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి రాష్ట్రంలోని టిడిపి, కేంద్రంలోని బిజెపికి సవాల్ విసి రారు. బుధవారం పోలవరంలో జరిగిన రైతుసత్యాగ్రహ సభలో ఆయన ఆవేశపూరితంగా మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్పార్టీ మానసిక పుత్రిక అని, దీనిపై సర్వాధికారాలు కాంగ్రెస్కే దక్కుతాయ న్నారు. కాని తామేమి రాజకీయం చేయదల్చుకో లేదని రఘువీర స్పష్టం చేశారు. కేవలం పోలవరం ప్రాజెక్టును సకాలంలో సక్రమంగా నాణ్యతతో పూర్తి చేయించేందుకే కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వా లపై ఒత్తిడి తీసుకువచ్చేలా మాత్రమే తమ ఆందోళన ముఖ్యఉద్దేశ్యం అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నాడు ముఖ్యమంత్రిగా ఉన్న టి. అంజయ్య శంకు స్థాపన చేసింది మొదలుకొని నేడు జాతీయహెూదా ప్రకటన వరకు పోలవరం అంతా కాంగ్రెస్ సారధ్యం లోనే సాగిందని రఘువీరారెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రులుగా వైఎస్ రాజశేఖర్రెడ్డి, కిరణ్కుమార్రెడ్డి, రోశయ్యల హాయంలో సుమారు 5200 కోట్లు రూపాయిలు పోలవరం ప్రాజెక్టు కెనాల్, ఇతర పనులు జరిగాయని ఆయన గుర్తు చేశారు. దాదాపు 32శాతం పనులను కాంగ్రెస్ హయంలోనే పూర్తిచేసినట్లు తెలిపారు. సోమవారంను పోలవరంగా మార్చి తెగ గొప్పలు చెప్పుకుంటున్న సియం చంద్రబాబు వారం వారం ఇక్కడి వచ్చి ఏం చేస్తున్నారం టూ రఘువీరా ప్రశ్నించారు. వచ్చిన ప్రతిసారి చేసిన పనులకే మళ్ళీ మళ్ళీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, భూమి పూజలు చేస్తుండటం ఆయనకే చెల్లిందంటూ ఎద్దేవా చేశారు.

పెట్రేగిపోతున్న ఇసుక మాఫియా :

గోదావరి నదితీరం వెంట అధికార పార్టీకి చెందిన నేతలు, ప్రజాప్రతినిధులు కొందరు ఇసుకను అక్రమంగా తవ్వేస్తూ అక్రమార్జనలకు పాల్పడుతున్నారంటూ రఘువీరా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్లో గోదావరిలో ఇసుక తెన్నులనేవేకానరావని, పిల్లలకు మునుముందు ఇసుకఅనేది పాఠ్యాశరూపం లో మాత్రమే చెప్పుకోవల్సిన పరిస్థితులు తీసుకువస్తున్నారని ఆయన తీవ్ర అందోళన వెలుబుచ్చారు. పాదయాత్ర చేస్తు వస్తుండగా మార్గ మధ్యంలో తనకు వందలాది ఇసుకలోడు వాహనాలు కనిపించాయన్నారు.

2013 భూసేకరణ చట్టాన్ని సోనియానే తీసుకువచ్చారు :

నిర్వాసితులకు భూసేకరణ నష్టపరిహారాన్ని అందించేందుకు 2013లో నూతన భూసేకరణ నష్టపరిహార చట్టాన్ని సోనియా గాంధీ సారధ్యంలో యుపిఏ సర్కారు తీసుకు వచ్చిందని రఘువీర అన్నారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలో ముంపుకులోనవుతున్న తెలంగాణా ప్రాంతంలోని 7మండలాలను ఆంధ్రాలో కలిపేందుకు నాడే ప్రధాని మన్మోహన్సింగ్ సెక్షన్ 90 క్రింద ఎన్నో ప్రజా ఉపయోగమైన అంశాలను విభజన చట్టం అంశాలలో చేర్చేందుకు చర్యలు చేపట్టారన్నారు. తాము పోలవరం నిర్వాసితులకు పూర్తి న్యాయం జరిగేలా పార్లమెంటులోని ఉభయసభల్లో ఆంధ్రా రాష్ట్ర ప్రజల మనోభావాలకు అనుకూలంగా కాంగ్రెస్ ఎంపిలు గళమెత్తుతున్నారని రఘువీర చెప్పారు.

పోలవరంను ప్రారంభించేది కాంగ్రెస్ సారథ్యంలోనే :

పోలవరం ప్రాజెక్టును ప్రారంభించేంది కాంగ్రెస్ పార్టీ ప్రధానిగా రాహుల్గాంధీయేనని రఘువీరారెడ్డి జోస్యం పలికారు. 16వేల కోట్ల నుండి ప్రాజెక్టు వ్యయాన్ని 54వేల కోట్లకు పెంచేశారని ఆయన విమర్శించారు. ఇంకా పోలవరం పనులను పూర్తి చేయడానికి సుమారు 42వేల కోట్లు అవసరం అని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయన్నారు. ఫిబ్రవరిలో ఇచ్చే బడ్జెట్లో ఈకేటాయింపు లు మొత్తాన్ని తీసుకువచ్చి చంద్రబాబు, మోడీలు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ముందుకు రావాలని, లేకుంటే ప్రజలే కాలర్ పట్టు కొని నిలదీసే పరిస్థితులు ఎదురౌతాయని ఆయన హెచ్చరించారు.

పాదయాత్రగా మొదలై ప్రజా ఉద్యమంగా రూపాంతరం :

పాదయాత్రగా మొదలెట్టిన ఈయాత్ర ప్రజామోద ఉద్యమంగా రూపాంతరం చెందిందని రఘువీర విశ్లేషించారు. తామేమి పోలవరంకు వ్యతిరేకం కాదన్నారు. ఎంపి కెవిపి రామచంద్రరావు కేవలం పోలవరం ఖర్చును పూర్తిగా కేంద్రమే భరించాలని, రాష్ట్ర ప్రభుత్వం మీద ఏమాత్రం భారం పడనీయరాదని, జాతీయ హెూదా ప్రాజెక్టు అంశాన్ని మాత్రమే కోర్టులో వేసి ప్రస్తావించడం జరిగిందన్నారు. ఇదేమి పోలవరం ప్రాజెక్టు పనులను అడ్డగించేది కాదని ఆయన అన్నారు. కేవలం దుష్టప్రచారాన్ని అనుకూల మీడియాతో ప్రజానికాన్ని తప్పుత్రోవ పట్టించేందుకు పాలకపక్షాలు కుతంత్రాలు చేస్తున్నాయన్నారు. తాము 2019 ఎన్నికల కోసం కూడా ఆందోళన చేయ్యడం లేదన్నారు. కేవలం పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తిచేయించ డంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేందుకే ఆందోళనకు దిగుతున్నామన్నారు. సియం బాబు కాంగ్రెస్పై విమర్శలకు దిగడం ఆయన తన దిగజారుడు స్వభావాన్ని బయట పెట్టుకోవడమే అన్నారు.

చేతులు ఎత్తేసిన జగన్ :

పోలవరంపైన, జాతీయ హెూదాపైన ఉద్యమం చేస్తానన్న వైఎస్ఆర్సిపి అధినేత జగన్ చేతులెత్తేశారని రఘువీర ధ్వజం ఎత్తారు. ప్రస్తుతం ఆయన పాదయాత్రలు చేసుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులక ు అనుకూలం అన్నారు. రాయలసీమ, ఉత్తరకోస్తా, విశో పరిశ్రమలకు, డెల్టా స్థిరీకరణకు పోలవరం ఎంతో ఉపయోగం అన్నారు. రాష్ట్రంలో పలు ప్రాజెక్టు లను చేపట్టి పూర్తిచేసిన ఘనత కాంగ్రెస్కే దక్కుతుందన్నారు. ఈసభలో రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు, మాజీ కేంద్ర మంత్రులు యంయం పల్లంరాజు, జెడి శీలం, పనబాక లక్ష్మి, కిళ్ళి కృపారాణి, మాజీ ఎంపి కోట్ల విజయభాస్కర్రెడ్డి,, తులసీరెడ్డి, జెట్టి గురునాధరావు, కరాటం. రాంబాబు, తదితర నేతలు, పార్టీ దిగ్గజాలు పాల్గొన్నాయి.

కృష్ణా జలాల పంపకం

- ఏపీకి 60, తెలంగాణకు 50 టీఎంసీల కేటాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కృష్ణానదీయాజమాన్య బోర్డు సమావేశం బుధవారం జలసౌధలో జరగ్గా, ఇరు రాష్ట్రాలకు నీటి కేటాయింపులకు నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ 60, తెలంగాణ 50టిఎంసిలు వినియోగించుకోవాలని బోర్డు స్పష్టం చేసింది. బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సి మురళీధర్, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదలశాఖ ఈఎన్సి వెంకటేశ్వరరావు లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటివరకు వినియోగించుకున్న నీటితో పాటు భవిష్యత్ నీటి వినియోగంపైనా సమావేశంలో చర్చించా రు. ప్రస్తుతం కృష్ణానీటి లభ్యత 139టిఎంసిలుగా ఉండగా, ఆగస్టు వరకు వీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సి ఉందని బోర్డు సూచించింది. ప్రస్తుతం 110టిఎంసిలు మాత్రమే ఇరు రాష్ట్రాలు వాడుకునేలా కెఆర్ఎంబి ఆదేశాలి చ్చింది. మిగతా నీటిని పక్కనబెట్టింది. టెలిమెట్రీ, చిన్ననీటి వనరుల వినియోగం సహా ఇతర అంశాలపై ఇప్పటికే ఏర్పాటుచేసిన కమిటీలు ఇచ్చే నివేదికలకు అనుగుణంగా వ్యవహరించాలని బుధవారం జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయించారు.



అనంతను దత్తత తీసుకుంటా

- ఐటీ హబ్గా మారుస్తా
- 2019లో అధికారం మాదే: మంత్రి నారా లోకేష్

పెనుకొండ, ప్రభన్యూస్ : అనంతపురము జిల్లాను సస్యశ్యామలంగా మారు స్తామని, అనంతపురము జిల్లా అంటే మా తాత అయిన నందమూరి తారక రామారావుకు ఎంతో అభిమాని అందుకే అనంతపురము జిల్లాను పారిశ్రామికం గా, ఐటీ హబ్గా తీర్చిదిద్దుతానని, వచ్చే 2019 ఎన్నికలలో టిడిపి ఘన విజయం సాధిస్తుందని మంత్రి నారా లోకేష్ జోస్యం చెప్పారు. జన్మభూమి కార్యక్రమం లో భాగంగా ఆయన అనంతపురము జిల్లా పెనుకొండకు విచ్చేశారు. అనంతరం శెట్టిపల్లి బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పెట్రోల్ బంక్ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా రూపురేఖలు మారుస్తానన్నారు. త్వరలో అనంతపురం జిల్లాను దత్తత తీసుకుంటానని అన్ని రంగాలలో కూడా అనంతపురము జిల్లా నంబర్ వన్ స్థానం అభివృద్ధిలో వుండేటట్లు చూస్తానన్నారు. శాశ్వత త్రాగునీటి పరిష్కారానికి సంబంధించి పెనుకొండకు ఎటువంటి సమస్య లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులను రూ.5.02 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో అధికారుల చుట్టు ప్రజలు తిరిగేవారని అయితే ప్రస్తుతం ఇప్పుడు ప్రజల చుట్టు అధికారులు తిరుగుతున్నారన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించడానికి 1100కు తక్షణమే ఫోన్ చేసే సదుపాయాన్ని కల్పించిందన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు భారతదేశంలో ఎవరు చేయని విధంగా రుణమాఫీ చేసి న ఘనత ఆయనకే దక్కిందన్నారు. 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు పరిస్థితి తలకిందలుగా వుండేదని అయితే నారా చంద్రబాబు నాయుడు ఏ మాత్రం అదరకుండా బెదరకుండా ఇప్పుడు రాష్ట్రా న్ని అన్ని రంగాలలో కూడా ముందుకు తీసుకుపోతున్నారన్నారు. 2022 నాటికి రాష్ట్రంలో పేదరిక నిర్మూలన లేకుండా చేయడానికి చంద్రబాబు నాయుడు ఇప్పటికే 18 గంటలు పని చేస్తున్నారని 60ఏళ్ల వయసు దాటిన కూడా రాష్ట్రం కోసం ఆయన పడుతున్న తపన అంతా ఇంత కాదన్నారు. రాష్ట్రంలో 24వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత ఒక్క టిడిపికే దక్కిందని ఇందులో భాగంగా ఒక్క అనంతపురము జిల్లాలోనే రూ.2744 కోట్లు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. అయితే డ్వాక్రా మహిళలకు ఎన్ని కలలో ఇచ్చిన హామి ప్రకారం ఇప్పటికే రూ.6వేలు డిపాజిట్ చేశామని, తక్కినది త్వరలోనే డిపాజిట్ చేస్తామన్నారు. రూ.1000లు చొప్పున పెన్షన్ ఇస్తున్న ఘనత టిడిపికే దక్కుతుందని ఆయన పదే పదే ప్రసంగించారు. అదేవిధంగా ప్రపంచం లోనే అతి పెద్ద కార్ల కంపెనీ అయిన కియా కార్ల పరిశ్రమ జిల్లాకు తేవడంతో చంద్రబాబునాయుడి కృషి మరువలేని దన్నారు. దీని వలన ఎంతో మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని, అనంతపురము జిల్లా వాసులకే పెద్దపీఠ వేయడం జరుగుతుంద న్నారు. కంపెనీ ప్రారంభ సమయానికి 60వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఇక అదేవిధం గా రోడ్ల విషయానికి వస్తే రూ.14వేల కోట్లతో సీసీ రోడ్లను నిర్మించిన ఘనత టిడిపికే దక్కిందన్నారు. అయితే 300 కిలోమీటర్లు సీసీ రోడ్లు పెనుకొండ నియోజకవర్గంలోనే నిర్వహించామని అన్నారు. అంగన్వాడి కార్యకర్తలు ప్రస్తుతానికి 4262 పూర్తి స్థాయిలో భవనాలు ఖాళీగా వున్నాయని ప్రస్తుతం 62 భవనాలను పూర్తి చేస్తామన్నారు. ఫిబ్రవరి 2 నాటికి వీధిదీపాలు ఏర్పాటు చేస్తామన్నా రు. రూ.2వేల కోట్లు ఖర్చు పెడుతూవ్యక్తిగత మరుగుదొడ్ల కోసం రూ.3400 కోట్లు అనంతపురము జిల్లాలోనే ఇచ్చామ న్నారు. 2022 నాటికి యావత్ దేశంలోనే మూడవ స్థానంలో నిలబెడుతామని, 2050 ప్రపంచంలోనే నంబర్ వన్గా ఆంధ్రప్రదేశ్ను నిలుబెడుతామన్నారు. ప్రతి గ్రామానికి రెంటింగ్ నిర్వహిస్తున్నా మని, 12918 గ్రామాలకు పది రింటింగ్లకు గ్రామాలు నిర్వహిస్తున్నారు. 2019లో కూడా టిడిపి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. జిల్లాలో సాగునీటికి రూ.1930 కోట్ల నిధులు మంజూరు కాగా వాటిలో పెనుకొండ నియోజ కవర్గానికి రూ.260 కోట్లతో నిధులను మంజూరు చేస్తానని ఆయన పేర్కొన్నారు. పెనుకొండ నియోజక వర్గానికి రూ.70 కోట్ల నిధులు కేటాయించామన్నారు. పెనుకొండలో సిసి రోడ్లకు రూ.3 కోట్ల నిధులు కేటాయించామన్నా రు. అదేవిధంగా పెనుకొండ నియోజకవర్గంలో రొద్దం, సోమందేపల్లి, గోరంట్ల తదితర మండలాల లో సిసి రోడ్ల నిర్మాణం, తారు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైయ్యాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత, నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమా, ఎమ్మెల్యే బికె పార్థసారథి, ఎంపి నిమ్మల క్రిష్టప్ప, ఎమ్మెల్సీ తిప్పే స్వామి, మడకశిర ఎమ్మెల్యే ఈరన్న, ధర్మవరం ఎమ్మెల్యే సూరిలు,పెనుకొ ండ ఎమ్మెల్యే బికె పార్థసార థి, ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఇరన్న, ఎంపిపి యశోద కేశవయ్య, జెడ్పిటిసి నారాయ ణస్వామి, మహిళా నాయకురాలు సవితమ్మ, బక్సంపల్లి రామక్రిష్టప్ప, మాధవనాయుడు, త్రివేంద్ర, అడదాకులపల్లి ప్రసాద్, మావటూరు గోపాల్, సర్పంచ్ అశ్వర్థనారాయణ తదితర టిడిపి నాయకులు, జెడ్పిటిసి, ఎంపిపిలు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో 'పవర్' పొలి'ట్రిక్స్'

- విద్యుత్ చార్జీలు తగ్గిస్తామన్న ఏపీ సీఎం చంద్రబాబు
- సాగుకు నిరంతర విద్యుత్ ప్రకటించిన తెలంగాణా సీఎం చంద్రశేఖర్
- ఇరు రాష్ట్రాల విపక్షాల చేతుల్లోకి విద్యుత్ అస్త్రం
- ఉభయ రాష్ట్రాల్లో హాట్ టాపిక్గా విద్యుత్



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర విభజనకు ముందు తెలుగు రాష్ట్రాల్లో విద్యుత్కు ఎటుచూసినా కటకట ఏర్పడటంతో ఉభయ రాష్ట్రాల్లో చీకట్లు ముసురు కునేవి. నాలుగేళ్లలో విద్యుత్ రంగంలో చేపట్టిన సంస్కరణ వల్ల పరిస్థితి మారిపోయింది. రెండు రాష్ట్రాల్లో విద్యుత్ ఉత్పత్తులు పెరగడంతో ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేసే స్థాయికి ఎదిగాయి. దీంతో ఉభయ రాష్ట్రాల్లో పవర్ పాలిట్రిక్స్ మొదలయ్యాయి. ఒకప్పుడు ప్రతిపక్షాలకు పాశుపతాస్త్రంగా ఉండే విద్యుత్ నేడు తెలుగు రాష్ట్రాల అధికార పార్టీలకు అస్త్రంగా మారింది. విద్యుత్పై విద్యుత్ చార్జీలు, కరంటు కోతలపై ప్రతిసారీ పోరాటాలు చేసేందుకు ప్రతిపక్షాలకు అవకాశాలుగా ఉండేవి. కానీ అనూహ్యంగా ఈసారి అటు తెలంగాణా, ఇటు నవ్యాంధ్రలలో పరిస్థితి మారింది. వ్యవసాయానికి 24 గంటలూ కరెంటు ఇస్తామని తెలంగాణా సీఎం చంద్రశేఖర్ ప్రకటిస్తే, విద్యుత్ చార్జీలను భవిష్యత్లో పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూకుడు గా ముందుకు సాగుతున్నారు. జన్మభూమి-మా ఊరు కార్య క్రమాల్లో జరిగిన అన్ని సభల్లో విద్యుత్ అస్త్రాన్నే ప్రధానంగా సంధించారు. రైతులు, ప్రజల్లోనే కాకుండా విద్యుత్ ప్రస్తుత రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారింది. ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ ప్రభుత్వం విద్యుత్ విషయంలో అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. రాష్ట్ర అవసరాలకుపో ను ఇతర రాష్ట్రాలకు అమ్మేస్థితికి విద్యుత్ రంగం చేరుకోవడం తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మభూమి సభల్లో ప్రతిచోట విద్యుత్ చార్జీలు పెంచే ప్రశ్నేలేదని, అవసరమైతే తగ్గిస్తామని పదేపదే చెబుతున్నారు. దూరదృష్టితో ఆలోచించి తాను1999లో తీసుకున్న విద్యుత్ సంస్కరణలే ఇప్పుడు ఫలితాలిస్తున్నాయని సీఎం చంద్రబాబు అంటున్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యుత్ సంస్కరణలకు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఉత్పత్తిని పెంచేందుకు అసాధారణ నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. అదే అప్పట్లో ప్రతిపక్షాలకు ప్రధాన అస్త్రంగా మారింది. ప్రతిపక్షాలు అప్పట్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయగా చంద్రబాబుపై వ్యతిరేకత పెరగడానికి కారణమయ్యాయి. ఈ రంగంలో తీసుకున్న సంస్కరణల కారణంగా అధికారాన్ని కోల్పోవలసి వచ్చిందని కూడా ముఖ్యమంత్రి చెప్పడం జరిగింది. ఐతే ఈ సారి విద్యుత్ విషయంలో ప్రతిపక్షాలకు చంద్రబాబు ఎలాంటి అవకాశమివ్వడంలేదు. గతంలో మాదిరిగానే రెండవ విద్యుత్ రంగ సంస్కరణలు కూడా తీసుకురానున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. విద్యుత్ చార్జీలు పెంచమని దేశంలోనే స్పష్టంగా ప్రకటించిన ఏకైక ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమని సీఎం చంద్రబాబు గర్వంగా చెప్పుకోవడం విశేషం. విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి సాధించడంతోపాటు భవిష్యత్ అవసరాల కోసం దూరదృష్టితో సీఎం చంద్రబాబు నూతన ప్రాజెక్ట్లను రాష్ట్రంలో ప్రారంభించారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఆకర్షించేందుకు నిరంతర విద్యుత్ విధానాన్ని ప్రధాన అంశంగా సీఎం ఉపయోగించు కుంటున్నారు. మండు వేసవిలో కూడా ఎక్కడా విద్యుత్ కోత లేకపోవడంతో విద్యుత్ విషయంలో ప్రజల నుంచి ప్రభుత్వం ఆశించిన సంతృప్తిస్థాయి లభించిందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం మూడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని విపక్షనేత జగన్మోహన్రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించడం ఈ సందర్భంగా గమనార్హం. ఈ ఏడాది ప్రారంభం నుంచి తెలంగాణా ప్రభు త్వం రైతాంగానికి కరెంటు 24 గంటలూ అందుబాటు లోకి తెచ్చింది. గతంలో అర్ధరాత్రి అపరాత్రి అని లేకుండా పొలాలకు రైతులు కరెంటు కోసం ఎదురు చూస్తూ పొలం గట్లపైనే పడిగాపులు కాయాల్సి వచ్చేది. కళ్ల ముందే పంటలు ఎండిపోతున్నా, బోర్లలో నీరు నిండుగా ఉన్నా విద్యుత్ లేక మోటార్లు తిరగని రోజులెన్నో.. ఉక్కపోత అంటూ అల్లాడుతూ కరంటు రాక కోసం జనం కళ్లు కాయలు కాసేలా చీకటి రోజులు ఉన్నాయి.. ప్రస్తుతం ఆ చీకట్లు, ఎదురు చూపులు పోయాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మిగులు వెలుగుల పూలు పూస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణా రాష్ట్రంలో పంటలకు ఎంతమేర ఎప్పుడు అవసరమో అప్పుడు నీరు పెట్టకునేందుకు విద్యుత్ సరఫరా 24 గంటలూ ఉంటుంది. ఈ నిర్ణయం రాజకీయంగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. సాగుకు నిరంతర విద్యుత్ వలన అన్నదాతల్లో సానుకూలత ఏర్పడింది. తెలంగాణాలో వ్యవసాయ రంగం అధికంగా బోర్లపైనే ఆధారపడి ఉంది. వరికి కూడా పగటిపూట విద్యుత్ సరఫరా అందిస్తుంది. ఐతే ఈ క్రెడిట్లో తాము కూడా లబ్ది పొందేందుకు విపక్షాలు సైతం ప్రయత్నాలు సాగించడం విశేషం. తెలంగాణా ఆవిర్భావానికి ముందు పదేళ్లపాటు అధికారంలోఉన్న కాంగ్రెస్పార్టీ చేపట్టిన సంస్కరణలు, విద్యుత్ ప్రాజెక్ట్ వల్లే కేసీఆర్ నేడు సాగుకు నిరంతర విద్యుత్ ఇస్తున్నారని ఆ పార్టీ నాయకులు చెప్పుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ కృషి వల్లే తెలంగాణాలో నిరంతర విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయని బీజేపీ కూడా చెప్పుకోవడం విశేషం. తెలంగాణాలో గత ప్రభుత్వాలు ఎంత కృషి చేసినా, అమలు చేసింది టీఆర్ఎస్ ప్రభుత్వం కావడంతో క్రెడిట్ సీఎం కేసీఆర్కే దక్కిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో విద్యుత్ పరిస్థితి తారుమారు కావడంతో విపక్షాలు ప్రభుత్వాలను ఇరుకున పెట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. మొత్తానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో విద్యుత్ అంశం అధికార పార్టీలకు అందివచ్చిన అవకాశంగా మారింది. రానున్న ఎన్నికల్లో విద్యుత్ అంశం తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కు ఏమాత్రం న్యాయం చేస్తుందో వేచిచూడాలి.

మాపై ఎందుకీ వివక్ష!

- స్టైఫండరీల కానిస్టేబుళ్ల ఆవేదన
- ఎస్ఐలదీ అదే దారి
- హోంగార్డుల్లోనూ అసంతృప్తి

అమరావతి, ఆంధ్రప్రభ: పొరుగు రాష్ట్రంతో పోల్చితే వేతన వ్యత్యాసంపై స్టైఫండరీ ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే శాఖలో పని చేసేందుకు ఎంపికైన తమ విషయంలో నిధుల లేమి పేరిట ఏపీ ప్రభుత్వం వివక్ష చూపుతుందనేది వీరి అభిప్రాయం. ప్రభుత్వ ఉద్యోగులకు అడిగినంత ఫిట్‌నెస్ ఇస్తున్న ప్రభుత్వం..తమ విషయంలో చాలీచాలని వేతనం అందజేస్తున్నట్లు వీరు చెపుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత గతేడాది రెండు రాష్ట్రాల్లోను భారీగా పోలీసు శాఖలో రిక్రూట్‌మెంట్లు జరిగాయి. తెలంగాణాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా పోలీసు శాఖలో ప్రభుత్వం ఖాళీలను పూరించింది. ఏపీలో 5600 పోస్టులకు రిక్రూట్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేసి శిక్షణ ఇస్తున్నారు. రిక్రూట్ చేసిన వారిలో 4834 పోలీసు కానిస్టేబుళ్లు ఉండగా, 766 మంది ఎస్ఐలు ఉన్నారు. అనంతపురం, విజయనగరం పోలీసు శిక్షణ కేంద్రంలో వీరు శిక్షణ పొందుతున్నారు. ఈ ఏడాది మార్చితో వీరు శిక్షణ పూర్తి చేసుకొని ఏప్రిల్ నుంచి విధుల్లోకి రానున్నట్లు అధికారులు చెపుతున్నారు. మరికొద్ది రోజుల్లో శిక్షణ పూర్తి చేసుకోనున్న వీరు తమకు అందించే స్టైఫండ్ విషయంలో అసంతృప్తిగా ఉన్నారు. తెలంగాణా రాష్ట్రంలో రూ.6వేలకు పైబడి ట్రైనీ కానిస్టేబుళ్లకు స్టైఫండ్ ఇస్తుండగా, ఏపీలో రూ. నాలుగు వేల వరకు ఇస్తున్నారు. ఇదే సబ్ ఇన్‌స్పెక్టర్ల విషయానికి వస్తే తెలంగాణాలో రూ.11వేలు ఇస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో రూ.7500 ఇస్తున్నారు. ఒకే శాఖలో పని చేసేందుకు ఎంపికైన తమ విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో వ్యత్యాసం ఉండటమేంటని వీరంటున్నారు. అదేమంటే బడ్జెట్‌ను సాకుగా చూపుతున్నారని వీరంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అడిగినట్లుగానే రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు 43శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన విషయాన్ని వీరు గుర్తు చేస్తున్నారు. నిజంగా నిధుల సమస్య ఉంటే ప్రభుత్వ ఉద్యోగులకు ఫిట్‌మెంట్ అంతగా పెంచాల్సిన అవసరం ఏమెచ్చిందంటున్నారు. పైగా తెలంగాణాతో పోల్చితే ఇక్కడ పోలీసులపై పని భారం కూడా ఎక్కువేనని చెపుతున్నారు. తెలంగాణాలో ఎంపికైన పోలీసులు, ఎస్ఐలు కేవలం పోలీసు విధులు మాత్రమే నిర్వహిస్తుంటారని వీరంటున్నారు. ఇదే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలీసు విధులతో పాటు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడం, గంజాయి సాగు, రవాణాను అరికట్టడం చేయాల్సి ఉంటుంది. ఇవేకాక ఆంధ్రప్రదేశ్‌లోని శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం తరలిపోకుండా చూసే బాధ్యత కూడా తమ పైనే ఉందని పోలీసులు అంటున్నారు. ఇటీవల ఎక్సైజు శాఖ వైఫల్యం చెందిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపులు నిలువరించే బాధ్యతను కూడా పోలీసు శాఖకు ప్రభుత్వం అప్పగించింది. తమ విధులతో పాటు అనేక రకాల విధులు నిర్వహించాల్సిన పోలీసు శాఖ విషయంలో ప్రభుత్వం 'సవతి తల్లి ప్రేమ' చూపిస్తుందనేది పోలీసు శాఖలో వినిపిస్తున్న ఆవేదన. ఇప్పటికైనా స్టైఫండరీ పోలీసులు, ఎస్ఐలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

హోంగార్డుల్లోనూ ఇదే తీరు

ఆంధ్రప్రదేశ్‌లోని హోంగార్డులు కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏపీలో హోంగార్డులకు రోజుకు రూ.400 ఇస్తున్నారు. అత్యవసర పనిమీద, అనారోగ్య సమస్యలతో విధులకు గైర్హాజరైతే ఆరోజు వేతనం ఇవ్వరని చెపుతున్నారు. ఇదే తెలంగాణా రాష్ట్రంలో తమ సహచర హోంగార్డులకు మాత్రం నెలకు రూ.20వేలు ఇస్తున్నారంటున్నారు. పైగా వారికి వారాంతపు సెలవులతో పాటు అదనపు విధులు నిర్వహిస్తు భోజన సదుపాయం కూడా కలిపిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తమ విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలనేది హోంగార్డుల కోరిక.

ఏసీబీ వలలో ఎస్వీయూ తిమింగలం



రుద్రకుమార్

- అసిస్టెంట్ ఇంజనీర్ రుద్రకుమార్ అరెస్టు
- రూ.50 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు
- కొనసాగుతున్న సోదాలు



సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

తిరుపతి రూరల్, ప్రభ న్యూస్: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్(డ్రాఫ్ట్ మ్యాన్) గా పనిచేస్తున్న ఎన్. రుద్రకుమార్ ఇంటిపై బుధవారం అవినీతి నిరోధకశాఖ దాడులు నిర్వహించింది. డీఎస్పీ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు రుద్రకుమార్ ఇంటితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సోదరి, సోదరుల ఇళ్లు, నెల్లూరు నగరంలోని మరో సోదరుడి ఇంటిలో ఏక కాలంలో దాడులు నిర్వహించారు. అనంతరం రుద్రకుమార్‌ను అరెస్టు చేశారు. ఏసీబీ డీఎస్పీ శంకర్‌రెడ్డి కథనం మేరకు.. రుద్రకుమార్ అక్రమాస్తులపై తమకు ఫిర్యాదులు అందాయని గత కొంతకాలంగా నిఘావుంచి ఏకకాలంలో దాడులు చేపట్టామన్నారు. బుధవారం ఉదయం వేకువజామునుంచి డీఎస్పీ సహా నలుగురు సీఐలతో కలిసి ఏసీబీ సిబ్బంది సోదాలు నిర్వహించగా సాయంత్రం వరకు దాదాపు రూ. 50 కోట్లకు పైగా ఆస్తులను గుర్తించారు. ఇందులో ఆయన భార్య పేరుతో నగరంలో 10 ప్లాట్లు, పుత్తూరులో రూ. 4.20 కోట్ల విలువగల ప్లాట్ కొనుగోలుకు సంబంధించి దస్త్రాలు లభించాయి. వీటితో పాటు నగరంలో రెండు భవనాలు, మరో మూడు తాత్కాలిక ఇళ్లు గుర్తించారు. ఇంట్లో 1.5 లక్షల నగదు, అర కిలో బంగారం, 3 కేజీల వెండి లభించాయి. 2 కార్లతో పాటు రూ. 8 లక్షల బ్యాంకు ఖాతాల్లో ఉన్నట్లు రూ. 11 లక్షల ఎల్ఐసీ ప్రీమియం పాలసీలు, రూ. 5 లక్షలకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. నగరంలోని వివిధ బ్యాంకుల్లో ఉన్న నాలుగు లాకర్లను గురువారం తెరవనున్నట్లు వెల్లడించారు. లాకర్‌లతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన సోదాల్లో వెలుగు చూసిన అంశాలను పరిగణనలోకి తీసుకొని మొత్తం ఆస్తుల వివరాలను వెల్లడిస్తామని ఆయన తెలిపా రు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు చంద్రశేఖర్, గిరిధర్, ప్రసాద్‌రెడ్డి, విజయ్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు పండుగ అడ్వాన్స్

- రూ.25 కోట్లు విడుదల
- 45 వేల మంది కార్మికులకు లబ్ధి: విలేకరుల సమావేశంలో ఎన్ఎంయూ కార్యదర్శి చంద్రయ్య



అమరావతి, ఆంధ్రప్రభ: ఎట్టకేలకు ఏపీఎస్ ఆర్టీసీ గుర్తింపు సంఘం నేషనల్ మజ్దూర్ యూనియన్ కృషి ఫలించించి, సత్ఫలితాలను ఇచ్చింది. ఎన్ఎంయుతో గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రభుత్వం బుధవారం కార్మికులకు పండుగ అడ్వాన్సులను విడుదల చేసింది. సుమారు రూ.25 కోట్ల రూపాయల సంక్రాంతి పండుగ అడ్వాన్సులను ప్రభుత్వం హిందూ కార్మికులకు విడుదల చేయడం తాము సాధించిన మరో విజయమని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య పేర్కొన్నారు. బుధవారం ఆర్టీసీ బస్సు ప్రాంగణంలోని యూనియన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పండుగ అడ్వాన్సులు గురించి ఎన్ఎంయు గతంలో ప్రభుత్వంతో పలు విడతలుగా చర్చలు జరిపిందన్నారు. ఆమేరకు ఆర్టీసీ యాజమాన్యంతో కుదిరిన ఒప్పందం మేరకు ప్రభుత్వం బుధవారం కార్మికులకు పండుగ అడ్వాన్సులను విడుదల చేసిందన్నారు. ఈ అమౌంట్‌ను కార్మికుల ఖాతాలకు నేరుగా జమ చేసేలా ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకుందని వివరించారు. క్రిస్టియన్‌లకు, ముస్లింలకు, హిందువులకు వేర్వేరుగా ఆర్టీసీ యాజమాన్యం పండుగ అడ్వాన్సులను విడుదల చేసిందన్నారు.రంజాన్ సందర్భంగా ముస్లింలకు గతంలోనే పండుగ అడ్వాన్సును ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా క్రిస్టియన్ కార్మికులకు కూడా క్రిస్మస్ సందర్భంగా పండుగ అడ్వాన్సులను ఇవ్వడం జరిగిందన్నారు.తాజాగా హిందువుగా ఉన్న ప్రతి కార్మికుడికి సంక్రాంతి పండగను పురస్కరించుకుని, ముందస్తు అడ్వాన్సులను విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. కేటగిరి వారిగా ఈ అడ్వాన్సులను ఇచ్చారన్నారు. క్లాస్ త్రీ కార్మికులకు రూ. 4,500, క్లాస్ 4 కేటగిరి కార్మికులకు రూ. 4000 చొప్పున విడుదల చేయడం జరిగిందన్నారు. అయితే ఆఫీసర్లకు,సూపర్‌వైజర్లకు పండుగ అడ్వాన్సులు ఇవ్వలేదన్నారు.నిబంధనల మేరకు వారిని మినహాయించడం జరిగిందన్నారు.ఈ పండుగ అడ్వాన్సులను 10 నెలల కాలంలో జీతం నుంచి మినహాయించుకుంటారని చెప్పారు. క్లాస్ త్రీ వారికి రూ. 450, క్లాస్ 4 వారికి రూ. 400 చొప్పున జీతం నుంచి మినహాయించుకోవడం జరుగుతుందని అన్నారు. సంక్రాంతి పండుగ అడ్వాన్సులు వల్ల దాదాపు 45వేల హిందూ కార్మికులకు లబ్ది చేకూరిందన్నారు. సంస్థలోని 128 డిపోల్లో సుమారు 55,500 కార్మికులు పని చేస్తున్నారని అన్నారు.గుర్తింపు సంఘంగా కార్మికుల వాగ్ధానాలను నెరవేర్చడంలో తమ యూనియన్ ముందుందని,సమస్యల పరిష్కారంలో వెనుకడుగు వేసే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలపై త్వరలోనే యాజమాన్యంతో చర్చించబోతున్నామని చెప్పారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు.


సాయిబాబాను చర్లపల్లి జైలుకు తరలించాలి

ప్రభుత్వానికి భార్య వినతి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: రాజద్రోహం నేరం కింద నాగ్‌పూర్ అండా సెల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబాను వెంటనే హైదరాబాద్ చర్లపల్లి జైలుకు తరలించాలని ఆయన సతీమణి వసంత ప్రభుత్వాన్ని కోరారు. అంగవైకల్యంతో పాటు ఆయనకు కిడ్నీ సమస్యలు, కడుపులో కణుతులు పెరుగుతున్నా యని, అయినా జైలు అధికారులు వైద్య సహాయం అందించడం లేదని ఢిల్లీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నుంచి తీసుకెళ్లి మం దులు, పుస్తకాలు కూడీ ఇవ్వకుండా మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని వసంత వాపోయారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఏ క్షణంలో ఏ దుర్వార్త వినాల్సి వస్తుందోనని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

మదర్సాల్లో విశ్వశాంతి బోధనలు



మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ హిదాయత్

అమరావతి, ఆంధ్రప్రభ: ఆధ్యాత్మిక విద్యతో పాటు మదర్సాలలో సహనం, అహింస, విశ్వశాంతి బోధనలు చేయడం జరుగుతుందని ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎండి హిదాయత్ తెలియజేశారు. బుధవారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ మదర్సాల నుంచి ఉగ్రవాదులు వస్తున్నారని షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ వసీం రిజ్వీ ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మదర్సాలలో చదువుకున్న విద్యార్థులు లక్షలాది మంది డాక్టర్లు, ఇంజనీర్లు, అధ్యాపకులు, సాఫ్ట్‌వేర్‌ఇంజనీర్లుగా రాణిస్తూ ప్రజాసేవలతో దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్నారని గుర్తు చేశారు. దాతృత్వం గల ముస్లిం దాతల సహాయ, సహకారాలతో గత 1,400 సంవత్సరాలుగా నడుస్తున్న మదర్సాలు ఇహపర జీవిత సాఫల్యం కోసం మంచి మార్గంలో నడుచుకునేలా విద్యా బోధనలు అందిస్తున్నాయన్నారు. యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగి మెప్పుకోసం రిజ్వీ లాంటి బూటకపు ముస్లిం నేతలు ముస్లిం మత విశ్వాసాలు దెబ్బతినేలా ఇలాంటి అసత్య ప్రచారాలకు తెరలేపటం పరిపాటిగా మారిందని తెలిపారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 30, సబ్‌క్లాజ్ 1,2 ప్రకారం ఆధ్యాత్మిక విద్యను మదర్సాల ద్వారా బోధించే హక్కు ముస్లిం సమాజానికి ఉందని, అటువంటి హక్కును కాలరాసేలా మదర్సాలను మూసివేయాలని రిజ్వీ ప్రకటన చేయడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమంటూ తక్షణమే ఆయన ముస్లిం సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మదర్సాలపై అసత్య ప్రచారం మానుకో : ప్రభుత్వ విప్ షరీఫ్ డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మానవత్వంతో కూడిన ధార్మిక విద్యను ప్రబోధించే మదర్సాలపై అసత్య ప్రచారం చేస్తున్న షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ వసీం రిజ్వీ ముస్లిం సమాజానికి క్షమాపణ చెప్పాలని శాసనమండలి ప్రభుత్వ విప్ ఎం.ఎ. షరీఫ్ డిమాండ్ చేశారు. అజ్ఞానంతో అపవాదులు మోపుతూ ప్రభుత్వాలకు లేఖలు రాస్తున్న రిజ్వీ మతాలను విశ్వసించే వారికి సంక్రమించిన హక్కును అప్రజాస్వామికంగా కాలరాసే ప్రయత్నంగా ఉన్నాయని ఆయన దుయ్యబట్టారు. మదర్సాలలో చదువుతున్న వారిలో పేదలే ఎక్కువగా ఉంటారని, వారికి తిండి, బట్ట, నివాసం ఉచితంగా అందించి సమాజంలో ఉత్తములుగా వారిని తీర్చిదిద్దేందుకు ధార్మిక విద్యతో పాటు స్కూల్ విద్యలను కూడా ప్రబోధిస్తున్న విషయాన్ని రిజ్వీ దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని షరీఫ్ మండిపడ్డారు.

రిజ్వీ నిఖార్సయిన ముస్లిమై సమర్థ కలిగిన వాడైతే మదరసాల జోలికి పోకుండా సిబిఎస్ఈ సిలబస్‌తో ఆరు నుంచి పాఠశాల, వైద్య, ఇంజనీరింగ్, న్యాయశాస్త్ర, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తదితర అన్ని కోర్సులతో ఉచిత విద్య నేర్పే కేంద్ర విద్యాలయాలు ఏర్పాటుచేసి ముస్లిం సమాజంపట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలని షరీఫ్ డిమాండ్ చేశారు.

యువత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు

- సేవా మార్గంవైపు యువత అడుగులు వేయాలి: ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యే ఫిలిప్ సిటోచర్

అమరావతి, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి చంద్రబాబు యువత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని ఏపీ నామినేటెడ్ శాసన సభ్యులు ఫిలిప్ సి టోచర్ అన్నారు. బుధవారం విజయవాడ ఐలాపురం హోటల్లో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ విశిష్ట సేవా పుష్కారాలకు ఆయన అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యువత ప్రపంచానికి, సమాజానికి ఒక వెలుతురు లాంటి వాళ్లని సేవా మార్గం వైపు యువత నడవాలన్నారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమౌతుందని, యువత మంచి కార్యక్రమాలు చేస్తూ నవ్యాంధ్రను అభివృద్ధి పదంలోకి నడపాలన్నారు.

అనంతరం ఎమ్మెల్సీ అమ్మినేని రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో యువత ఎక్కువగా ఉన్న దేశం భారతదేశమని, దాదాపు 38కోట్ల మంది యువకులు భారత దేశంలో ఉన్నారని తెలిపారు. ధైర్యం, సేవా దృక్పధం ఉన్న యువకులు అవసరమని, వారితోనే సమాజాన్ని కోరుకున్న విధంగా మార్చుకోవచ్చన్నారు. సంపద వల్ల సంతోషం రాదని ప్రజలకు సేవ చేయటం ద్వారా తృప్తి, ఆనందం, సంతోషం పొందుతున్నారన్నారు. మానవ సేవ చేయాలని, ఇలా పలు రంగాల వారిని గౌరవించుకోవటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం యునైటెడ్ ఇస్లామిక్ రీసెర్చ్ సెంటర్ అధ్యక్షులు షఫితోపాటు వివిధ రంగాలలో సేవ చేస్తున్న వారికి 2018 స్వామీ వివేకానంద జాతీయ విశిష్టసేవా ప్రతిభా పురస్కారాలు అందించారు.

కృష్ణానదిలో రాజస్థాన్ ఎఫ్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి శిక్షణ

ప్రారంభించిన అగ్నిమాపక శాఖ డీజీ



రాజస్థాన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఫైర్ డీజీ సత్యనారాయణ

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో అగ్నిమాపక, విపత్తు స్పందన సంస్థ ఆధునిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంది. గతంలో ఇతర రాష్ట్రాల్లో అధునాతన శిక్షణ పొందిన స్థాయి నుంచి ఇతర రాష్ట్రాలకు తర్ఫీదు ఇచ్చే స్థాయికి ఎదిగింది. రాజస్థాన్ రాష్ట్ర విపత్తు స్పందన ఫోర్స్ సిబ్బందికి ఏపీ అధికారులు శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 29వ తేదీ వరకు 20రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమం బుధవారం అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ కె.సత్యనారాయణ కృష్ణానదిలో ప్రారంభించారు. ఉండవల్లిలోని ఆక్వా డెవిల్స్ సంక్షేమ సంఘం వద్ద నిర్వహించనున్న ఈ శిక్షణలో 50మంది రాజస్థాన విపత్తు స్పందన ఫోర్స్ సిబ్బంది పాల్గొంటున్నారు. వీరికి మన అగ్నిమాపక శాఖ నుంచి ఐదుగురు సహాయ సహకారాలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ సం దర్భంగా ఇటీవల ఏపీ విపత్తు స్పందన సంస్థ మెరుగు పరుచుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. రానున్న రోజుల్లో మరికొన్ని రాష్ట్రాలకు శిక్షణ ఇచ్చే స్థాయికి ఏపీ విపత్తు స్పందన శాఖ రానుందని ఆయన పేర్కొన్నారు. గత మూడేళ్లుగా వివిధ రాష్ట్రాల్లో అగ్నిమాపక సిబ్బందికి ఇచ్చిన శిక్షణను వివరించారు.

ఐటస్ సంస్థ సహకారంతో రాజస్థాన్ సిబ్బందికి నీటికి ఎదురెళ్లి బాధితులను రక్షించడం, ఉధృతమైన వరదల నుంచి కాపాడటం, బోటు నిర్వహణలో మెళుకువలపై శిక్షణ ఇవ్వను న్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సీతారామ్ ప్రజాపత్, ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ అదనపు డైరెక్టర్ పి.వెంకట రమణ, ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారి మురళీ మోహన్, పీఎస్ఐ(ట్రైనింగ్) మునిస్వామి, ఆక్వా డెవిల్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచంద్రరావు, ఐటస్ సంస్థ డైరెక్టర్ అంకిత్ వాగ్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సి.జాకబ్ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ చొరవతో అక్రమ పార్శిళ్లకు

పన్నుల చెల్లింపునకు అంగీకారం

అమరావతి, ఆంధ్రప్రభ: వివిధ రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి ముఖ్యంగా విజయవాడ, రాజమండ్రి, కాకినాడలకు రైల్వే ద్వారా వచ్చిన అనేక పార్సిల్స్‌కు కమర్షియల్ టాక్స్ అధికారులు పన్నులు, జరిమానాలు విధించేందుకు అంగీకరించారు. ప్రభుత్వానికి ఎటువంటి పన్ను కట్టకుండా, కనీసం బిల్లుల కూడా లేకుండా వచ్చిన ఈ పార్శిళ్లను కమర్షియల్ టాక్స్ అధికారులు, విజిలెన్స్ అధికారులు ఇటీవలికాలంలో పట్టుకున్న సంగతి విదితమే. సంక్రాంతి పండుగ సందర్భంగా లక్షలు పెట్టి కొనుగోలుచేసిన వివిధ రకాల వస్తువులను అధికారులు పట్టుకోవడంతో వర్తకులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ఏపి ఫెడరేషన్ అధ్యక్షులు వక్కలగడ్డ భాస్కరరావు రాష్ట్ర పన్ను అధికారులకు వర్తకుల తరుపున మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించారు. బిల్లు వుండి వే బిల్లు లేని సరుకులకును వర్తకులకు రిలీజ్ చేయడం, బిల్లు కూడా లేని పార్శిళ్లకు ట్యాక్స్, ట్యాక్స్‌కు సమానమైన పెనాల్టి చెల్లించేందుకు వర్తకులు అంగీకరించారు. ఇందుకు అధికారులు కూడా అంగీకరించడంతో ఈ పార్శిళ్ల వ్యవహారం ఒక కొలిక్కి వచ్చింది.

ఇందుకు సహకరించిన కమర్షియల్ ట్యాక్సెస్ కమిషనర్ జె.శ్యామలరావుకి, విజయవాడ 1,2 డివిజన్‌ల జాయింట్ కమిషనర్స్ వై.కిరణ్ కుమార్, వి.రఘునాధ్‌లకు భాస్కరరావు కృతజ్ఞతలు తెలియజేశారు. తమ సమస్యను చొరవతీసుకుని పరిష్కరించినందుకు కాకినాడ, రాజమండ్రి వివిధ ట్రేడ్‌లకు చెందిన వర్తకులు హర్షం వ్యక్తం చేశారు.

నోడల్ అధికారుల నియామకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైకోర్టు కంప్యూటర్ కమిటీల ప్రథమ జాతీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు జిల్లా జడ్జి క్యాడర్‌కు చెందిన ఇద్దరు నోడల్ అధికారులను హైకోర్టు ఎంపిక చేసింది. లక్నోలోని జుడీషియల్ శిక్షణ, పరిశోధన సంస్థ(జేటీఆర్ఐ)లో 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే కంప్యూటర్ కమిటీల జాతీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు విజయవాడలోని 12వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి టి.వేణుగోపాలరావు ,రంగారెడ్డి జిల్లా ఎల్.బీ నగర్‌లోని 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి డి.హేమంతకుమార్‌ను ఎంపిక చేసినట్లు ఉమ్మడి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ ఉత్తర్వులు జారీ చేశారు.

బీసీలకు భరోసా ఇచ్చే దిశగా జగన్ ప్రజాసంకల్పయాత్ర

ప్రజాభిప్రాయంతో బీసీ డిక్లరేషన్: వైకాపా నేత జంగా

అమరావతి, ఆంధ్రప్రభ: వైఎస్ జగన్ చేస్తున్న ప్రజాసంకల్పయాత్ర బీసీలు, వారి జీవితాలకు భరోసా ఇచ్చే విధంగా సాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి చెప్పారు. విజయవాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. సమావేశం అనంతరం జంగా కృష్ణమూర్తి విలేఖరులతో మాట్లాడుతూ ఇప్పటికే 800కి.మీ పూర్తయిన ప్రజాసంకల్పయాత్రలో అనేక వేల మంది బీసీ వర్గాలకు చెందిన ప్రజల కష్టాలు, కడగండ్లు, తెలుగుదేశం ప్రభుత్వం వాగ్దానాలను నమ్మి మోసపోయిన బీసీ సోదరుల విషయాలను స్వయంగా తెలుసుకున్నారని వివరించారు. వారి జీవితాలను సర్వతోముఖాభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టేలా బీసీ అధ్యయన కమిటీ రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని తమకు సూచించారని తెలిపారు. దానిలో భాగంగా తాము ప్రతి జిల్లాలోను పార్టీలకతీతంగా బీసీ మేధావులను, యువకులను, పారిశ్రామికవేత్తలను, కులవృత్తుల వారితో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి నివేదకలు రూపొందిస్తామని తెలిపారు. ఆ నివేదికల ఆధారంగా బీసీ డిక్లరేషన్‌లో పలు పథకాలు, బిసిలకు భరోసా ఇచ్చే ప్రొగ్రామ్‌లు పొందుపరుస్తామని తెలిపారు. బందరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు కొలుసు పార్థసారథి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీలను ఉద్ధరిస్తున్నామని చెబుతోందని అన్నారు. నేడు ప్రభుత్వ పథకాలు కావాలంటే తెలుగుదేశం నేతల ఎదుట బీసీలు చేతులు కట్టుకుని నిలుచునేలా చేస్తోందని అన్నారు. ఇది దారుణమైన విషయం అన్నారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ఈ విధంగా చేయడాన్ని బీసీ సోదరులు ఇప్పటికే గుర్తించారని అన్నారు. బీసీలు రాజకీయంగా అభివృద్ధిలోకి రావాలని కోరారు. బీసీ కార్యవర్గ సమావేశంలో బీసీసెల్ రాష్ట్ర నేతలు కసగోని దుర్గారావు, కె. గురవాచారి, మట్టపర్తి మీరాసాహెబ్, పితాని నరసింహారావు, జువ్వి రాము, రాజశేఖర్, డేరంగుల వెంకటరమణ , మజ్జి శ్రీనివాస్, కొలుసు రాజా, లోగిడి జయన్న, జిల్లా నేతలు బోను రాజేష్ గొలగాని శ్రీనివాసరావు, బొమ్మనశ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తిరుమాను శ్రీనివాసరావు, మట్టపర్తి మురళీకృష్ణ, కెఆర్ పాత్రుడు, శంకర్, భాస్కర్ గౌడ్, సునీల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లును ఉపసంహరించుకోవాలి



సీపీఐ జాతీయ సమితి తీర్మానాలు వెల్లడించిన షమీమ్ ఫైజీ

అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్రం ప్రతిపాదించిన ఆర్థిక తీర్మానం, డిపాజిట్ల పొదుపు బిల్లు (ఎఫ్‌ఆర్‌డీఐ) అత్యంత ప్రమాదరకరమని, తక్షణమే దీనిని ఉపంహరించుకోవాలని సీపీఐ జాతీయ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు విజయవాడలో జరుగుతున్న సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో భాగంగా రెండోరోజైన బుధవారం ఈమేరకు తీర్మానం ప్రవేశపెట్టగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. దాసరి భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను పార్టీ జాతీయ కార్యదర్శి షమీమ్ ఫైజీ వెల్లడించారు. రెండోరోజు సమావేశంలో 5 తీర్మానాలు ఆమోదించినట్లు ఆయన తెలిపారు. బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న డబ్బును పరిరక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు పేరుతో ప్రైవేటుపరం చేయడం అభ్యంతరకరమని సమావేశం తీర్మానించిందని చెప్పారు. ఈ బిల్లుపై దేశ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని కోరారు. మహారాష్ట్రలో జరిగిన భీమా-కోరేగావ్ ఘటన సమావేశం తీవ్రంగా ఖండించిందన్నారు. అలాగే ఆధార్ డేటాబేస్ కుంభకోణాన్ని వెలికి తీసిన 'ట్రిబ్యూన్' జర్నలిస్టు రచన కైరాపై కేసు నమోదు చేయడాన్ని కూడా సమావేశం తీవ్రంగా ఖండించిందన్నారు. తమిళనాడులో ఆరు రోజులుగాచేస్తున్న రవాణా కార్మికుల సమ్మెకుసంపూర్ణ మద్దతును తెలియజేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ ఒప్పందాలు, న్యాయసూత్రాలకు విరుద్ధంగా జెరూసలెంను ఇజ్రాయేల్ రాజధానిగా ప్రకటించడాన్ని నిరశిస్తూ ఆదేశ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు భారత్ పర్యటనను అన్ని పార్టీలు ఖండించాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో చివరిరోజైన గురువారం రాజకీయ ముసాయిదా తీర్మానాలను సాయంత్రం జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో వెల్లడిస్తామన్నారు. కేరళలోని కొల్లంలో ఏప్రిల్ 25 నుండి 29 వరకు జరిగే జాతీయ మహాసభలో ఈ తీర్మానాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించడం జరుగుతుందన్నారు. ఇందుకు ఇంకా రెండు నెలల సమయం ఉన్నందున ఈ లోపు వీటిపై దేశవ్యాప్తంగా చర్చించనున్నట్లు ఫైజీ తెలిపారు.

ఆర్ఎస్ఎస్ చేతిలో మోడీ కీలుబొమ్మ : డీ రాజా

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆర్ఎస్ఎస్ చేతిలో కీలుబొమ్మగా మారిపోయారని ఆశక్తులు చెపినట్లు ఆడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి, పార్లమెంటరీపార్టీ పక్ష నేత డీ రాజా అన్నారు. ఆర్ఎస్ఎస్ శక్తులు మతోన్మాద ఎజెండాతో దేశంలో అరాచకాలను సృష్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర మంత్రులతోపాటు బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన మంత్రులు రాజ్యాంగాన్ని మార్చు చేయాలని కోరడం హిందుత్వ పైశాచికానికి పరాకాష్టగా ఆయన అభివర్ణాఇంచారు. ముఖ్యంగా బీజేపీ ఆధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలు ఏం తినాలి..ఎలా జీవించాలి..ఏ విధమైన దుస్తులు ధరించాలి..ఎలా మాట్లాడాలనే విషయమై నియమ నిబంధనలు విధించడం దారుణమన్నారు. పోలవరం, వంశధార ప్రాజెక్టుల పరంగా నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలను సక్రమంగా అమలు చేయాల్సి ఉందన్నారు. పోలవరం విషయమై ఇటీవల ప్రధాని మోడీతో భేటీ అయి బహుళార్థ సాధక ప్రాజెక్టుగానే కాకుండా జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినందున దానిని త్వరగా పూర్తిచేయాలని కోరినట్లు వివరించారు. ఈ ఫాసిస్టు భావజాలాన్ని ఎదుర్కొనేందుకు లౌకికవాద, ప్రజాతంత్ర భావాలు కలిగిన పార్టీలు, వ్యక్తులతో కలిసి ముందుకు వెళ్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులకు అనుగుణంగా ప్రాంతీయ పార్టీలతో కలిసి పనిచేసేందుకు వామపక్షాలు సిద్ధంగా ఉన్నట్లు రాజా తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాస్తవాలను వక్రీకరిస్తున్న ప్రతిపక్షం

టీడీపీ అధికార ప్రతినిధి లంకా



అమరావతి, ఆంధ్రప్రభ: పున ర్విభజన తరువాత ఏర్పడిన నవ్యాం ధ్ర ప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై వాస్తవా లను వక్రీకరిస్తూ ప్రతిపక్ష వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ విమర్శించారు. బుధవారం గుంటూరు లోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.16 వేల కోట్లతో ఏర్పడిన నవ్యాంధ్ర రూ.1.56 కోట్ల అప్పుతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిందని చెప్పారు. కానీ అవగాహన రాహిత్యంతో పీఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తప్పుడు లెక్కలు చూపుతూ ప్రచారం చేయడం దారుణమన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కనీస అవగాహన లేకుండా విమర్శలు చేయడం ప్రతిపక్ష నేతలకు తగదన్నారు. నవ్యాంధ్ర ఆర్థిక పరిస్థితులపై గతంలో గణాంకాలతో సహా పలుమార్లు వివరించినప్పటికీ తమ వద్దనున్న అరకొర సమాచారంతో కేవలం రూ.96 వేల కోట్లు అప్పు మాత్రమే ఉందని తప్పుడు ప్రచారం చేయడం వైసీపీ నేతల నీఛ రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకొని రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమంలో నిర్మాణాత్మక పాత్రను బాధ్యతగల ప్రతిపక్షంగా నిర్వర్తిస్తే కనీస ప్రజాగౌరవం లభిస్తుందని ఆయన సూచించారు.

బాబు అబద్ధాలకు హద్దే లేదు: వాసిరెడ్డి పద్మ

హైదరాబాద్ , ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని, వాటికి హద్దే లేదని వైఎస్ఆర్ సిపి అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ మండిపడ్డారు. పోలవరం అవకతవకలపై సీపీఐ విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందా ? అని సవాల్ చేశారు. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. పరిశ్రమల పెట్టుబడులపై సీఎం తప్పుడు లెక్కలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా వృద్ధిరేటుపై కూడా బొంకుతున్నారని విమర్శించారు. జాతీయ స్థాయి వృద్ధిరేటు 5.8 శాతం కాగా, ఎపి వృద్ధిరేటు 12.23 శాతంగా చెబుతూ ప్రజలకు టోపీ పెడుతున్నారని వాసిరెడ్డి పద్మ ధ్వజమెత్తారు.

కార్గో విమాన సర్వీసులపై అనిశ్చితి

●గత ఏడాది మేలోనే ఖరారైన రవాణా సంస్థ ●భద్రతాపరమైన అనుమతుల జారీలో జాప్యం ●నిరాశలో వ్యాపార, వాణిజ్య వర్గాలు



(ఫైల్ ఫొటో)

అమరావతి, ఆంధ్రప్రభ: అంతర్జాతీయ విమానాశ్రయంగా రూపుదిద్దుకుంటున్న గన్నవరం విమానాశ్రయం నుంచి కార్గో సేవలు ఎప్పటి నుంచి ప్రారంభం అవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గత ఏడాది మే నెలలోనే ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) కార్గో సేవలకు సంబంధించిన టెండర్లను ఆహ్వానించడంతో పాటు శ్రీపా లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు బాధ్యతలు అప్పగించింది. అంతేకాకుండా కార్గో సేవలను దృష్టిలో ఉంచుకుని గన్నవరం విమానా శ్రయంలో 2000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో టెర్మినల్‌ను కూడా నిర్మించింది. ఈ టెర్మినల్ నిర్మాణం పూర్తయి ఏడాది కాలం కూడా గడిచిపోయింది. ఇంత ప్రక్రియ పూర్తయి నప్పటికి భద్రతపరమైన అనుమతులు జారీ చేయడంలో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆఫ్ ఇండియా (బీసీఎస్ఐ) తీవ్రజాప్యం చేయడంతో గత ఏడాది జూన్‌లోనే ప్రారంభం కావాల్సిన కార్గో విమాన సర్వీసులు ఇంత వరకు ప్రారంభం కాలేదు.

అంతే కాకుండా ఎగుమతి, దిగుమతి అయినా సరుకులు, వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఎక్స్‌రే, స్కానింగ్ యంత్రాలు ఇంత వరకు చేరలేదు. దీంతో మరింత జాప్యం జరుగుతోంది. విభజన అనంతరం నవ్యాంధ్రలో విమాన ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు సరుకు రవాణా కూడా పెరిగింది. వివిధ రకాల వస్తువులు విదేశాలకు ఎగుమతులు, దిగుమతులు కూడా పెరిగాయి.

అయితే సరుకు రవాణాకు సంబంధించి సరైన సౌకర్యాలు, విమానాలు లేకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేవలం నడుస్తున్న సర్వీసుల్లో ఉన్న బెల్లీకార్గో విభాగం ద్వారానే సరుకు రవాణా జరుగుతుంది. దీంతో పెద్ద మొత్తంలో ఎగుమతి, దిగుమతులు జరగడం లేదు. ప్రస్తుతం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై, వారణాసి, విశాఖపట్నం, కడప, తిరుపతి తదితర ప్రాంతాలకు నేరుగా విమాన సర్వీసులు నడుస్తున్నాయి. ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్, ట్రూజెట్ విమానాలు ఇప్పటికే తమ సర్వీసులు నడుపుతుండగా త్వరలో వీటి సరసన ఇండిగో ఎయిర్‌లైన్స్ కూడా నిలవనుంది. రానున్న మార్చి నుంచి ఇండిగో, స్పైస్ జెట్ విమాన సంస్థలు ముంబాయి, తిరువనంతపురం, గోవా, అహ్మదాబాద్, అలహాబాద్, జైపూర్, లక్నో, కోల్‌కత్తా, పట్నా నగరాలకు కూడా సన్నాహాలు చేస్తున్నాయి. మరోవైపు గన్నవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పిస్తూ కేంద్ర విమానయాన సంస్థ తీసుకున్న నిర్ణయంతో విదేశాలకు సైతం ఇక్కడి నుంచే నేరుగా విమానాలు ఎగిరే రోజులు అతి దగ్గర్లో ఉన్నాయి.

వ్యాపార పరంగా ఆసియా దేశాలతో పాటు తూర్పు దేశాలైన సౌది ఆరేబియా, ఓమన్, యూఏయి, కువైట్, ఇరాక్, ఇరాన్, సిరియా, లెబనాన్‌లకు కూడా విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తాయని విమానాశ్రయవర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో కార్గో వ్యాపారం మరింత వృద్ధి చెందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా ఎగుమతి అవుతున్న సరుకులు 30 శాతం వరకు ఆంధ్రప్రదేశ్ నుంచే వెళుతుందని వ్యాపార వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డు మార్గం ద్వారా చెన్నై, హైదరాబాద్‌లకు సరుకును తరలించి అక్కడి నుంచి విమానాల ద్వారా విదేశాలకు పంపాల్సి వస్తుందని దీని వల్ల అదనపు వ్యయంతో పాటు సమయం వృధా అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రానికి చెందిన అశోకగజపతిరాజు కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ అంశంపై దృష్టిసారించి కార్గో సర్వీసులకు అనుమతులు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



తిరుమలకు చేరుకున్న ఉపరాష్ట్రపతి

తిరుమల, ప్రభ న్యూస్: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు కుటుంబ సభ్యులతో కలసి బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. ఉప రాష్ట్రపతి హోదాలో మొదటిసారి తిరుమలకు వచ్చిన ఆయనకు తిరుమలలోని పద్మావతి అతిథిగృహాల వద్ద టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజులు, సీవీఎస్ఓ రవికృష్ణలు పుష్పగుచ్ఛంతో సాదర స్వాగతం పలికారు. ఆయనతో పాటు ప్రభుత్వం తరపున రాష్ట్ర మంత్రి అమర్‌నాథరెడ్డి, అర్బన్ ఎస్పీ అభిషేక్‌మొహంతి ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉన్నారు. రాత్రికి ఉపరాష్ట్రపతి తిరుమలలోనే బసచేసి గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం అవుతారు.

తిరుమల పవిత్రతను కాపాడడం అందరి బాధ్యత

●మద్యం సేవించినా, విక్రయించినా కఠినచర్యలు ●పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన సీవీఎస్ఓ రవికృష్ణ



తిరుమల,ప్రభ న్యూస్: పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను ప్రతి ఒక్కరు కాపాడాలని టీటీడీ సీవీఎస్ఓ రవికృష్ణ విజ్ఞప్తి చేశారు. తిరుమలలోని వరాహస్వామి అతిథి భవన సముదాయంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుమల పవిత్రతను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే నిషేధిత పదార్థాలను ఎవరు వినియోగించినా టీటీడీవిజిలెన్సు సిబ్బందికి తెలియ చేయాలన్నారు. భద్రతా సిబ్బంది మరింత భక్తి భావంతో భక్తులకు సేవలందిస్తున్నట్టు తెలిపారు. టీటీడీ విజిలెన్సు సిబ్బంది తిరునామం ధరించి స్నేహ పూర్వకంగా భక్తుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అలిపిరి టోల్‌గేట్, అలిపిరి, శ్రీవారి మెట్టు నడకమార్గాలలో నిషేధితపదార్థాలు భక్తులు, స్థానికులు, టీటీడీ సిబ్బంది, ఎవరైనా రవాణా చేసినా వినియోగిస్తున్నా ఎడల ఫోన్ 0877-2263695, 0877-22633828 నెంబర్లకు సమాచారం అందించాలని అందించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు సివిఎస్ఓతో విజిఒ రవీంద్రారెడ్డి, ఏవిఎస్ఓలు, విజిలెన్సు సిబ్బంది తిరుమలలోని పలు ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమలలో మద్యం సేవించినా, విక్రయించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని టీటీడీ సీవీఎస్ఓ రవికృష్ణతెలిపారు.

స్వదేశాభివృద్ధికి సేవలందించండి

ప్రవాస భారతీయులకు రాష్ట్రపతి పిలుపు



న్యూఢిల్లీ : ఇతర దేశాల్లో స్థిరపడిన ప్రవాసభారతీయులు అక్కడి అభివృద్ధిలో భాగస్వాములవుతూ,చట్ట సభల్లో ఉన్నత పదవులు పొందడం గర్వకారణమని, అదే సందర్భంలో వారు తమ ప్రాథమ్యాలను స్వదేశాభివృద్ధికి అనుసంధానం చేయాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపు ఇచ్చారు. ప్రవాసీ భారతీయ పార్లమెంటేరియన్ల అంతర్జాతీయ మహాసభల్లో ప్రసంగిస్తూ ఆయన, భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయనీ, వాణిజ్య, పారిశ్రామికాభివృద్ధి కృషిలో ప్రవాస భారతీయులు పాలు పంచుకోవాలని ఆయన సూచించారు. ప్రవాస భారతీయులు వివిధ దేశాలతో సజీవ వారధులని ఆయన అభివర్ణించారు. ఈ మహాసభకు 23 దేశాలకు చెందిన ఎన్నారై పార్లమెంటేరియన్లు హాజరవుతున్నారు.

మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఎన్ని ఆటు పోట్లు వచ్చినా, సుస్థిరంగా ఉన్నందుకు గర్వించాలనీ, భిన్నత్వంలో ఏకత్వమే మన బలమనీ, ఏ దేశానికి వెళ్ళినా, స్వదేశం అభివృద్ధి కృషిలో పాలు పంచుకునేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని రాష్ట్రపతి అన్నారు.సాధారణ పౌరులుగా కాకుండా,అక్కడి చట్టసభల్లో సభ్యులుగా రాణిస్తున్న ప్రవాస భారతీయులు తమ కార్యక్రమాలను స్వదేశాభివృద్ధికి అనుసంధానం చేయాలని ఆయన సూచించారు.మన దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, 2022లో 75వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్నచర్యలు ఫలప్రదమవుతున్నాయి ఎన్నారైలు తోడ్పాటును అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దుబాయ్ ఆర్థిక వ్యవస్థకు ప్రవాస భారతీయులే వెన్నెముకగా ఉన్నారని, అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లలో అత్యధికులు భారతీయులేనని రాష్ట్రపతి గుర్తు చేశారు. న్యూయార్క్, లండన్, గల్ఫ్ ప్రాంతాల్లోని అంతర్జాతీయ ఆర్థికకేంద్రాలు ఎన్నారైల భాగస్వామ్యంతోనే పని చేస్తున్నాయని ఆయన అన్నారు.

సికింద్రాబాద్-కాకినాడ మధ్య జన్‌సాధారణ్ ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి సందర్భంగా పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకుని అడ్వాన్స్ రిజర్వేషన్ అవసరంలేని పూర్తిగా రెండవ తరగతి జనరల్ బోగీలతో జన్ సాధారణ్ ప్రత్యేక రైళ్లను సికింద్రాబాద్ నుండి గుంటూరు - విజయవాడ మీదుగా కాకినాడకు ఈ నెల 11,12 తేదీలలో దక్షిణ మధ్య రైల్వే నడుపుతుంది. ఈ జనసాధారణ్ ప్రత్యేక రైళ్ళన్నీ పూర్తిగా 2వ తరగతి జనరల్ బోగీలతో ఉంటాయి. రైలు వినియోగదారులకు ఉపయోగపడేవిధంగా జనసాధారణతో జంటనగరాల నుండి కాకినాడకు నడుపుతారు. ఈ ప్రత్యేక రైళ్ల సర్వీసులు సికింద్రాబాద్ నుండి గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి పట్టణాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటాయి. రైల్ నెంబర్ 07050 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ జనసాధారణ్ ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో రాత్రి 11.10 గంటలకు బయలుదేరి కాకినాడకు మరుసటి రోజు ఉదయం 11 గంటలకు చేరుకుంటుంది. మార్గమధ్యంలో ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగు రాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లి గూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. ఈ జనసాధారణ్ ప్రత్యేక రైళ్లన్నీ 16 జనరల్ 2వ తరగతి బోగీలు, 2 లగేజీ కం బ్రేక్ వ్యాన్ కోచ్లను కలిగి ఉంటాయి.

రాష్ట్రపతితో గవర్నర్ల కమిటీ భేటీ

న్యూఢిల్లీ: 'సమాజం మార్పులో ఏజెంట్లుగా గవర్నర్ల పాత్ర' అన్న అంశంపై ఒకనివేదికను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు గవర్నర్ల కమిటీ సమర్పించింది. ఈ కమిటీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, తమిళనాడు గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్, యు.పి గవర్నర్ రామ్ నాయక్, త్రిపుర గవర్నర్ తథాగతరాయ్ హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఉన్నారు. గత అక్టోబర్‌లో నిర్వహించిన 48వ గవర్నర్ల సదస్సులో ఈ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీ అభివృద్ధి ప్రక్రియలో గవర్నర్లు నిర్వహిస్తున్న పాత్రను పరిశీలించింది. రాజ్ భవన్‌లు తమ శక్తిమేరకు సమాజాభివృద్ధికి తోడ్పడ్డాయని రాష్ట్రపతికి సమర్పించిన తమ నివేదికలో కమిటీ పేర్కొంది ప్రాధాన్య అంశాలను గుర్తించి వాటిని సాధించడానికి తగిన చర్యలు చేపడితే.. సర్వ శ్రేష్ఠ భారత్ ఆవిష్కార మవుతుందన్నారు.

భారత్‌లో జరభద్రం

అమెరికా పౌరులకు సలహా

న్యూఢిల్లీ: భారత్ సహా వేర్వేరు దేశాల్లో జాగ్రత్తగా ఉండాలని పేర్కొంటూ అమెరికా తన పౌరులకు తాజా ప్రయాణ సలహా జారీ చేసింది. నేరాలు, ఉగ్రవాదం కారణంగా భారత్‌లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అదే సమయంలో జమ్మూ, కాశ్మీర్‌కు ప్రయాణించవద్దని తెలిపింది. సాయుధ ఘర్షణ పొంచి ఉన్న ఇండో-పాక్ సరిహద్దుకు దాదాపు 15 కి.మీ.ల పరిధిలో అడుగుపెట్టవద్దని హెచ్చరించింది.

ఐపీసీ 377ను తొలగించాలి

మాజీ సొలిసిటర్ జనరల్ సంతోష్ హెగ్డే

న్యూఢిల్లీ: హోమోసెక్స్(సజాతీయుల సంపర్కం)కు పాల్పడిన వారిని శిక్షించే చట్టం ఐపీసీ 377ను తొలగించాలని మాజీ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా ఎన్.సంతోష్ హెగ్డే డిమాండ్ చేశారు. 'ఇద్దరు మేజర్లు తమ వ్యక్తిగత ఇష్టంతో సెక్స్‌లో పాల్గొంటే తప్పేంటి.. ఇది నిరోధించే సెక్షన్ 377 తప్పనిసరిగా తొలగించాలి' అని హెగ్డే అన్నారు.

మనుగడలో మహిళలే మిన్న

లండన్: మహిళలు సాధారణ పరిస్థితుల్లోనే కాదు కరవు కాటకాల్లోనూ మగవారి కన్నా మిన్నగా జీవించగలరని తాజా అధ్యయనంలో తేలింది. పురుషుల కన్నా స్త్రీలు బలహీనులనే వాదనను తోసిపుచ్చింది. జన్యువులు లేదా హార్మోన్లు లాంటి జీవసంబంధిత అంశాలు విపత్కర పరిస్థితుల్లో ఎదురీదగలిగే అదనపు సామర్థ్యాన్ని మహిళలకు అందించాయని అమెరికాలో సదరన్ డెన్మార్క్ యూనివర్శిటీ, డ్యూక్ యూనివర్శిటీలకు చెందిన పరిశోధకులు నిర్ధారించారు. యుక్త వయస్సులో కన్నా కూడా శైశవదశలోనే వారికి మనుగడ సామర్థ్యం అలవడింది. అనారోగ్య పరిస్థితులు తలెత్తినప్పుడు మగపిల్లల్ల కన్నా ఆడపిల్లలే వాటిని సమర్థమంతంగా అధిగమించగలరని పరిశోధకులు తేల్చారు. ఇందు కోసం దాదాపు 250 సంవత్సరాల వెనక్కి వెళ్ళారు. గడచిన రెండున్నర శతాబ్దాల కాలంలో కరవు, వ్యాధులు, విపత్తుల వల్ల సంభవించిన మరణాల డేటాను అధ్యయనం చేశారు.

ఇందిర పాత్రలో విద్యాబాలన్



ముంబాయి: బాలీవుడ్ వినూత్న నటి విద్యాబాలన్ చిరకాలస్వప్నం సాకారం కానుంది. భారతదేశపు ఏకైక మహిళ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ పాత్రలో ఆమె వెండితెరపై కనిపించనున్నారు . ఈ మేరకు సాగరికా ఘోష్ రాసిన ఇందిర: ఇండియాస్ మోస్ట్ పవర్ ఫుల్ ప్రైమ్ మినిస్టర్ పుస్తకం రూపాంతర హక్కులను విద్యా బాలన్ దక్కించుకున్నారు. ఇందిర హక్కులు దక్కించుకున్నందుకు ఆనందంగా ఉంది. ఇందిరాగాంధీ పాత్ర పోషించాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. అది సినిమా రూపంలో వస్తుందా లేక వెబ్ సిరీస్ అవుతుందా అనేది ఇంకా నిర్ణయిం చలేదు. దానికి కాస్త సమయం పడుతుంది అని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే విషయాన్ని రైటర్ ఘోష్ సైతం ఫేస్‌బుక్ ద్వారా ధృవీకరించారు. 39 ఏళ్ళ విద్యాబాలన్ చివరిసారిగా తువ్వారీ సలూ అనే చిత్రంలో ఒక మధ్యతరగతి గృహిణి పాత్రలో కనిపించారు.

కిమ్‌తో సమావేశం సంతోషదాయకం

ద.కొరియా అధ్యక్షుడు మూన్

సియోల్ : ఉత్తర కొరియాతో తాము చర్చలు సిద్ధంగా ఉన్నామని, కలిసికట్టుగా శీతాకాల ఒలింపిక్ క్రీడలను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నట్టు దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్-జే-ఇన్ అన్నారు. కిమ్‌తో క్రీడల విషయంతో పాటు మరికొన్ని వాటిపై చర్చ నిర్వహిస్తున్నట్టు మూన్ తెలిపారు. పియోనోచాంగ్‌లో వచ్చేనెల ఒలింపిక్ క్రీడలు నిర్వహించనున్నారు. ఉత్తర కొరియా అణు క్షిపణులతో ప్రపంచాన్ని భయపెడుతున్న విషయం తెలిసిందే. అమెరికాను లక్ష్యంగా చేసుకుని కిమ్ ఈ చర్యలకు పాల్పడుతున్నారు. అదేవిధంగా దక్షిణ కొరియా అమెరికాకు వెన్నుదన్నుగా నిలుస్తున్నది. దీంతో ఉ. కొరియా, ద.కొరియాకు మధ్య నిర్వహించనున్న సమావేశం ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యత చోటు చేసుకుంది. అమెరికాతో తమ సంబంధం వేరు అని, కేవలం తాము రక్షణతో పాటు పలు రంగాల్లో సహాయ సహకారాలు మాత్రమే అందిపుచ్చుకుంటున్నామని మూన్ తెలిపారు. కిమ్ చర్యలతో తామిద్దరం ఆందోళన చెందుతున్నామని చెప్పుకొచ్చారు. ఇలాంటి సమయంలో ఉత్తర కొరియా సమావేశానికి ఒకే చెప్పడం ఎంతో సంతోషంగా ఉందని మూన్ చెప్పారు.

అలిపిరిలో వైభవంగా శ్రీవారి మెట్లోత్సవం

●భారీగా తరలివచ్చిన భక్తజనం ●భక్తి సంప్రదాయ కీర్తనలతో సామూహిక గానం

తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్థానిక అలిపిరి వద్ద వైభవంగా త్రైమాసిక మెట్లోత్సవం జరిగింది. ఉత్సవంలో భాగంగా వివిధ రాష్ట్రాలనుంచి తరలివచ్చిన వందలాదమంది భజన మండళ్ల సభ్యులు రెండురోజులపాటు స్థానిక టీటీడీ రెండో సత్రం ప్రాంతంలో బసచేసి భజనలు చేస్తూ గడిపారు. ఈ సందర్భంగా దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ధార్మిక శిక్షణ, హరిదాస కీర్తనలతో అంత్యాక్షరి, దాస సాహిత్యంపై రసస్పర్థ, సంగీత విభావరి వంటి కార్యక్రమాలలో వివిధ ధార్మిక అంశాల ప్రబోధించారు. ఉత్సవంలో భాగంగా బుధవారం తెల్లవారు జామున 4 గంటలకు ఊరేగింపుగా భజన బృందాల సభ్యులందరూ అలిపిరి వద్దకు చేరుకున్నారు. అక్కడ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్య నేతృత్వంలో పాదాలమండపం వద్ద సంప్రదాయబద్ధంగా మెట్లపూజ జరిగింది. ఆపై భక్తి సంప్రదాయ కీర్తనల సామూహిక గానం నరిహించారు. అనంతరం ఆనంత తీర్థాచార్యులు మాట్లాడుతూ మహా భక్తులైన పురందరదాసు, వ్యాసరాయలు, అన్నమాచార్యులు, కృష్ణదేవరాయలు వంటి మహనీయులు కాలినడకన తిరుమలకు నడిచి వెళ్లి స్వామివారి భక్తివైభవాన్ని విశ్వవ్యాప్తం చేశారన్నారు. చివరగా సంకీర్తనా హారతులిచ్చిన తర్వాత త్రైమాసిక మెట్లోత్సవంలో భాగంగా 3 వేలమందికి పైగా భజన మండళ్ల సభ్యులు నామ సంకీర్తనలు చేస్తూ మెట్లకు పూజలు చేస్తూ తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ఈనెల 16న తిరుమలలో వైభంగా పార్వేట ఉత్సవం

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారికి పార్వేట ఉత్సవం మకర సంక్రమణానికి మరుసటి రోజున అనగా కనుమ పండుగనాడు శ్రీవారి ఆలయంలో టిటిడి ఘనంగా నిర్వహించనుంది. అదే రోజు గోదాపరిణయోత్సవం జరగడం కూడా విశేషం. ఆ రోజు స్వామివారికి ప్రాతః కలహారాధన పూర్తి అయిన తర్వాత శ్రీ మలయప్పస్వామివారు వెండి తిరుచ్చిలో వేంచేస్తారు. వెంటనే ప్రదక్షణ లేకనే పార్వేట మండపంకు వెళ్ళి ఆ మండపం నందు పుణ్యవహం జరిగిన పిమ్మట మంచెలో వేంచేస్తారు. స్వామివారికి ఆరాధన, నివేధనము జరిగి హారతులు అయిన పిమ్మట ఉభయ దేవేరులకు తాళ్ళపాక వారికి, మఠం వారికి మర్యాదలు జరిగి ధన బహుమాన పూర్వకంగా గోష్టివినియోగం జరుగుతుంది. తర్వాత మలయప్పస్వామివారు, శ్రీకృష్ణస్వామివారు మండపంను వదిలి ప్రాంగణంకు విచ్చేస్తారు. శ్రీకృష్ణస్వామివారిని మాత్రము సన్నిధి గొల్ల పూజచేసిన చోటుకు వేంచేపు చేసి పాలు, వెన్న ఆరగింపు హారతి జరిగిన పిమ్మట శ్రీమలయప్పస్వామివారు సన్నిధికి వేంచేపు చేస్తారు. ఆ తర్వాత గొల్ల సమర్పించిన పాలు, వెన్న శ్రీ మలయప్పస్వామివారికి నివేదన, హారతి అయి గొల్లపు బహుమానం జరుగుతుంది. అనంతరం శ్రీ



మలయప్పస్వామివారు ముందుకు కొంతదూరం పరుగెత్తి వారి తరపున అర్చకులు బాణం వేసిన పిమ్మట వెనకకు వస్తారు. ఇలా మూడు సార్లు జరుగుతుంది. ఈ పార్వేట ఉత్సవం భక్తులను ఆద్యాంతం రక్తికట్టిస్తుంది. ఆ తర్వాత శ్రీవారి మహాద్వారంకు వేంచేపు చేస్తారు. అక్కడ హథీరాంజి మఠం వారికి బెత్తము ఇచ్చి తిరువీధి ఉత్సవంలో పాల్గొంటారు. ఈ సమయంలో శ్రీ కృష్ణస్వామి సన్నిధికి విచ్చేస్తారు. శ్రీమలయప్పస్వామివారు ఉత్సవము పూర్తి అయి మహాద్వారం వద్దకు వచ్చిన హథీరాంజి వారి బెత్తము తీసుకుని సన్నిధిలోకి వేంచేపు చేస్తారు. ఇంతటితో ఎంతో వేడుకగా జరిగే పార్వేట ఉత్సవం ఘనంగా ముగుస్తుంది. ఈ ఉత్సవంలో టిటిడి ఉన్నతాధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొంటారు.

ఘనంగా జరగనున్న గోదా పరిణయోత్సవం

ధనుర్మాసంలో చివరిరోజు కనుమ పండుగనాడు శ్రీవారి ఆలయంలో గోదాపరిణయోత్సవం వైభవంగా జరగనుంది. స్వామివారి వక్షస్థల లక్ష్మిని గోదాదేవిగా భావించి గోదా పరిణయోత్సవం ఏకాంతంగా నిర్వహిస్తారు. ఆ రోజు తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో (ఆండాళ్) శ్రీ గోదాదేవి ధరించిన పూలమాలను తిరుమలకు తీసుకువచ్చి శ్రీవారికి అలంకరింప చేస్తారు. ఈ ఉత్సవం కారణంగా శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

విశాఖ మన్యంలో సద్భావన యాత్ర

●మారుమూల ప్రాంతాల్లో పర్యటించిన ఉన్నతాధికారులు ●అభివృద్ధి నిరోధకులను అడ్డుకోవాలని ప్రజలకు పిలుపు



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: విశాఖ మన్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పర్యటించారు. జీకెవీధి మండలంలో స్థానిక దేవరాపల్లి పంచాయితీ, పెదపాడు గ్రామాల్లో వీరు పర్యటించి సద్భావన యాత్రలో పాల్గొన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం నిర్వహించిన ఈ సద్భావన యాత్రలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో అభివృద్ధి జరగకుండా నిరోధిస్తున్న శక్తులను ప్రతఘటించి ప్రభుత్వానికి సహకరించాలని , గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. గత పాతికేళ్ళుగా నక్సల్స్ ప్రభావిత గ్రామంగా ఉన్న పేదపాడులో రెండు నెలల క్రితం రహదారి నిమిత్తం పనులు చేపడుతున్న జేసిబి యంత్రాన్ని నక్సల్స్ కాల్చివేయడానికి ప్రయత్నించినప్పుడు అడ్డుకున్న గ్రామస్తులను కలెక్టర్ అభినందించారు. గ్రామ ప్రజలంతా ఐక్యంగా ప్రభుత్వానికి సహకరించి కావాల్సిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకోవాలన్నారు. ఏజెన్సీలోని గిరిజన గ్రామాలకు పూర్తి స్థాయిలో మంచినీటి సదుపాయం కల్పించేందుకు రూ.3వేల కోట్లతో ప్రణాళికలు తయారు చేసి ఇటీవలే పంచాయితీరాజ్‌శాఖామంత్రి నారాలోకేష్‌కు అనంతగిరిలో జరిగిన జన్మభూమి సభలో అందజేశామన్నారు. త్వరలోనే రూ.1500 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభిస్తున్నామన్నారు. పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ రవిపట్టన్‌శెట్టి మాట్లాడుతూ అభివృద్ధికి దూరంగా ఉన్న ఏజెన్సీ గిరిజన గ్రామాలను నిరంతరం సందర్శించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు కృషి చేస్తామన్నారు. విద్య, వైద్యం, త్రాగునీటి సదుపాయం, స్కిల్‌డవల్‌మెంట్ కార్యక్రమాల అమలకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సద్భావనయాత్రలో జిల్లా ఎస్పి రాహుల్‌దేవ్ శర్మ, పాడేరు సబ్‌కలెక్టర్ డి.కె.బాలాజీ, డిఎస్పి అనీల్‌కుమార్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఏజెన్సీలో ఉన్నతాధికారులంతా పర్యటించడంతో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహిళా కాంగ్రెస్ మార్పు తథ్యమా...?

●యువతకే పెద్దపీట... సోషల్ యాక్టివిస్టులకు ప్రాధాన్యత ●సంక్రాంతి తర్వాతే.. కీలక నిర్ణయం ●పీసీసీల మార్పు కూడా..? ●పావులు కదుపుతున్న యువ నేతలు ●రేసులో భాగ్యలక్ష్మి, రత్నకుమారి, రమణికుమారి

అమరావతి,ఆంధ్రప్రభ: రాహుల్‌గాంధీ ఎఐసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టాక పార్టీలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టే కార్యక్రమం ప్రారంభించారు. రాహుల్‌గాంధీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిని మార్చారు. అస్సాం యువ ఎంపీ సుస్మితాదేవిని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమించారు. అంతకు ముందు ఢిల్లీకి చెందిన శోభా ఓజా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నారు. సోషల్ యాక్టివిస్టులు. ప్రొఫెషనల్ కాంగ్రెస్‌లో చురుగ్గా ఉండేవారికి రానున్న రోజుల్లో కీలక పదవులు దక్కే అవకాశం ఉందన్నది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల అభిప్రాయాలుగా ఉన్నాయి. ఇదే క్రమంలో దేశవ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న పిసిసిలు కొత్త నియామకాలు చేపట్టేంత వరకు ఉంటాయని ఎఐసిసి ఇటీవల ప్రకటించింది. త్వరలో కొత్త నియామకాల ప్రక్రియ ప్రారంభం అయ్యే అవకాశం కనిపిస్తున్నా..త్వరలో కర్ణాటకలో జరుగనున్న ఎన్నికల తర్వాత అన్ని పిసిసిల మార్పు తథ్యమన్న సంకేతాలు పార్టీ ముఖ్యులకు అందుతున్నా.. సంక్రాంతి తర్వాత ఎపిసిసిలో మార్పులు తప్పకపోవచ్చన్న ప్రచారం సాగుతుండటంతో ఎవరికి వారు తమ వంతు ప్రయత్నాలు ప్రారంభించారు. సీనియర్లను పార్టీ ఎప్పటికి వదులుకోదని వారికి ఎఐసిసిలో కీలక బాధ్యతలు అప్పగిస్తారని నాయకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌లో కూడా మార్పులు తప్పకపోవచ్చని తెలుస్తోంది. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలి మార్పు క్రమంలో ఏపి మహిళా కాంగ్రెస్‌లో కూడా మార్పులు ఉంటాయని సాగుతున్న ప్రచారంలో పలువురు ఆశావహులు మహిళా అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారని తెలిసింది. ప్రస్తుత అధ్యక్షురాలు ఎఐసిసిలో కీలక పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కాపు సామాజికవర్గానికి చెందిన ఇద్దరు యువతులు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన మరో ఇద్దరు యువతులు మహిళా కాంగ్రెస్ పదవి కోసం తమ వంతు ప్రయత్నాలను ఇప్పటికే ప్రారంభించారని తెలుస్తోంది. రాజమండ్రికి చెందిన ఆకుల భాగ్యలక్ష్మి, చిలకలూరిపేటకు చెందిన మిరియాల రత్నకుమారి, తూర్పు గోదావరి జిల్లా కాపవరం సర్పంచ్ అమర్‌జహబేగం, విశాఖపట్నానికి చెందిన రమణీకుమారి, బద్వేల్‌కు చెందిన కమలమ్మ రేస్‌లో ఉన్నారని పార్టీ వర్గాల సమాచారం. వీరందరు యువనేతలు కావడమే గాక ఆయా ప్రాంతాల్లో ప్రజలతో కలసి ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసిన సందర్భాలు ఉన్నాయని నాయకులు అంటున్నారు.సోషల్ మీడియా యాక్టివిస్టుగా ఉన్న భాగ్యలక్ష్మికి పలువురు కాంగ్రెస్ పెద్దల ఆశీస్సులు ఉన్నాయి. ఐటి వింగ్‌లో కూడా భాగ్యలక్ష్మి దిట్ట అన్నది కార్యకర్తల అభిప్రాయం. భాగ్యలక్ష్మి తండ్రి సినీనటుడు రజనీకాంత్ వద్ద మేనేజర్‌గా పనిచేశారు. ఆమె విద్యార్థికురాలే గాక సామాజిక స్పృహ కలిగిన యువనేతగా కూడా గుర్తింపు పొందారు. భాగ్యలక్ష్మికి కెవిపి, పళ్లంరాజు ఆశీస్సులు ఉండగా..మిరియాల రత్నకుమారి ఎంపి చిరంజీవి అనుచరురాలిగా పార్టీలో గుర్తింపు పొందారు. రమణీకుమారికి ఎంపి సుబ్బరామిరెడ్డి, ద్రోణంరాజు శ్రీనివాస్‌ల ఆశీస్సులు ఉన్నాయి. ఇక కాపవరం సర్పంచ్ అమర్‌జహబేగం భీమవరం సమీపంలో జరిగిన ఆక్వా ఫ్యాక్టరీ ఆందోళనలో కీలక పాత్ర వహించారు. తనకు మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆమె ఇటీవల ఢిల్లీలో రాహుల్‌గాంధీని కలసిన సందర్భంలో విన్నవించుకున్నారు. బేగం మామ రఫీవుల్లాబేగ్ పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. బేగంకు మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇస్తే తాను డిసిసి అధ్యక్ష పదవిని వదులుకుంటానని ఇప్పటికే పార్టీ పెద్దలకు తెలిపారు కూడా. కమలమ్మ ఆల్‌ఇండియా ఎస్సీ కమిషన్ సభ్యులుగా పనిచేశారు. మహిళా సమస్యలపై కమలమ్మ చేసిన పోరాటాలను ఆమెకు కలసి వచ్చే అంశంగా నాయకులు పేర్కొంటున్నారు. ఏదేమైనా అతి త్వరలో మహిళా కాంగ్రెస్‌కు కొత్త అధ్యక్షురాలి నియామకం జరగడం ఖాయమని సమాచారం.

తొలి టెస్ట్ భారత్ చేజారింది. టీమ్‌ఇండియాకు కలిసి వచ్చే వేదికపై విరాట్ కోహ్లి సేన గెలుపు కాకపోయినా కనీసం మ్యాచ్‌ను డ్రా చేసుకుంటుందేమోనని ఆశగా ఎదురు చూసిన భారత క్రికెట్ అభిమానికి నిరాశే మిగిలింది. పేస్‌కు అనుకూలించిన పిచ్‌పై టీమ్‌ఇండియా బౌలింగ్ మెరుగ్గా ఉన్నా... బ్యాట్స్‌మెన్ ఘోరంగా విఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో యువ ఆల్‌రౌండర్ పాండ్య ఆదుకోకుంటే భారత్ పరిస్థితి మరింత ఘోరంగా ఉండేది. మొత్తానికి కేప్‌టౌన్ టెస్టులో నాలుగో రోజే ఫలితం వచ్చేసింది. నిజానికి ఆట సాగింది మూడు రోజులే. మూడు రోజుల్లో 40 వికెట్లు నేలకూలాయి. విజయానికి.. పరాజయానికి మధ్య తేడా 72 పరుగులే. ధావన్, విజయ్, పుజారా, కోహ్లి, రోహిత్‌లతో కూడిన టాప్, మిడిలార్డర్ ఘోర వైఫల్యం భారత్ విజయాన్ని ఎంతగానో దెబ్బ తీసింది. ఇక భారత్ బ్యాటింగ్‌కు మరింత కఠిన సవాలు విసిరే సెంచూరియన్ వికెట్... కోహ్లి బృందం కోసం ఎదురు చూస్తోంది. మొదటి టెస్టుకు జట్టు కూర్పులో ఆశ్చర్యకర నిర్ణయాలు తీసుకున్న యాజమాన్యం... తన పొరపాటును దిద్దుకుంటుందా? రెండో మ్యాచ్‌కు సరైన కూర్పుతో బరిలోకి దిగుతుందా? వేచి చూడాల్సిందే!

కూర్పు కుదిరేనా!



ఆంధ్రప్రభ, క్రీడావిభాగం

టీమ్‌ఇండియా యాజమాన్యం తుది జట్టు నుంచి ఓపెనర్‌గా సాంకేతికతలో లోపాలు ఎంచలేని కేఎల్ రాహుల్, విదేశాల్లో తిరుగులేని రికార్డు కలిగిన మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ అజింక్య రహానేలను పక్కన పెట్టి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వారి స్థానంలో శిఖర్ ధావన్, రోహిత్ శర్మలను తీసుకుని పొరపాటే చేసింది. బౌన్స్ విపరీతంగా వచ్చే పేస్ పిచ్‌పై ధావన్ బోల్తా పడడం ఇది కొత్తకాదు. విదేశాల్లో టెస్టుల్లో రోహిత్ రికార్డు కూడా మెరుగ్గా లేదు. స్వదేశంలో... అదీ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఫామ్‌ను చూసి వీరిని తుది జట్టులోకి తీసుకున్నారు. దక్షిణాఫ్రికా వంటి పిచ్‌లపై ఆడగల సాంకేతికత ధావన్‌కు లేదు. రోహిత్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. వాస్తవానికి ధావన్‌కు ఓపెనర్‌గా తొలి ప్రాధాన్యం లేదు. కుడి ఎడమల కూర్పు కోసం ధావన్‌ను తీసుకున్నామని కోహ్లి అంటున్నాడు... కానీ ఈ సూత్రం అన్ని సార్లు, అన్ని సందర్భాల్లోనూ వర్తించదు. ధావన్ రెండు సందర్భాల్లోనూ రైజింగ్ డెలివరీకి బలయ్యాడు. ఈ రోజుల్లో జట్లకున్న సాంకేతిక సాయంతో ధావన్ బలహీనతను ఏ జట్టయినా సులువుగా పసికట్టేయగలదు. 2013 డిసెంబరులో చివరి సారిగా భారత్... దక్షిణాఫ్రికాలో రెండు టెస్టులు ఆడింది. జొహన్నెస్‌బర్గ్‌లో డ్రా చేసుకొని...డర్బన్‌లో 10 వికెట్ల తేడాతో ఓడింది. రెండు మ్యాచ్‌ల్లోనూ ధావన్, విజయ్ ఇన్నింగ్స్‌ను ఆరంభించారు. విజయ్ 97 పరుగులు చేయగా.. ధావన్ తంటాలు పడ్డాడు. విజయ్ 2010లో కూడా దక్షిణాఫ్రికా వచ్చినా ఒకే టెస్టు ఆడాడు. రోహిత్ మెరుగ్గా ఆడేందుకు ప్రయత్నించాడు కానీ.. ఆ పాత్రలో అతను బలవంతంగా ఇమిడ్చినట్లు ఉందే తప్ప సహజసిద్ధమైన మిడిలార్డర్ బ్యాట్స్‌మన్‌గా కనిపించలేదు. కొన్ని బంతులకు పరుగులు రాకపోవడంతో రోహిత్ అసహనానికి గురయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌లోనూ అతను ఇదే మాదిరి దృక్పథంతో ఆడాడు. అందుకే విఫలమయ్యాడు. రహానే, రాహుల్‌లు ఇప్పటికే టెస్టుల్లో కుదురుకుని తమను తాము నిరూపించుకున్న ఆటగాళ్లు. ప్రత్యేకించి రహానేది విదేశాల్లో తిరుగులేని రికార్డు. రాహుల్ కూడా వరుసగా 8 అర్ధసెంచరీలతో తనను తాను నిరూపించుకున్నాడు. వాటిలో ఎక్కువగా ఉపఖండంలో సాధించినవే అయినప్పటికీ ఓపెనర్‌గా అతని టెక్నిక్ తిరుగులేనిది. రాహుల్ అన్ని ఫార్మాట్లలోనూ పరుగులు సాధించాడు. దేశవాళీ క్రికెట్‌లోనూ అతని పరుగుల వేట ఆగలేదు. ప్రస్తుత పరిస్థితులు.. సవాళ్ల నేపథ్యంలో తుది జట్టులో చోటుకు ధావన్ కంటే రాహులే తగినవాడు. మూడో ఓపెనర్‌గా అందుబాటులో ఉన్న రాహుల్‌ను సందేహించకుండా తీసుకుంటే మేలు. టీమ్‌ఇండియాకు అతనే అసలుసిసలు ఓపెనర్. తానాడిన ప్రతి విదేశీ పర్యటనలోనూ సెంచరీ సాధించాడు. అతణ్ని ప్రయోగాల పేరుతో మిడిలార్డర్‌లో ఆడించి యాజమాన్యం మరో పొరపాటు చేయకూడదు. రాహుల్ టాప్‌ఆర్డర్‌లోనే ఉండాలి. రోహిత్ స్థానంలో రహానేను తీసుకోవడం ఉత్తమం.

మేలుకోవాలి

మూడు టెస్టుల సిరీస్‌లో తొలి టెస్ట్ ఓడిపోతే... కోలుకొని సిరీస్ గెలవడం అంత సులువుకాదు. ఐతే జట్టు ఓటమి నుంచి పాఠాలు నేర్వగలిగితే రెండో టెస్టును డ్రా చేసుకొని కలిసి వచ్చే జొహన్నెస్‌బర్గ్‌లో గెలిచి సిరీస్‌ను సమమైనా చేయొచ్చు. అందుకే కోహ్లి సేన వెంటనే మేలుకోవాలి. కర్తవ్యాన్ని బోధపరచుకోవాలి!.

సెంచూరియన్‌లో చెలరేగుతారు

తొలి టెస్టు నాలుగో రోజు 10 టీమ్ ఇండియా వికెట్లు నేలకొరిగాయి. ఫిలాండర్ వైవిధ్య భరితంగా బౌలింగ్ చేశాడు. బంతిని రెండు వైపులా స్వింగ్ చేశాడు. ఆరు వికెట్లు తీసి భారత్‌ను కోలుకోకుండా చేశాడు. అతను పడగొట్టిన వికెట్లలో విజయ్, విరాట్, రోహిత్, అశ్విన్‌వి కూడా ఉన్నాయి. ఫిలాండర్ ఒంటి చేత్తో మ్యాచ్‌ను దక్షిణాఫ్రికాకు కట్టబెట్టాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో తక్కువ వేగంతో బంతులు వేసే ఫిలాండరే ఇంత కేప్‌టౌన్‌లో ఇంత ప్రమాదకారి అయితే... మరింత బౌన్స్ ఉండే సెంచూరియన్లో మోర్కెల్, రబాడ మరెంతగా రెచ్చిపోతారో. గాయానికి గురైన డేల్ స్టెయిన్ స్థానంలో క్రిస్ మోరిస్ జట్టులోకి వచ్చే అవకాశ ముంది. తక్కిన టెస్టుల్లోనూ తమ పేసర్లు విశ్రమించబోరని.. నలుగురు పేసర్ల వ్యూహంతోనే బరిలోకి దిగుతామని కోచ్ గిబ్సన్ విస్పష్టంగా చెబుతున్నాడు. అంటే సెంచూరియన్‌లో దక్షిణాఫ్రికా పేస్ మరింత పదునెక్కబోతోందన్నమాట.

క్రీడాప్రభ

మంచులో మెరిసింది

- స్కీయింగ్‌లో భారత్‌కు తొలి అంతర్జాతీయ పతకం అందించిన ఆంచల్



చండీగఢ్: మనాలీ నివాసి ఆంచల్ ఠాకుర్ చరిత్ర సృష్టించింది. స్కీయింగ్‌లో మన దేశానికి తొలి అంతర్జాతీయ పతకం అందించింది. 21 ఏళ్ల ఆంచల్ ... అంతర్జాతీయ స్కీయింగ్ సంస్థ ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి స్కీ (ఎఫ్ఐఎస్) నిర్వహించిన ప్రతిష్ఠాత్మక ఆల్పైన్ ఎజ్దర్ 3200 కప్‌లో కాంస్యం గెలిచింది. ఈ పోటీలు టర్కీలోని ఎర్జురుమ్‌లోని పలండొకెన్ స్కీ కేంద్రంలో జరిగాయి. ఆంచల్ స్లలామ్ విభాగంలో పతకం దక్కించుకుంది. "నెలల పాటు సాగిన శిక్షణ చివరకు ఫలితాన్నిచ్చింది. ఆరంభం మెరుగ్గా చేశాను. ఆధిక్యం కొనసాగించాను. దీంతో మూడో స్థానంలో నిలువగలిగాను" అని ఆంచల్ తెలిపింది. భారత్‌లో శీతాకాల క్రీడలకు పెద్దగా ప్రోత్సాహం కానీ, వసతులు కాని లేకున్నా ఆంచల్ అంతర్జాతీయ పతకం సాధించడం చెప్పుకోదగింది.

యుకి, రామ్‌కుమార్ ముందంజ

మెల్‌బోర్న్: భారత టాప్ సింగిల్స్ ఆటగాళ్లు యుకి బాంబ్రి, రామ్‌కుమార్ రామనాథన్.. ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయర్స్‌లో ముందంజ వేశారు. సుమీత్ నగల్, గణేశ్వరన్ ఇంటిదారి పట్టారు. తొలి రౌండ్లో 15వ సీడ్ బాంబ్రి 1-6, 6-3, 6-4తో కెనడాకు చెందిన బ్రాడ్లే షునర్‌పై గెలవగా... 28వ సీడ్ రామ్‌కుమార్ 6-7 (8), 7-6(3), 6-2తో అమెరికా క్రీడాకారుడు బ్రాడ్‌లే క్లాన్‌ను ఓడించాడు. యుకీ రెండో రౌండ్లో స్పెయిన్‌కు చెందిన కార్లోస్ టబెర్నర్‌తో తలపడతాడు. రామ్‌కుమార్.. ఫ్రాన్స్ ఆటగాడు గ్లెబ్ సఖరోవ్‌ను ఢీకొంటాడు. గణేశ్వరన్ 6-1, 1-6, 2-6తో తొబియాస్ (జర్మనీ) చేతిలోను... నగల్ 6-7 (5), 6-3, 3-6తో గియాని (ఇటలీ) చేతిలోనూ ఓడారు.

ఐర్లాండ్‌లో టీ20లు ఆడనున్న కోహ్లిసేన

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ లో జులై-సెప్టెంబరులో పర్యటనకు ముందు టీమ్ ఇండియా ఐర్లాండ్‌లో టీ20 మ్యాచ్‌లు ఆడు తుంది. 2007 తరువాత ఆ దేశంలో పర్యటించనున్న బారత జట్టు జూన్‌లో అక్కడ రెండు టీ20లు ఆడు తుంది. ఈ 2వ్యాచ్‌లు జూన్ 27న, 29న డబ్లిన్ లో జరుగుతాయి. 2007లో భారత జట్టు ఐర్లాండ్ లో ఓ వన్డే ఆడింది.



వచ్చింది మరో 'గోడ'

- ద్రవిడ్ కొడుకు సెంచరీ కొట్టాడు



బెంగళూరు: మాజీ కెప్టెన్, అండర్ 19 జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ కొడుకు సమిత్ తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్నాడు. కర్ణాటక స్టేట్ క్రికెట్ సంఘం నిర్వహించిన బీటీఆర్ కప్ అండర్ 14 టోర్నమెంట్లో సమిత్ సెంచరీ చేసి జట్టును గెలిపించాడు. సమిత్.. మాల్య అదితి ఇంటర్నేషనల్ స్కూల్ తరపున ఆడాడు. సమిత్ శతకంతో మాల్య అదితి 412 పరుగులు భారీ తేడాతో వివేకానంద స్కూల్‌పై ఘన విజయం సాధించింది. సమిత్ 150 పరుగులు సాధించాడు. ఐతే సమిత్ స్కోరే మ్యాచ్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు కాదు. భారత మాజీ స్పిన్నర్ సునీల్ జోషి కొడుకు ఆర్యన్ జోషి 154 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. వీరిద్దరి విజృంభణలో జట్టు 50 ఓవర్లలో 5 వికెట్లకు 500 పరుగులు సాధించింది. సమిత్, ఆర్యన్‌ల జోరుకు తోడు బౌలర్లు విజృంభించి వివేకానంద 88 పరుగులకే ఆలౌటైంది. సమిత్ వార్తలకెక్కడం ఇదే తొలిసారి కాదు. అండర్ 14 విభాగంలో ఈ చిచ్చర పిడుగు రెండేళ్లుగా సంచలనాలు సృష్టిస్తున్నాడు. 2015లో అండర్ 12 గోపాలన్ క్రికెట్ చాలెంజ్‌లో బెస్ట్ బ్యాట్స్‌మన్ అవార్డు గెలుచుకున్నాడు. సమిత్ మూడు అర్ధసెంచరీలు సాధించాడు. ఫైనల్లో 77 నాటౌట్‌తో పాటు 93, 77 పరుగులు సాధించి మాల్య అదితిని విజేతగా నిలిపాడు. ఇపుడు తండ్రి అండర్ 19 ప్రపంచ కప్‌ను భారత్‌కు గెలిపించే పనిలో న్యూజిలాండ్లో ఉంటే... కొడుకు స్కూలు జట్టుకు విజయం చేకూర్చే పనిలో పడ్డాడు. గురువారం 44వ పుట్టిన రోజు జరుపుకోనున్న రాహుల్ ద్రవిడ్‌కు కొడుకు ముందుగానే బహుమతి ఇచ్చాడన్నమాట!.

భారత జట్టుకు పాండ్య గొప్ప ఆస్తి



కేప్‌టౌన్: హార్దిక్ పాండ్య.. భారత్ జట్టుకు తిరుగులేని ఆల్‌రౌండ్ ఆస్తిగా ఎదుగుతున్నాడని దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ లాన్స్ క్లూసెనర్ అన్నాడు. "తొలి ఇన్నింగ్స్‌లో పాండ్య బ్యాటింగ్ అద్భుతం. పాండ్య ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికా ఒత్తిడిలో పడింది. బారత్‌కు అతను తిరుగులేని ఆస్తిగా మారనున్నాడు. అతనింకా ఎదుగుతున్నాడు. తన బౌలింగ్‌లో మరికొంత పేస్‌ను పెంచుకోగలిగితే అసలుసిసలు ఆల్‌రౌండర్‌గా రూపొందుతాడు" అని క్లూసెనర్ అన్నాడు. "పాండ్య అద్భుత ఆల్‌రౌండర్‌గా ఎదుగుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆడే తీరువల్ల కొన్ని సార్లు విఫలమైనా అతణ్ని సానుకూల దృక్పథంతో ప్రోత్సహిస్తే మంచిది. భారత జట్టులోనైనా, ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్‌లోనైనా అతని చుట్టూ మెరుగైన ఆటగాళ్లున్నారు. వారి సాహచర్యంలో పాండ్య ఎదుగుతాడు. అతణ్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత వారిదే" అని క్లూసెనర్ చెప్పాడు. "మంచి ప్రాక్టీసు మ్యాచ్ ఆడివుంటే ఎపుడైనా మంచిదే. కానీ ఉపఖండంలో ఆడినంత మాత్రాన ఇక్కడ ప్రాక్టీసు మ్యాచ్ ఆడాలని లేదు. ఐతే విదేశీ పరిస్థితుల్లో ప్రాక్టీసు మ్యాచ్ ఆడితే మేలు" అని క్లూసెనర్ అన్నాడు.

బ్రాడ్‌మన్ రికార్డును తిరగరాసిన అఫ్గాన్ టీనేజర్



న్యూఢిల్లీ: అఫ్గానిస్తాన్ టీనేజర్ బషీర్ షా అరుదైన రికార్డు నెలకొల్పాడు. క్రికెట్ చరిత్రలో మరో బ్యాట్స్‌మన్‌కు సాధ్యంకాని విధంగా 18 ఏళ్ల బషీర్.. ఏడు మ్యాచ్‌లలో 12 ఇన్నింగ్స్‌లో 121.77 సగటుతో 1096 పరుగులు సాధించాడు. ఆస్ట్రేలియా బ్యాటింగ్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ ఫస్ట్ క్లాస్‌లో సాధించిన 95.14 సగటును అధిగమించాడు. 1000 పరుగులకు పైగా పరుగులు చేసిన సందర్భంలో ఇంతవరకు బ్రాడ్‌మన్ సగటే అత్యుత్తమం. స్పీన్ ఘర్ రీజియన్ తరపున అరంగేట్రం చేసిన షా... అమో రీజియన్‌పై అజేయంగా 256 పరుగులు సాధించాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో ఇదే రెండో అత్యధిక స్కోరు. భారత మాజీ క్రికెటర్ అమోల్ మజుందార్ 260 పరుగులతో తొలి స్థానంలో ఉన్నాడు. బషీర్ 14 మాసాల కెరీర్లో ఐదు సెంచరీలు... రెండు అర్ధసెంచరీలు సాధించాడు. ఐదు ఇన్నింగ్స్ అనంతరం షా... ట్రిపుల్ సెంచరీ కొట్టి మియాందాద్ తరువాత పిన్న వయసులో ట్రిపుల్ సాదించిన బ్యాట్స్‌మన్‌గా చరిత్రకెక్కాడు. "నాకిది మరచిపోలేని క్షణం. క్రీజులో రెండు రోజుల పాటు నిలిచాను. సునాయాసంగానే ఆడాను. టోర్నీకి ముందు ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాను" అని బషీర్ అన్నాడు.



జకోవిచ్ గెలిచాడు

మెల్‌బోర్న్: ఆరుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత నొవాక్ జకోవిచ్... పునరాగమనాన్ని విజయంతో ఆరంభించాడు. బుధవారం కూయంగ్ క్లాసిక్ టోర్నీ రౌండ్ రాబిన్ పోటీలో జకోవిచ్ 6-1, 6-4తో ప్రపంచ నెంబర్ 5 డొమినిక్ థీమ్‌పై గెలిచాడు. గత వారం కుడి మోచేయి గాయంతో అబుదాబి ఓపెన్ నుంచి వైదొలగిన జకోవిచ్ ఈ విజయంతో .... ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముందు అవసరమైన విశ్వాసాన్ని కూడగట్టుకున్నాడు. "ఇది గొప్ప ఆరంభం. తిరిగి కోర్టు లో ఆడుతున్నందుకు సంతోషంగా ఉంది" అని జకోవిచ్ ఆనందం వ్యక్తం చేశాడు.

సిడ్నీ సెమీస్‌లో బోపన్న జోడి

సిడ్నీ: సిడ్నీ ఇంటర్నేషనల్ డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న, రోజర్ వాస్లెన్ జోడీ సెమీస్ చేరింది. బుధవారం బోపన్న, రోజర్ క్వార్టర్స్‌లో 7-6(5), 7-6(5)తో మార్టిన్, నికోలస్‌పై గెలిచారు.

జాతీయ మహిళల బాక్సింగ్ సెమీస్‌లో సరిత, సోనియా

రోహ్‌తక్: మాజీ ప్రపంచ చాంపియన్ ఎల్ సరితా దేవి (60 కిలోలు), ఆసియా రజత పతక విజేత సోనియా లాథర్ (57 కి.) బుధవారం జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సెమీ ఫైనల్ చేరారు. ఆలిండియా పోలీస్ తరపున ఆడుతున్న సరిత... తొలి రౌండ్లో అరుణాచల్ ప్రదేశ్ బాక్సర్ దుపాక్‌ను ఓడించింది. రైల్వే తరపున ఆడుతున్న సోనియా... ఉత్తరాఖండ్ బాక్సర్ కమలా బిస్త్‌పై 5-0తో గెలిచింది.



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.